# చేయూత పింఛన్లకు కొత్త దరఖాస్తుల స్వీకరణ..

**ఆగస్టు 31 వరకు అవకాశం: డిప్యూటీ కమిషనర్ దుండిగల్..**



- మీసేవ ద్వారా కొత్త పింఛన్లకు ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ..
- తొలిదశలో ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులకు అవకాశం..
- 31 ఆగస్టు 2026 వరకు దరఖాస్తుల స్వీకరణ:డీసీ ఎస్.వెంకట మణికరణ్..
- అర్హులైన వారు గడువులోపు దరఖాస్తు చేసుకోవాలని డిప్యూటీ కమిషనర్ విజ్ఞప్తి..
- చేయూత పోర్టల్‌లో నమోదు చేయించుకోవాలని వెల్లడి..

-5 లో

# పెన్ పవర్

## తెలంగాణ రౌండప్




# ఏసిపి- టిపిఎస్..!

# ఈ అక్రమ షెడ్డుపై చర్యలేవి..?

**చోద్యం చూస్తున్న డిప్యూటీ కమిషనర్..! 'ఎస్‌టిఎఫ్' చర్యలు వర్తించవా సారూ..?**

- దుండిగల్ సర్కిల్ సిఎంసి కార్యాలయానికి కూతవేటు దూరంలోనే ఈ భారీ షెడ్డు..
- ఇంతపెద్ద అక్రమ షెడ్డు నిర్మాణం 'ఏసిపి-టిపిఎస్' తెలియకుండా సాధ్యమేనా.?
- ఫిర్యాదులు వచ్చినా, పత్రికల్లో వార్త వచ్చినా..? చర్యలు లేవంటే అర్థం..?
- ముడుపులు ముట్టాయా..? చర్యలు గోవిందా..! అంతా అవినీతి మయం..
- టౌన్‌ప్లానింగ్ విభాగంలో అక్రమ నిర్మాణాల దందా ముఠా..?

-4లో

- నిరంజన్ కాలనీలో జనార్ధన్ రెడ్డి, లావణ్యల రెసిడెన్షియల్ పర్మిషన్లు..
- వేరువేరు అనుమతులు కమర్షియల్ కాంప్లెక్స్‌గా ఎలా మారాయి..?
- దుండిగల్ టౌన్‌ప్లానింగ్‌లో 'చూసీ చూడనట్టు' వ్యవహారం..!
- రెండు ప్లాట్లకు వేర్వేరు అనుమతులు.. నిర్మాణం మాత్రం ఒక్కటే..!
- 200 అడుగుల నర్సాపూర్ హైవేకు ఆనుకుని భారీ కమర్షియల్ నిర్మాణం..
- పత్రికల్లో వరుస కథనాలు వచ్చినా అధికారుల మౌనం ఎందుకు..?
- అక్రమ నిర్మాణాలపై చర్యలకు ఏర్పాటు చేసిన ఎస్‌టీఎఫ్ ఉత్తుత్తిదేనా..?
- జోనల్ కమిషనర్-సిఎంసి కమిషనర్ దృష్టికి తీసుకెళ్ళినా చర్యలు శూన్యం..
- ఎవరి వాటా వారికి ఉన్నతాధికారులకూ 'మామూళ్ళు' వెళ్తున్నాయని ఆరోపణలు..?
- రూ.లక్షల్లో వేతనాలు సరిపోవడం లేదని, ఈ అక్రమ నిర్మాణాల దందాపై విమర్శలు..?



అధికారుల అండతో అక్రమ షెడ్డులో దర్జాగా పనులు..




సర్కిల్-59 సమీపంలోనే భారీ అక్రమ షెడ్డు నిర్మాణం.. టిజి-బిపాస్ సౌజన్యం..

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
'ఐదు రోజులకు'
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

## హైదరాబాద్‌లో క్లౌడ్ యాంగిల్స్‌గ్లోబల్

# ఇంజినీరింగ్ సెంటర్

## ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్ పెన్ పవర్:** కాలిఫోర్నియా(అమెరికా) కేంద్రంగా పనిచేస్తున్న డీప్‌టెక్, ఎంటర్‌ప్రైజ్ టెక్నాలజీ సంస్థ 'క్లౌడ్ యాంగిల్స్' హైదరాబాద్‌లో తమ 'గ్లోబల్ ఇంజినీరింగ్ సెంటర్'ను ప్రారంభించింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సంస్థలతో కలిసి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసే 'కో-బిల్డ్' విధానంలో ఈ కేంద్రం కీలకంగా వ్యవహరించనుంది. హైదరాబాద్‌లో గురువారం ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో క్లౌడ్ యాంగిల్స్ సీఈఓ ఎన్.రేవతిపతి, ఐటీ శాఖ సలహాదారు సాయికృష్ణతోపాటు సంస్థకు చెందిన పలువురు సీనియర్ అధికారులు పాల్గొన్నారు. 'కొత్త కేంద్రంలో డిజిటల్ టెక్నాలజీ, అప్లికేషన్ డెవలప్‌మెంట్, ఇంజినీరింగ్, డేటా-అనలిటిక్స్, కృత్రిమ మేధ(ఏఐ), ఆటోమేషన్, డిజిటల్ ప్రొడక్టివిటీ, ఇన్నోవేషన్, కార్పొరేట్ సిస్టమ్స్ తదితర విభాగాల్లో సేవలు అందించనున్నాం. రానున్న రెండేళ్లలో ఈ కేంద్రంలో 1,000 మంది ఇంజినీర్లను నియమించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం' అని సంస్థ ప్రతినిధులు వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ... "ప్రపంచస్థాయి గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు హైదరాబాద్ గమ్యస్థానంగా ఎదిగింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో వివిధ రంగాలకు చెందిన 470కుపైగా జీసీసీలు కార్యకలాపాలు



నిర్వహిస్తున్నాయి. అధిక డిమాండ్ ఉన్న ఇంజినీరింగ్ ఉద్యోగాలను సృష్టించడంతోపాటు ప్రత్యేక నైపుణ్యాలను అభివృద్ధి చేయడంలో క్లౌడ్ యాంగిల్స్ వంటి సంస్థల పెట్టుబడులు దోహదపడతాయి. ఏఐ, క్లౌడ్, డేటా, సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్, ఆటోమేషన్, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి రంగాల్లో క్లౌడ్ యాంగిల్స్‌కు ఉన్న సామర్థ్యాలతో హైదరాబాద్‌లోని జీసీసీ వ్యవస్థకు మరింత ఊతం లభించనుంది. దీని ద్వారా ప్రపంచంలోని సంక్లిష్ట సాంకేతిక సవాళ్లపై పనిచేసే అవకాశం మన యువతకు లభిస్తుంది" అని మంత్రి తెలిపారు.

# ముగిసిన భట్టి అమెరికా పర్యటన



**హైదరాబాద్ పెన్ పవర్:** ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రెండు వారాల అమెరికా పర్యటనను పూర్తిచేసుకుని గురువారం రాత్రి హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా శంషాబాద్ విమానాశ్రయంలో ఆయనకు పలువురు ఎమ్మెల్యేలు, మాజీ కార్పొరేషన్ల ఛైర్మన్లు, కాంగ్రెస్ పార్టీ నేతలు ఘనంగా స్వాగతం పలికారు.




# ఏసిపి- టిపిఎస్..!
# ఈ అక్రమ షెడ్డుపై చర్యలేవి..?

**చోద్యం చూస్తున్న డిప్యూటీ కమిషనర్..! 'ఎస్‌టిఎఫ్' చర్యలు వర్తించవా సారూ..?**

- దుండిగల్ సర్కిల్ సిఎంసి కార్యాలయానికి కూతవేటు దూరంలోనే ఈ భారీ షెడ్డు..
- ఇంతపెద్ద అక్రమ షెడ్డు నిర్మాణం 'ఏసిపి-టిపిఎస్' తెలియకుండా సాధ్యమేనా.?
- ఫిర్యాదులు వచ్చినా, పత్రికల్లో వార్త వచ్చినా..? చర్యలు లేవంటే అర్థం..?
- ముడుపులు ముట్టాయా..? చర్యలు గోవిందా..! అంతా అవినీతి మయం..
- టౌన్‌ప్లానింగ్ విభాగంలో అక్రమ నిర్మాణాల దందా ముఠా..?

- నిరంజన్ కాలనీలో జనార్ధన్ రెడ్డి, లావణ్యల రెసిడెన్షియల్ పర్మిషన్లు..
- వేరువేరు అనుమతులు కమర్షియల్ కాంప్లెక్స్‌గా ఎలా మారాయి..?
- దుండిగల్ టౌన్‌ప్లానింగ్‌లో 'చూసీ చూడనట్టు' వ్యవహారం..!
- రెండు ప్లాట్లకు వేర్వేరు అనుమతులు.. నిర్మాణం మాత్రం ఒక్కటే..!
- 200 అడుగుల నర్సాపూర్ హైవేకు ఆనుకుని భారీ కమర్షియల్ నిర్మాణం..
- పత్రికల్లో వరుస కథనాలు వచ్చినా అధికారుల మౌనం ఎందుకు..?
- అక్రమ నిర్మాణాలపై చర్యలకు ఏర్పాటు చేసిన ఎస్‌టీఎఫ్ ఉత్తుత్తిదేనా..?
- జోనల్ కమిషనర్-సిఎంసి కమిషనర్ దృష్టికి తీసుకెళ్ళినా చర్యలు శూన్యం..
- ఎవరి వాటా వారికి ఉన్నతాధికారులకూ 'మామూళ్ళు' వెళ్తున్నాయని ఆరోపణలు..?
- రూ.లక్షల్లో వేతనాలు సరిపోవడం లేదని, ఈ అక్రమ నిర్మాణాల దందాపై విమర్శలు..?


అధికారుల అండతో అక్రమ షెడ్డులో దర్జాగా పనులు..



పోలీస్ స్టేషన్ సమీపంలోని భారీ అక్రమ షెడ్డు.. మరోవైపు నుండి తీసిన దృశ్యం..

**సిఎంసి బ్యూరో, (పెన్ పవర్) ఆగస్టు 13:** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ దుండిగల్ సర్కిల్-59 పరిధిలోని ఈ భారీ అక్రమ షెడ్డు నిర్మాణానికి మూడేళ్ల క్రితమే 'బ్రేక్' పడింది.. ఇప్పుడు మళ్లీ 'గ్రీన్ సిగ్నల్' ఎలా సాధ్యమైందో..? సంబంధిత అధికారులే తేల్చాలి.. దుండిగల్ పోలీస్ స్టేషన్ సమీపంలో, పెట్రోల్ బంకు వెనుకవైపు ఉన్న ఈ అక్రమ షెడ్డు నిర్మాణ పనులు సుమారు మూడేళ్ల క్రితమే ప్రారంభించారు.. అప్పటి మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ ఆదేశాలతో నిర్మాణ పనులు నిలిచిపోయాయి.. ఆ తర్వాత మరో కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ హయాంలోనూ నిర్మాణం ముందుకు సాగలేదని స్థానికులు చెబుతున్నారు.. అయితే ఇప్పుడు మాత్రం అదే నిర్మాణం మళ్లీ ఎలా ఊపందుకుంది..? కరప్షన్ అధికారుల సౌజన్యమా..? లేక షెడ్డుకు ప్రత్యేక అనుమతులు ఏమైనా లభించాయా..? అప్పట్లో నిబంధనలు అడ్డొచ్చి పనులు నిలిచిపోయాయి..? మరి ఇప్పుడు నిబంధనలు మారిపోయాయా..? లేక అధికారుల 'వైఖరి' మారిపోయిందా..? ఈ ప్రశ్నలకు కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్, సిఎంసి కమిషనర్ సమాధానం చెప్పాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.. టౌన్‌ప్లానింగ్ అధికారుల ముసుగులో ఈ అక్రమ నిర్మాణాల దందాపై సిఎంసి కమిషనర్ దృష్టి సారించాలని కోరుతున్నారు.

## మాజీ కౌన్సిలర్ ఫిర్యాదు చేసినా..! బేఖాతర్..!

ఈ అక్రమ షెడ్డు తోపాటు, పలు అక్రమ నిర్మాణాలపై ఓ మాజీ కౌన్సిలర్ ఫిర్యాదు చేసినా, సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సహా టౌన్‌ప్లానింగ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది.. ప్రభుత్వ ఖజానాకు చేరాల్సిన నిధులను, తమ జేబుల్లో వేసుకుంటున్నారని, అనడానికి ఈ అక్రమ షెడ్లతోపాటు, అక్రమ నిర్మాణాలే నిదర్శనమని, ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.. అనుమతుల్లేని షెడ్లు, ప్రమాదకర అక్రమ నిర్మాణాలు ప్రోత్సహించడమే దుండిగల్ టౌన్‌ప్లానింగ్ అధికారుల విధులా అంటూ ఆ మాజీ కౌన్సిలర్ ప్రశ్నిస్తున్నారు.. హెచ్‌ఎండిఏ అనుమతులు పొందాల్సిన భారీ షెడ్లను కూడా, ఎలాంటి పర్మిషన్ లేకపోయినా,టౌన్‌ప్లానింగ్ అధికారులు ప్రోత్సహించడంలో, ఆయన అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని అన్నారు.. అక్రమ నిర్మాణాలపై తక్షణమే చర్యలు చేపట్టకపోతే లోకాయుక్తు వెళ్ళడానికైనా సిద్ధమేనని అధికారులను హెచ్చరించారు..

హైవేకు ఫేసింగ్‌లో ఉన్న ఈ ఒకటే అక్రమ నిర్మాణానికి, వేరువేరు అనుమతుల ప్రకారమే కనిపించినా.. అసలు కథ కమర్షియల్ నిర్మాణంతో మొదలై, ప్రస్తుతం ప్రమాదకర అక్రమ భవనంగా తయారు చేశారని స్థానికులు అంటున్నారు.. రెండు పర్మిషన్లు

### పర్మిషన్‌లు సక్రమమే..! నిర్మాణమే అక్రమం.. అదనంగా సెల్లార్..

తీసుకున్న నిర్మాణ దారులు.. ఓ ఇద్దరు చోటా నాయకులతో సిఫార్సులు చేయించుకుని నిర్మాణం మాత్రం ఒక్కటే కమర్షియల్ కాంప్లెక్స్‌గా చేపట్టడాన్ని, టౌన్‌ప్లానింగ్ అధికారులు ఏసిపి-టిపిఎస్ ప్రోత్సహించడం గమనార్హం.. ప్లాట్ నంబర్-90, 91లకు వేర్వేరుగా రెసిడెన్షియల్ నిర్మాణాలకు అనుమతులు మంజూరైనప్పటికీ, ప్రస్తుతం ఈ రెండు స్థలాలను కలిపి ఒకే భారీ నిర్మాణంగా కమర్షియల్ వినియోగానికి సిద్ధం చేస్తున్నారు.. అదనంగా అక్రమ సెల్లార్ అధికారుల చేతివాటాన్ని బట్టబయలు చేస్తోంది..



అక్రమ షెడ్డు.. అక్రమ నిర్మాణాలపై పెన్ పవర్ వార్త..

## నిరంజన్ కాలనీలో.. అధికారుల చేతివాటం స్పష్టం..?

దుండిగల్ సర్కిల్-59 పరిధిలోని సిఎంసి బహుదూర్‌పల్లి గ్రామం నిరంజన్ కాలనీలో కొనసాగుతున్న ఓ వివాదాస్పద నిర్మాణం పట్టణ ప్రణాళిక అధికారుల పనితీరుపై తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతోంది.. దాదాపుగా ఆ కాలనీలో మొత్తం 300 గజాల ప్లాట్‌లుగా లేఅవుట్ చేసినట్టు సమాచారం.. అయితే ఇద్దరు భార్యాభర్తల పేరుమీద ఉన్న రెండు ప్లాట్లకు కలిపి పర్మిషన్ తీసుకుంటే, అధిక ఫీజుతోపాటు, సెట్‌బ్యాకులు వదలాలి, అందుకే, కరప్షన్ అధికారుల సూచనలు, సలహాలతో అక్రమ కమర్షియల్ కాంప్లెక్స్‌గా నిర్మించేందుకు ముడుపుల ప్రణాళికలు సిద్ధం చేసినట్టు, సంబంధిత అక్రమ కట్టడమే చెబుతోంది.. అధికారిక రికార్డుల ప్రకారం రెండు వేర్వేరు ప్లాట్లకు, ఇద్దరు భార్యాభర్తల పేర్లపై రెసిడెన్షియల్ భవనాల కోసం మంజూరైన రెండు పర్మిషన్లు ఉండగా.. భౌతికంగా మాత్రం వాటిని ఒకే యూనిట్‌గా మార్చి భారీ కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం చేపడుతుంటే.. టౌన్‌ప్లానింగ్ అధికారులు ఒప్పందం ప్రకారం చర్యలు తీసుకోకుండా సహకరించడం చర్చనీయాంశంగా మారింది..

## అధికారుల ముందున్న ప్రశ్నలు..

- రెండు వేర్వేరు రెసిడెన్షియల్ పర్మిషన్లను కలిపి ఒకే నిర్మాణం చేపట్టడానికి అనుమతి ఎవరిచ్చారు..?
- ప్రస్తుతం జరుగుతున్న నిర్మాణం మంజూరైన ప్లాన్‌కు అనుగుణంగానే ఉందా..?
- రెసిడెన్షియల్ పర్మిషన్‌తో కమర్షియల్ కాంప్లెక్స్ ఎలా సాధ్యం..?
- నిర్మాణాన్ని టౌన్‌ప్లానింగ్ అధికారులు ఎప్పుడు, ఎన్నిసార్లు తనిఖీ చేశారు..?
- ఉల్లంఘనలు గుర్తించినట్లయితే ఇప్పటివరకు ఎలాంటి నోటీసులు లేదా చర్యలు తీసుకున్నారు..?
- పత్రికల్లో వరుస కథనాలు వచ్చినప్పటికీ ఎందుకు స్పందించలేదు..?
- సిఎంసి కమిషనర్ నియమించిన చేసిన ఎస్‌టీఎఫ్ టీమ్ ఈ నిర్మాణంపై ఎలాంటి నివేదిక రూపొందించింది..?

## రెండు వేరు వేరు పర్మిషన్‌లతో.. కమర్షియల్ కాంప్లెక్స్..


దుండిగల్ సర్కిల్-59 సిఎంసి పరిధి నిరంజన్ కాలనీలో జనార్ధన్ రెడ్డి, లావణ్యలకు చెందిన, రెండు వేరువేరు అనుమతులు పొందారు.. రెండింటినీ కలిపి ఇంత పెద్ద నిర్మాణం దర్జా అధికారుల కళ్ల ముందే కొనసాగుతున్నా పట్టణ ప్రణాళిక విభాగం ఎందుకు స్పందించడం లేదన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది..

### ప్లాట్ నంబర్-90కు ఒక పర్మిషన్..

అధికారిక రికార్డుల ప్రకారం లావణ్య పేరుతో ఫైల్ నెంబర్ 013564/DUND/00157/IABP/2025, పర్మిట్ నెంబర్ 0094/ DUND/IABP/2025 కింద 30-08-2025న అనుమతి మంజూరైంది.. 235 గజాల విస్తీర్ణం కలిగిన ప్లాట్ నెంబర్-90లో స్టిల్ట్ ఫర్ పార్కింగ్ + రెండు అంతస్తుల రెసిడెన్షియల్ భవనం నిర్మించేందుకు ఇన్‌స్టాంట్ అప్రూవల్ బిల్డింగ్ పర్మిషన్ (IABP) జారీ చేసినట్లు రికార్డులు చెబుతున్నాయి..

### ప్లాట్ నంబర్-91కు మరో పర్మిషన్..

అదే తేదీన జనార్ధన్ రెడ్డి పేరుతో ఫైల్ నెంబర్ 013555/DUND/00156/IABP/2025, పర్మిట్ నెంబర్ 0095/DUND/IABP /2025 కింద మరో అనుమతి జారీ చేశారు. 354 గజాల విస్తీర్ణం కలిగిన ప్లాట్ నెంబర్-91లో కూడా "స్టిల్ట్ ఫర్ పార్కింగ్ + రెండు అంతస్తుల రెసిడెన్షియల్ భవనం" నిర్మించేందుకు అనుమతి ఇచ్చినట్లు అధికారిక వివరాలు వెల్లడిస్తున్నాయి..



బహుదూర్‌పల్లి నిరంజన్ కాలనీలో రెండు అనుమతులు.. ఒకటే కమర్షియల్ కాంప్లెక్స్..




# చేయూత పింఛన్లకు కొత్త దరఖాస్తుల స్వీకరణ..



డాక్టర్ ఎస్. వెంకట మణికరణ్.. డిప్యూటీ కమిషనర్, దుండిగల్ సర్కిల్ సిఎంసి..

## ఆగస్టు 31 వరకు అవకాశం: డిప్యూటీ కమిషనర్ దుండిగల్..

**దుండిగల్, పెన్ పవర్, ఆగష్టు 13:** దుండిగల్ సర్కిల్-59 సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అర్హులైన పేదలు, బలహీన వర్గాలకు సామాజిక భద్రత కల్పించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న 'చేయూత సామాజిక భద్రత పింఛన్ పథకం' కింద కొత్త పింఛన్ల మంజూరుకు చర్యలు చేపట్టింది.. ఇందులో భాగంగా అర్హులైన వారు కొత్త పింఛన్ల కోసం సమీపంలోని మీసేవ కేంద్రాల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించినట్లు దుండిగల్ సర్కిల్-59 డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణి కరణ్ తెలిపారు..


### తొలిదశలో ఈ వర్గాలకు పింఛన్లు..

ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, ఫైలేరియా బాధితులు, తలసేమియా బాధితులు, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులు, హీమోఫీలియా వంటి రక్త సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారు, ఈ పింఛన్లకు అర్హులుగా డిప్యూటీ కమిషనర్ పేర్కొన్నారు..

### మీసేవ ద్వారా దరఖాస్తు..

అర్హులైన వారు సమీపంలోని మీసేవ కేంద్రాన్ని సంప్రదించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు వివరాలను 'చేయూత పోర్టల్'లో నమోదు చేసే ప్రక్రియను కూడా చేపట్టనున్నారు.. కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులను ఆగస్టు 31, 2026 వరకు స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు. అర్హత ఉన్న వారందరూ నిర్ణీత గడువులోపు మీసేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, దుండిగల్ సర్కిల్-59 సిఎంసి డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణి కరణ్ తెలిపారు..

- మీసేవ ద్వారా కొత్త పింఛన్లకు ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ..
- తొలిదశలో ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులకు అవకాశం..
- 31 ఆగస్టు 2026 వరకు దరఖాస్తుల స్వీకరణ:డీసీ ఎస్.వెంకట మణికరణ్..
- అర్హులైన వారు గడువులోపు దరఖాస్తు చేసుకోవాలని డిప్యూటీ కమిషనర్ విజ్ఞప్తి..
- చేయూత పోర్టల్‌లో నమోదు చేయించుకోవాలని వెల్లడి..



శిబిరం నిర్వహకులతో నా పౌండేషన్ వ్యవస్థాపకులు గోగులపాటి..



వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న స్థానికులు..

- గోగులపాటి కృష్ణమోహన్ జన్మదినం సందర్భంగా సీఎమ్మార్ ఆసుపత్రి సౌజన్యం.
- సుమారు 100 మందికి ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు..
- వైద్యుల సూచనల మేరకు 25 మందికి రక్త పరీక్షలు చేశారు..
- అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేత..
- సామాజిక సేవలో భాగంగా ప్రజల ఆరోగ్య పరిరక్షణకు నా ఫౌండేషన్ కృషి..



# నా ఫౌండేషన్ ఆధ్వర్యంలో..! ఉచిత వైద్య శిబిరం..!

**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, ఆగష్టు 13:** మేడ్చల్ జిల్లా సుభాష్‌నగర్ డివిజన్ సూరారం కాలనీలోని లూయిస్ బ్రెయిలీ భవన్‌లో నా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు.. నా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, సీనియర్ జర్నలిస్టు శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు గోగులపాటి కృష్ణమోహన్ జన్మదినాన్ని పురస్కరించుకుని సీఎమ్మార్ హాస్పిటల్, కండ్లకోయ వారి సౌజన్యంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు.. ఈ సందర్భంగా గోగులపాటి కృష్ణమోహన్ మాట్లాడుతూ "సాహిత్యస్య వికాసాయ, రక్షణాయ చ సంస్కృతేః। సామాజిక హితార్థాయ, నా సంస్థా వర్తతే చిరం" అనే ధ్యేయంతో సాహిత్య వికాసం, సామాజిక శ్రేయస్సు, సాంస్కృతిక పరిరక్షణ లక్ష్యాలుగా నా ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.. సామాజిక సేవ, సాహిత్య వికాసం, సాంస్కృతిక పరిరక్షణతో పాటు ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కూడా నా ఫౌండేషన్ తన వంతు కృషి చేస్తుందని చెప్పారు.. సామాన్య ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను ఉచితంగా అందించేందుకు ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు..

శిబిరంలో సుమారు 100 మంది వరకు ఆరోగ్య పరీక్షలు చేయించుకోగా, వైద్యుల సూచనల మేరకు 25 మందికి రక్త పరీక్షలు నిర్వహించారు. వైద్య సేవలు పొందిన వారికి అవసరమైన మందులను సైతం ఉచితంగా అందజేశారు.. ఈ కార్యక్రమంలో డిసబుల్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు అంజయ్య, సీఎమ్మార్ హాస్పిటల్ పీఆర్వో దుర్గాప్రసాద్, శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ప్రధాన సలహాదారు సీనియర్ పాత్రికేయులు రమేష్ సర్వేపల్లి, సంఘం సభ్యులు గడ్డం రాంబాబు, శ్రీధరాచార్యులు, నరేందర్ రెడ్డి, యాదయ్య, రాము, శేఖర్ గౌడ్, సీఎమ్మార్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ ప్రవల్లిక, కోఆర్డినేటర్ రాజ్ నారాయణ్ తదితరులు పాల్గొన్నారు..









హఫీజ్‌పేట్ డివిజన్‌లో హర్ ఘర్ తిరంగా ర్యాలీ..

- వాడవాడలా ఘనంగా హర్ ఘర్ తిరంగా యాత్ర..
- ప్రతి ఇంటా జాతీయ జెండా.. ప్రతి గుండెలో దేశభక్తి..
- తిరంగాతో కదిలిన హఫీజ్‌పేట్.. ఉత్సాహంగా యువత ర్యాలీ..
- దేశ ఐక్యతకు తిరంగా యాత్రే ప్రతీక..!
- వికసిత్ భారత్ కోసం యువత ముందడుగు..!



# హఫీజ్‌పేట్‌లో మార్మోగిన దేశభక్తి నినాదాలు..

**శేరిలింగంపల్లి, పెన్ పవర్, ఆగష్టు 13:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా అభియాన్'లో భాగంగా శేరిలింగంపల్లి నియోజకవర్గం హఫీజ్‌పేట్ డివిజన్‌లో ఘనంగా తిరంగా యాత్ర నిర్వహించారు. డివిజన్ బీజేపీ అధ్యక్షులు కైతాపురం జితేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, హర్ ఘర్ తిరంగా కన్వీనర్ డాక్టర్ అజిత్ కుమార్ సేనాపతి, రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి తోపుగొండ మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు.. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తి స్ఫూర్తిని చాటాలని పిలుపునిచ్చారు. దేశ ఐక్యత, ధర్మం, జాతీయ సమైక్యత కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని అన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్ సాధించాలనే లక్ష్యంతో ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారని పేర్కొన్నారు.. తిరంగా యాత్రలో జాతీయ జెండాలను చేతబూని నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు దేశభక్తి నినాదాలతో పాల్గొన్నారు. కార్యక్రమం సందర్భంగా హఫీజ్‌పేట్ డివిజన్‌లో దేశభక్తి వాతావరణం నెలకొంది.. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు, టిపిసి సభ్యులు పోరెడ్డి బుచ్చిరెడ్డి, బీజేపీ రాష్ట్ర మాజీ కౌన్సిల్ సభ్యులు కలివెముల మనోహర్, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నరసింహారావు, బీజేపీ నాయకులు రాజశేఖర్, మాజీ కౌన్సిలర్ రమణయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు రవి గౌడ్, శ్రీధర్ రావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఆళ్ల వరప్రసాద్, నాయకురాలు పార్వతీ, నాయకులు పవన్, సురేష్ కురుమ, హఫీజ్‌పేట్ డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శి జగన్ గౌడ్, మారెళ్ల వెంకటేశ్వర్లు, డివిజన్ ఉపాధ్యక్షులు ప్రసాద్ పాత్రో, రాజు యాదవ్, నాయకులు మోహన్ ముదిరాజ్, శేఖర్ ముదిరాజ్, రామ్ రెడ్డి, రామచంద్ర యాదవ్, అశోక్ ముదిరాజ్, కృష్ణకాంత్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు. వివిధ మోర్చాల నాయకులు, కార్యకర్తలు, ప్రైవేట్ కళాశాలల విద్యార్థులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



పంపిణీ చేసిన టీ షర్ట్‌లను ధరించిన, విద్యార్థులతో అతిథులు ఉపాధ్యాయులు..






- స్ఫూర్తి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం..
- 80 మంది విద్యార్థులకు టీషర్టులు, టైలు, బెల్టుల పంపిణీ..
- ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల విద్యాభివృద్ధికి స్ఫూర్తి సేవలు..
- గ్రామీణ విద్యార్థుల ఉన్నతే లక్ష్యమని రామసహాయం శ్రీధర్ రెడ్డి వెల్లడి..

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు టీషర్టుల పంపిణీ..

**మహబూబాబాద్, పెన్ పవర్, ఆగష్టు 13:** కంబాలపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు, స్ఫూర్తి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో 80 మంది విద్యార్థులకు టీషర్టులు, టైలు, బెల్టులను పంపిణీ చేశారు. సొసైటీ అధ్యక్షులు రామసహాయం శ్రీధర్ రెడ్డి చొరవతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి అధ్యక్షత వహించారు.. స్ఫూర్తి విద్యాసంస్థల సేవలను పలు పాఠశాలలకు సంబంధించిన ప్రధానోపాధ్యాయులు అభినందించారు.. ప్రతి సంవత్సరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్ఫూర్తి ఎడ్యుకేషనల్ సొసైటీ అనేక సేవలు అందిస్తోందని స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు గిరిజ తెలిపారు.. విద్యార్థుల విద్యాభివృద్ధికి నోట్ పుస్తకాలతో పాటు దుస్తులు, విద్యా సామగ్రి అందించడం అభినందనీయమని కంబాలపల్లి గ్రామ ఉపసర్పంచ్ యాకయ్య అన్నారు.. గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఉన్నత స్థాయికి తీసుకెళ్లడమే తమ సంస్థ లక్ష్యమని రామసహాయం శ్రీధర్ రెడ్డి తెలిపారు.. ఈ కార్యక్రమంలో కొలిశెట్టి సత్యనారాయణ, వినోద్, పాఠశాల సిబ్బంది ఆవునూరి రవి, రాధిక, సువర్ణ, శ్రీజ, కవిత, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టీషర్ట్స్, పంపిణీ చేస్తున్న స్ఫూర్తి ఎడ్యుకేషనల్ సొసైటీ..




# బిడ్ వేసి చేతులెత్తేసిన బిల్డర్.. రూ.5 కోట్లు లాస్

**హైదరాబాద్, ఆగస్టు 13 పెన్ పవర్:**
హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో సంచలనం సృష్టిస్తూ కోకాపేట ప్లాట్ నంబర్ 17లో 4.59 ఎకరాల భూమికి ఎకరాకు రూ. 136.50 కోట్ల చొప్పున బిడ్ వేసిన వజ్రా కన్‌స్ట్రక్షన్స్ చెల్లింపులు చేయలేకపోయింది. దీంతో వేలం నిబంధనల ప్రకారం హెచ్ఎమ్‌డీఏ సదరు సంస్థ చెల్లించిన రూ. 5 కోట్ల ఈఎమ్‌డీ డిపాజిట్‌ను జప్తు చేసింది. ప్రీ-లాంచ్ విక్రయాల ద్వారా నిధులు సమీకరించాలనే వ్యూహం ఫలించకపోవటంతో భూమితో పాటు డిపాజిట్‌నూ సదరు సంస్థ కోల్పోయింది. కాగా, ఈ భూమిని మళ్లీ వేలం వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో అత్యంత ప్రజాదరణ పొందిన కోకాపేట నియోపొలిస్ భూముల వేలంలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. వేలంలో రికార్డు స్థాయిలో భారీ బిడ్ వేసి ప్లాట్‌ను దక్కించుకున్న వజ్రా కన్‌స్ట్రక్షన్స్ అనే రియల్ ఎస్టేట్ సంస్థ నిర్ణీత గడువులోగా నిధులు చెల్లించలేక చేతులెత్తేసింది. దీంతో వేలం నిబంధనలను కఠినంగా అమలు చేస్తూ.. హెచ్ఎండీఏ సదరు నిర్మాణ సంస్థ భద్రతా డిపాజిట్‌గా చెల్లించిన రూ. 5 కోట్ల అర్నెస్ట్ మనీ డిపాజిట్ (ఈఎండీ)ని జప్తు చేసింది.కోకాపేట ప్లాట్ నంబర్ 17లోని 4.59 ఎకరాల భూమికి వజ్రా కన్‌స్ట్రక్షన్స్ ఎకరాకు ఏకంగా రూ. 136.50 కోట్ల చొప్పున బిడ్ దాఖలు చేసి భూములు దక్కించుకుంది. ఈ లెక్కన ఆ భూమి మొత్తం విలువ రూ. 626 కోట్లకు పైగానే ఉంటుంది. అయితే, భూమి కొనుగోలుకు అవసరమైన పూర్తి ఆర్థిక ఇన్వెస్ట్‌మెంట్ సొంతంగా లేనప్పటికీ.. ప్రాజెక్టు ప్రకటించి ప్రీ-లాంచ్, ఓపెన్ టు పబ్లిక్ విక్రయాల ద్వారా కొనుగోలుదారుల నుంచి ముందస్తుగా నిధులు సమీకరించి ప్రభుత్వానికి చెల్లించవచ్చని ఆ సంస్థ భావించింది. అయితే మార్కెట్‌లో ఆశించిన స్థాయిలో ప్రీ-లాంచ్ విక్రయాలు జరగకపోవడంతో ఆ వ్యూహం ఫలించలేదు.నిర్ణీత గడువు ముగిసినా డబ్బులు చెల్లించకపోవటంతో రూ. 5 కోట్ల డిపాజిట్‌ను హెచ్ఎండీఏ జప్తు చేసింది. ఫలితంగా వజ్రా కన్‌స్ట్రక్షన్స్ రూ. 600 కోట్లకు పైగా విలువైన కోకాపేట స్థలంతో పాటు రూ. 5 కోట్ల నగదును కోల్పోయి రెండు రకాలుగా నష్టాన్ని మూటగట్టుకుంది. భవిష్యత్ ప్రాజెక్టు విక్రయాలను నమ్ముకొని ఆర్థిక సామర్థ్యానికి మించి బిడ్లు వేయడం ఎంత ప్రమాదకరమో ఈ ఘటన స్పష్టం చేస్తోందని రియల్ ఎస్టేట్ నిపుణులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా.. చెల్లింపులు జరగని నేపథ్యంలో ప్లాట్ నంబర్ 17 కింద ఉన్న 4.59 ఎకరాల స్థలానికి త్వరలోనే మళ్లీ పారదర్శకంగా బహిరంగ వేలం నిర్వహించాలని హెచ్ఎండీఏ నిర్ణయించింది. గత వేలంలో ఎకరాకు 136.50 కోట్ల కోట్లకు పైగా పలుకగా.. కొత్త వేలంలో ఈ స్థలానికి ఎలాంటి ధర నమోదవుతుందనేది ఇప్పుడు నగర రియల్టీ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.కోకాపేట్‌లోని నియోపోలిస్, గోల్డెన్ మైల్ లేఅవుట్లతో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న విలువైన భూములను వేలం వేయడానికి హెచ్ఎండీఏ సిద్ధమైంది. నిధుల సమీకరణే లక్ష్యంగా వేలానికి రెడీ అయ్యారు. నియోపోలిస్‌లో ఎకరానికి కనీస ధర రూ. 120 కోట్లుగా నిర్ణయించగా.. గోల్డెన్ మైల్‌లో రూ. 70 కోట్లుగా ఫిక్స్ చేసారు. ఈ వేలం ప్రక్రియ ఆగస్టు 24 నుంచి సెప్టెంబర్ 9 వరకు జరగనుంది. మోకిలా, బాచుపల్లి, సూరారం వంటి నివాస ప్రాంతాల్లోని ఖాళీ ప్లాట్లను సైతం ఈ-వేలంలో ఉంచారు.

# మోడీ బహుమతుల వేలంతో 52 కోట్లకు పైగా నిధులు

**న్యూఢిల్లీ, ఆగస్టు 13, పెన్ పవర్:**
భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి వివిధ సందర్భాల్లో అందే కానుకలు, స్మృతిచిహ్నాలు ఇప్పుడు ఆసక్తికరమైన అంశంగా మారాయి. ప్రధాని అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్నప్పుడు, వివిధ సంస్థలు, ప్రముఖులు, రాజకీయ నాయకులు, క్రీడాకారులు, ఇతర ప్రతినిధులు ఆయనకు అనేక రకాల బహుమతులు, మెమెంటోలు అందజేస్తుంటారు. వీటిని కేంద్ర ప్రభుత్వం క్రమం తప్పకుండా ఇ-వేలం నిర్వహించి విక్రయిస్తోంది. ఈ వేలాల ద్వారా ఇప్పటివరకు రూ.52 కోట్లకు పైగా ఆదాయం సమకూరినట్లు కేంద్రం వెల్లడించింది.కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షేఖావత్ లోక్‌సభలో ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో ప్రధాని కానుకల వేలం ద్వారా వచ్చిన ఆదాయానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. నేషనల్ గ్యాలరీ ఆఫ్ మోడర్న్ ఆర్ట్ ఆధ్వర్యంలో ఈ వేలం ప్రక్రియ కొనసాగుతోంది.

2021 తొలి ఎడిషన్: రూ.3.1 కోట్లు
2022 రెండో ఎడిషన్: రూ.3.6 కోట్లు
2023 మూడో ఎడిషన్: రూ.15.8 కోట్లు
2023 నాలుగో ఎడిషన్: రూ.14.4 కోట్లు
2024 ఐదో ఎడిషన్: రూ.11.16 కోట్లు
2024 ఆరో ఎడిషన్: రూ.2.24 కోట్లు
2025 ఏడో ఎడిషన్: రూ.1.89 కోట్లు

ఈ మొత్తం కలిపితే రూ.52 కోట్లకు పైగా నిధులు సమకూరినట్లు కేంద్రం తెలిపింది. సాధారణంగా ప్రధాని మోదీ జన్మదినమైన సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 31 వరకు ఈ-వేలం నిర్వహిస్తున్నట్లు కేంద్ర మంత్రి వివరించారు. 2019కు ముందు ప్రధానికి వచ్చిన



ఇలాంటి కానుకలు, స్మృతిచిహ్నాలను ఆధ్వర్యంలో ఈ తరహాలో వేలం వేసే విధానం లేదని కేంద్ర మంత్రి షేకావత్ పేర్కొన్నారు.ప్రధాని మోదీకి అందిన కానుకల్లో దేశంలోని వివిధ ప్రాంతాల సంస్కృతి, కళా సంపదకు ప్రతీకలైన వస్తువులు ఉంటాయి. పెయింటింగ్స్, శిల్పాలు, హస్తకళా వస్తువులు, మతపరమైన విగ్రహాలు, చేనేత వస్త్రాలు, క్రీడా స్మృతిచిహ్నాలు వంటి అనేక రకాల వస్తువులు వేలానికి వస్తాయి. వాటిలో కొన్ని వస్తువులు భారీ ధరలు పలికాయి. గాజు ఫ్రేమ్‌లో మినియేచర్ ఆలయ నిర్మాణంతో ఉన్న తుల్జా భవానీ విగ్రహం సుమారు రూ.1.03 కోట్ల వరకు ధర పలికినట్లు సమాచారం.అయోధ్య రామమందిర మెటాలిక్ మోడల్, జమ్మూకశ్మీర్ పష్మినా షాల్, తంజావూరు రామ దర్బార్ చిత్రం, నటరాజ మెటాలిక్ విగ్రహం, గుజరాత్ రోగన్ ఆర్ట్ 'ట్రీ ఆఫ్ లైఫ్', నాగాలాండ్ చేనేత షాల్, వివిధ వస్త్రాలు, పెయింటింగ్స్ కూడా వేలంలో ఆకర్షణగా నిలిచాయి. క్రీడలకు సంబంధించిన వస్తువులు కూడా వేలంలో ప్రత్యేక ఆసక్తిని కలిగించాయి. 2024 పారాలింపిక్స్ క్రీడాకారుల బూట్లు, ఒలింపిక్, పారాలింపిక్ క్రీడా సామగ్రితో పాటు స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రాకు సంబంధించిన జావెలిన్, రామమందిరం, కాశీ విశ్వనాథ ఆలయ నమూనాలు వంటి వస్తువులు కూడా వేలంలోకి వచ్చాయి.ప్రధాని మోదీకి వచ్చిన కానుకలను వేలం వేసి వచ్చిన ఆదాయాన్ని నమామి గంగే కార్యక్రమానికి కేటాయిస్తున్నట్లు కేంద్రం తెలిపింది. గంగా నది పరిరక్షణ, పునరుద్ధరణ, కాలుష్య నివారణ వంటి కార్యక్రమాలకు ఈ నిధులను ఉపయోగిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ కార్యక్రమమైన నమామి గంగే కింద గంగా, దాని ఉపనదుల్లో కాలుష్యాన్ని తగ్గించడం, నదీ పునరుజ్జీవనం, పర్యావరణ వ్యవస్థను పరిరక్షించడం వంటి చర్యలు చేపడుతున్నారు. మురుగునీటి శుద్ధి మౌలిక సదుపాయాలు, రివర్‌ఫ్రంట్ అభివృద్ధి, జీవవైవిధ్య పరిరక్షణ తదితర ప్రాజెక్టులు ఇందులో భాగంగా ఉన్నాయి. ఈ కార్యక్రమాన్ని నేషనల్ మిషన్ ఫర్ క్లీన్ గంగా) అమలు చేస్తోంది.ప్రధాని మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కూడా తనకు వచ్చిన కానుకలను వేలం వేసి వచ్చిన మొత్తాన్ని బాలికల విద్య కోసం వినియోగించేవారని కేంద్రం వెల్లడించింది. ఇప్పుడు అదే విధానాన్ని జాతీయ స్థాయిలో కొనసాగిస్తూ.. వేలం ద్వారా వచ్చే ఆదాయాన్ని గంగా నది పరిరక్షణకు కేటాయిస్తున్నట్లు తెలిపింది. అంటే.. ప్రముఖులు, సంస్థలు ప్రధానమంత్రికి అందించిన కానుకలు వ్యక్తిగతంగా భద్రపరచడం కాకుండా.. వాటిని ప్రజా ప్రయోజనానికి ఉపయోగపడేలా వేలం వేస్తున్నారు. వేలం ద్వారా వచ్చిన నిధులు దేశంలోని కీలక పర్యావరణ కార్యక్రమానికి మళ్లించడం ఈ ప్రక్రియలో ప్రధాన అంశంగా నిలుస్తోంది.

# ఇరుముడికి అద్భుతమైన రెస్పాన్స్

**హైదరాబద్, ఆగస్టు 13, పెన్ పవర్:**
మాస్ మహారాజ రవితేజ హీరో గా నటించిన లేటెస్ట్ చిత్రం 'ఇరుముడి' ఈ నెల 21 న ప్రపంచవ్యాప్తంగా భారీ లెవెల్ లో విడుదల అవ్వబోతుంది. ఈ సందర్భంగా ఈ చిత్రానికి సంబంధించిన థియేట్రికల్ ట్రైలర్ ని కాసేపటి క్రితమే విడుదల చేశారు మేకర్స్. ఈ ట్రైలర్ కి ఫ్యాన్స్ , ఆడియన్స్ నుండి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. రవితేజ నుండి ఎలాంటి సినిమాని కోరుకున్నామో , అలాంటి సినిమానే ఈసారి అందిస్తున్నాడు , బ్లాక్ బస్టర్ పక్కా అనే నమ్మకాన్ని ఇచ్చింది ఈ ట్రైలర్. మొదటి నుండి ఈ సినిమా పై ట్రేడ్ లో మంచి బజ్ ఉంది. ఎందుకంటే అయ్యప్ప స్వామి బ్యాక్ డ్రాప్ లో వచ్చే సినిమాలకు ఇప్పుడు డిమాండ్ మామూలు రేంజ్ లో లేదు కాబట్టి. ఆ బజ్ ని రెట్టింపు చేసేలా ఉంది ఈ చిత్రం.అయితే ఈ బ్యాక్ డ్రాప్ లో ఇప్పటి వరకు చాలా సినిమాలు వచ్చాయి , ఇప్పుడు 'ఇరుముడి' కూడా అదే బ్యాక్ డ్రాప్ లో , అదే ఫార్మటు తో దిగితే ఆడియన్స్ రొటీన్ ఫీల్ అవుతారేమో అనే భయం అభిమానుల్లో ఉండేది. కానీ స్టోరీ లైన్ ని సరికొత్తగా డిజైన్ చేసాడు డైరెక్టర్ శివ నిర్వాణ. సాధారణమైన ఆటో డ్రైవర్ గా తన భార్య , బిడ్డ తో చాలా సాధారణమైన మధ్యతరగతి జీవితాన్ని గడిపే హీరో కి ముందుకి బానిస. మందు కొట్టనిదే తన రోజు పూర్తి అవ్వదు. అలాంటి వ్యక్తి అయ్యప్ప మాల ధరించడం , నిష్ఠగా ఉండడం వంటివి ఈ ట్రైలర్ లో చూపించారు. అదే విధంగా తన ఊర్లో ఆడబిడ్డ పై ఎవరైనా చెయ్యి వేస్తే , వాళ్ళ అంతు చూసేంత వరకు నిద్రపోని మనస్తత్వం తో ఇందులో హీరో ఉన్నట్టుగా చూపించారు.నాకు ఉన్నది ఒక్కటే బలహీనత, ప్రతీ ఆడబిడ్డలోనూ నా కూతుర్ని చూసుకోవడం , దాని జోలికి రాకు అంటూ రవితేజ తన మార్కు హీరోయిజం తో చెప్పే డైలాగ్ బాగా ఆకట్టుకుంది. ఇక ట్రైలర్ చివర్లో 'వీరాధి వీరుడు ఎక్కినాడు పల్లకి' అనే ఫేమస్ పాటని , తనదైన శైలిలో రీమిక్స్ చేసాడు మ్యూజిక్ డైరెక్టర్ జీవీ ప్రకాష్ కుమార్. అది పెద్దగా ఆకర్షించలేదు. ఉన్న పాటనే దించి ఉంటే చాలా బాగుండేది అని నెటిజెన్స్ అభిప్రాయం. ఓవరాల్ గా రవితేజ నుండి చాలా కాలం తర్వాత మంచి సినిమా రాబోతుంది అనే ఫీలింగ్ ని కలిగించింది ఈ ట్రైలర్. మరి మీకు కూడా అలాగే అనిపించిందా?, ట్రైలర్ ని చూసిన వాళ్ళు కామెంట్స్ చేయండి.

## హీరోగా హిమాన్షు..

**హైదరాబాద్, ఆగస్టు 13, పెన్ పవర్:**
స్టార్ హీరోలకు సంబంధించిన వారసులు సినీ ఇండస్ట్రీ లోకి హీరో గా ఎంట్రీ ఇవ్వడం కొత్తేమి కాదు , గత దశాబ్దాలుగా అనాదిగా వస్తున్న ఆచారమే ఇది. అదే విధంగా ప్రముఖ రాజకీయ నాయకుల వారసులు కూడా రాజకీయాల్లోకి రావడం మాత్రమే ఇది వరకు మనమంతా చూసాము. సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చినట్టు ఎక్కడా హిస్టరీ లో లేదు. అయితే తొలిసారిగా రాజకీయాల్లో అత్యంత కీలక పాత్ర పోషిస్తున్న ఒక ప్రముఖ రాజకీయ నాయకుడు కుమారుడు సినీ ఇండస్ట్రీ లోకి ఎంట్రీ ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు ఇండస్ట్రీ వర్గాల్లో బలంగా వినిపిస్తున్న వార్త. ఆ రాజకీయ నాయకుడు మరెవరో కాదు . అతని కుమారుడు హిమాన్షు రావు సినీ రంగం లోకి అడుగుపెట్టేందుకు అమితాసక్తి ని చూపిస్తున్నట్టు సమాచారం.హిమాన్షు రావు ఇప్పటికే సంగీతం లో తన ప్రతిభ ని చాటుకున్నాడు. ఇతన్ని సోషల్ మీడియా లో అనుసరించే వాళ్లకు ఈ విషయం ఈపాటికే తెలిసే ఉంటుంది. అయితే సినీ రంగం లోకి మాత్రం ఆయన హీరో గానే ఎంట్రీ ఇవ్వాలని చూస్తున్నాడట. ఇప్పటికే ఆయన నటన లో కోచింగ్ కూడా తీసుకున్నట్టు సమాచారం. ఒక ప్రముఖ నిర్మాత హిమాన్షు ని గ్రాండ్ గా లాంచ్ చేసేందుకు సన్నాహాలు కూడా జరుగుతున్నాయట. టాలీవుడ్ లో వరుస బ్లాక్ బస్టర్స్ ని అందుకుంటున్న ఒక డైరెక్టర్ , రీసెంట్ గానే కేటీఆర్ ని కలిసి ఒక స్టోరీ ని కూడా వినిపించినట్టు టాక్. ఆ డైరెక్టర్ మరెవరో కాదు , అనిల్ రావిపూడి అని ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తున్న గుసగుసలు. దీనిపై ఎలాంటి అధికారిక సమాచారం లేదు కానీ , హిమాన్షు సినీ రంగ ప్రవేశానికి మాత్రం పెద్ద ఎత్తున ఏర్పాట్లు జరుగుతున్న విషయం వాస్తవం.ఇదంతా పక్కన పెడితే హిమాన్షు ఈ పోటీ వాతావరణాన్ని తట్టుకొని సినీ ఇండస్ట్రీ లో రాణించగలడా?, కేసీఆర్ కుటుంబానికి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులు ఉన్నారు. వీళ్ళు ఈ కుటుంబాన్ని దేవుడిలాగా పూజిస్తుంటారు. కచ్చితంగా హిమాన్షు నటించే మొదటి సినిమాకు అద్భుతమైన ఓపెనింగ్స్ ని వీళ్ళు అందిస్తారు. కానీ ఆ తర్వాత ఆయన దాన్ని నిలబెట్టుకొని ఇండస్ట్రీ లో ఎలాంటి కథలను ఎంచుకుంటూ ముందుకు వెళ్తాడు అనేదే చూడాలి.

## డీలిమిటేషన్ కు తమిళనాడు క్లియర్

**చెన్నై, ఆగస్టు 13 పెన్ పవర్:** కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియపై తమిళనాడు శాసనసభ అత్యంత ప్రాధాన్యత కలిగిన తీర్మానాన్ని ఆమోదించింది. జనాభా ప్రాతిపదికన మాత్రమే స్థానాల సంఖ్యను పెంచితే దక్షిణ భారత రాష్ట్రాల ప్రాతినిధ్యం తీవ్రంగా దెబ్బతింటుందనే ఆందోళనలు ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం మూడు స్పష్టమైన డిమాండ్లను సభ ముందుకు తెచ్చి ఏకగ్రీవంగా ఆమోదింపజేసింది.తీర్మానంలో పొందుపరిచిన ప్రధాన ప్రతిపాదనల ప్రకారం--- ప్రస్తుతం అమల్లో ఉన్న 1971 జనాభా ప్రాతిపదికన లోక్‌సభ స్థానాల కేటాయింపు నిష్పత్తిని యథాతథంగా కొనసాగించాలి. ఒకవేళ అనివార్య కారణాల వల్ల స్థానాల సంఖ్యను పెంచాల్సి వస్తే, ఆ పెంపును కూడా 1971 నాటి జనాభా నిష్పత్తి ప్రకారమే చేపట్టాలి. జనాభా నియంత్రణ , సామాజిక-ఆర్థిక అభివృద్ధి పథకాలను సమర్థవంతంగా అమలు చేసినందుకు తమిళనాడుతో పాటు ఇతర దక్షిణ భారత రాష్ట్రాలను శిక్షించేలా పార్లమెంటరీ స్థానాల సంఖ్యను తగ్గించకూడదనేది మరో కీలక డిమాండ్.అంటే, మూడింటిలో ఏ డిమాండ్ చూసినా.. పార్లమెంట్‌లో దక్షిణాది రాష్ట్రాల ప్రస్తుత ప్రాతినిధ్య శాతాన్ని భవిష్యత్తు పునర్విభజనలోనూ ఖచ్చితంగా కాపాడాలనేదే తమిళనాడు ప్రభుత్వ స్పష్టమైన వైఖరి. ప్రస్తుతం ఉన్న స్థానాల నిష్పత్తిని యథాతథంగా కొనసాగించడం లేదా లోక్‌సభ స్థానాలు పెరిగినా.. ఇప్పుడు పార్లమెంట్‌లో ఆయా రాష్ట్రాలకు ఎంత శాతంలో ప్రాతినిధ్యం ఉందో అదే శాతాన్ని కొనసాగించేలా పెంపు నిర్ణయించాలని స్పష్టం చేస్తోంది.

# ఫేస్ బుక్ ఫ్రెండ్ తో రిలేషన్.. నిద్రమాత్రలిచ్చి భర్తను లేపేసింది!



**హైదరాబాద్  పెన్ పవర్:** వివాహేతర సంబంధాలతో జరుగుతున్న హత్యలు తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయి. నూరేళ్ల వివాహ బంధాన్ని, పవిత్రమైన దాంపత్య జీవితాన్ని తృణప్రాయంగా తెంచుకుంటూ, కేవలం క్షణికమైన ఆకర్షణ కోసం నిండు జీవితాలను బలి తీసుకుంటున్న వైనం విస్మయానికి గురి చేస్తోంది. తాజాగా చిత్తూరు జిల్లా పీలేరు డిష్ కాలనీకి చెందిన మంగినేని వెంకటసుబ్రహ్మణ్యం (45) అనే వ్యక్తి తన భార్య, ఆమె ప్రియుడు చేతిలో దారుణ హత్యకు గురైన ఘటన తీవ్ర సంచనలంగా మారింది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం నిందితులు సుబ్రహ్మణ్యాన్ని హత్య చేసి అనంతరం మృతదేహాన్ని రోడ్డుపై పడేశారు. హత్యను రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించాలని చూశారని ఎస్పీ ధీరజ్ వెల్లడించారు.

**ఫేస్ బుక్ పరిచయంతో అనైతిక సంబంధం**

ఈ ఘటనకు ప్రధానంగా నిందితుల మధ్య ఏర్పడిన పరిచయమే చర్చకు దారితీస్తోంది. నిందితురాలికి ఫేస్‌బుక్ ద్వారా పరిచయమైన వ్యక్తితో ఏర్పడిన వివాహేతర సంబంధమే దారుణానికి దారితీసిందని అంటున్నారు. తమ బంధానికి భర్త అడ్డు వస్తున్నాడని భావించి, పథకం ప్రకారం హత్య చేశారని పోలీసులు చెబుతున్నారు. నిద్రమాత్రలు కలిపిన ఆహారం తినిపించి, భర్త గాఢనిద్రలో ఉండగా ఇనుప రాడ్, గుండ్రాయితో తల పగులగొట్టి దారుణంగా అంతమొందించారని, అనంతరం ఆ మృతదేహాన్ని జాతీయ రహదారిపై పడేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు ప్రయత్నించారని పోలీసులు చెబుతున్నారు. సాంకేతిక ఆధారాలతో ఈ కేసును ఛేదించి నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్పీ వెల్లడించారు.

**ఆందోళన కలిగిస్తున్న గణాంకాలు**

ఈ ఘటన ఇటీవల పెరుగుతున్న నేర సంస్కృతికి నిదర్శనంగా చెబుతున్నారు. ఇలాంటి నేరాలు వరుసగా వెలుగుచూడటంపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. గత కొన్నేళ్లుగా వివాహేతర సంబంధాల వల్ల జరుగుతున్న నేరాల శాతం గణనీయంగా పెరిగిందని అంటున్నారు. ఒక రిపోర్టు ప్రకారం ఏపీలో నమోదైన హత్యకేసుల్లో దాదాపు 58 శాతం వరకు కుటుంబ వివాదాలు, వివాహేతర సంబంధాల వల్ల జరిగినవేనని అంటున్నారు. దేశవ్యాప్తంగా కూడా ఈ పరిస్థితి ఆందోళనకరంగా ఉందని చెబుతున్నారు. హత్యకు గురైన భర్తలలో అధిక శాతం భార్యల వివాహేతర సంబంధాల నేపథ్యంలోనే ప్రాణాలు కోల్పోతున్నారని చెబుతున్నారు. కుటుంబ సంబంధాల్లో తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్న ఈ ధోరణులకు పలు కారణాలు ఉన్నాయని విశ్లేషిస్తున్నారు. ప్రధానంగా సామాజిక మాధ్యమాల ప్రభావం ఎక్కువై కుటుంబ సంబంధాలు క్షీణిస్తున్నాయని అంటున్నారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి వేదికల ద్వారా తెలియని వ్యక్తులతో పరిచయాలు పెరగడం, అవి క్రమంగా అక్రమ సంబంధాలకు దారితీయడం ఒక ముఖ్య కారణంగా చెబుతున్నారు. బంధాల్లో ఉండే బాధ్యత, నమ్మకం కంటే క్షణికమైన ఆనందానికే ప్రాధాన్యతనివ్వడం వల్ల ఇలాంటి దారుణాలు చోటుచేసుకుంటున్నాయని వ్యాఖ్యానిస్తున్నారు.

కాగా, వివాహేతర సంబంధాన్ని నేరం కాదని సుప్రీంకోర్టు తీర్పు కూడా ఈ ధోరణులు పెరగిపోవడానికి ఒక కారణంగా నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. అదేసమయంలో ఆధునిక పోకడల వల్ల వివాహం అనేది ఒక పవిత్రమైన బంధంగా కాకుండా, కేవలం ఒప్పందంగా మారిపోయిందని, విలువల పట్ల గౌరవం తగ్గిపోయిందని విశ్లేషిస్తున్నారు. ఒక్క క్షణం ఆలోచన లేని నిర్ణయం మొత్తం కుటుంబాన్ని, పిల్లల భవిష్యత్తును చిన్నాభిన్నం చేస్తుందనే విషయాన్ని గుర్తిస్తేనే ఈ తరహా నేరాలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని అంటున్నారు.

# బండికి కీలక బాధ్యతలు

**హైదరాబాద్, ఆగస్టు 13  పెన్ పవర్:**

తెలంగాణలో ఏలాగైనా అధికార పీఠాన్ని దక్కించుకోవడమే లక్ష్యంగా కమలం పార్టీ పావులు కదుపుతోంది. ఈ క్రమంలోనే రాబోయే అసెంబ్లీ సమరానికి పార్టీని సిద్ధం చేసేందుకు నేతృత్వంలో మార్పులు ఉంటాయా, లేక ప్రస్తుత సారథ్యాన్నే కొనసాగిస్తారా అనే అంశం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావును తప్పించి, గతంలో పార్టీని పరుగులు తీటించిన కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు మళ్లీ రాష్ట్ర పార్టీ పగ్గాలు అప్పగిస్తారనే ప్రచారం జోరుగా సాగుతోంది.రాజకీయ వర్గాల్లో బండి సంజయ్ పేరు ప్రముఖంగా వినిపిస్తున్నప్పటికీ, బీజేపీ జాతీయ నాయకత్వం నుంచి మాత్రం నాయకత్వ మార్పుపై స్పష్టమైన సంకేతాలేవీ వెలువడలేదు. షెడ్యూల్ ప్రకారం తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు 2028లో జరగాల్సి ఉంది. ఒకవేళ కేంద్రం ప్రతిపాదిస్తున్న 'జమిలి' విధానం అమల్లోకి వస్తే, ఇవి 2029 మే లేదా జూన్ నాటికి మారే అవకాశం ఉంది. ఈ లెక్కన ప్రస్తుత అధ్యక్షుడు రాంచందర్ రావు పదవీకాలం ఇంకా సుమారు రెండేళ్లకు పైగా ఉంది. ఎన్నికలకు ఇంకా తగినంత సమయం ఉన్నందున, ఇప్పుడు హడావుడిగా అధ్యక్షుడిని మార్చడం వల్ల పార్టీలో నూతన అసంతృప్తులు, సమన్వయ లోపాలు తలెత్తే ప్రమాదం ఉందని అధిష్ఠానం భావిస్తున్నట్లు తెలుస్తోంది.రాష్ట్ర అధ్యక్ష పదవి రేసులో కేవలం బండి సంజయ్ మాత్రమే కాకుండా మరికొందరు అగ్రనేతలు కూడా ఉన్నారు. తెలంగాణలో బీజేపీని దూకుడుగా ముందుకు తీసుకెళ్లిన అనుభవం బండి సంజయ్ కి ఉంది. కార్యకర్తలలో ఉన్న విపరీతమైన క్రేజ్, అధికార పార్టీకి గట్టి పోటీ ఇవ్వగలరనే నమ్మకం ఆయనకు సానుకూల అంశాలు. ఇక ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్, రఘునందన్ రావు కూడా పార్టీ అధ్యక్ష పీఠం ఆశిస్తున్నారు. క్షేత్రస్థాయిలో మంచి పట్టున్న ఈ సీనియర్ ఎంపీలు కూడా అధ్యక్ష బాధ్యతల కోసం జాతీయ నాయకత్వంతో సంప్రదింపులు జరుపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.అయితే నూతన అధ్యక్షుడిని నియమిస్తే, ఆయన రాష్ట్రవ్యాప్తంగా పార్టీపై పూర్తి పట్టు సాధించడానికి కొంత సమయం పడుతుంది. ఈ విరామం ఎన్నికల సమయానికి పార్టీకి ప్రతికూలంగా మారవచ్చని కొందరు విశ్లేషిస్తున్నారు. అందుకే అధ్యక్షుడిని మార్చడం కంటే, రాంచందర్ రావునే పదవిలో కొనసాగిస్తూనే.. రేసులో ఉన్న ఇతర కీలక నేతలకు వివిధ కీలక బాధ్యతలు అప్పగించాలనే ఆలోచనలో హైకమాండ్ ఉన్నట్లు సమాచారం. ముఖ్యంగా నియోజకవర్గాల వారీగా పార్టీని బలోపేతం చేయడం, బలమైన సామాజిక వర్గాలను బీజేపీ వైపు తిప్పుకోవడం, నాయకుల మధ్య సమన్వయాన్ని పెంచడంపైనే పార్టీ దృష్టి సారిస్తోంది.మొత్తానికి, బండి సంజయ్ లేదా ఇతర నేతల పేర్లు ఎంతగా ప్రచారంలో ఉన్నప్పటికీ, ప్రస్తుతానికి రాంచందర్ రావు నేతృత్వంలోనే కమలనాథులు ముందుకు సాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే 'జమిలి' నిర్ణయం, మారే రాజకీయ సమీకరణాలను బట్టి చివరి నిమిషంలో హైకమాండ్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి!

# మండలిలో జన్ జీ...

**వరంగల్, ఆగస్టు 13  పెన్ పవర్:**

తెలంగాణ రాజకీయం ఎప్పుడూ రసవత్తరంగానే ఉంటుంది. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు ముగిసినా.. ఇప్పుడు రాష్ట్రంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల వేడి అప్పుడే మొదలైంది. సాధారణంగా ఎన్నికల సమయానికి కొన్ని నెలల ముందు హడావుడి కనిపించడం సహజం, కానీ ఈ సారి ఏకంగా ముందే ప్రధాన రాజకీయ పార్టీల తరఫున యువ నాయకులు, కొత్తతరం ఆశావాహులు క్షేత్రస్థాయిలో పావులు కదుపుతున్నారు. ముఖ్యంగా గ్రాడ్యుయేట్ స్థానాల్లో విద్యావంతులు, యువత ఓటర్లుగా ఉండటంతో సాంప్రదాయ రాజకీయ సీనియర్ల కంటే ఫైర్‌బ్రాండ్ నాయకత్వం, విద్యాధికులైన యువ నేతల వైపే పార్టీలు మరియు ఓటర్లు మొగ్గు చూపే ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది.తెలంగాణలోని ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలు రాబోయే కాలంలో అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి.  హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ పట్టభద్రుల నియోజకవర్గానికి ప్రస్తుతం బీఆర్ఎస్ నేత సురభి వాణీదేవి ప్రాతిపదికన ఉన్న ఈ సీటు గడువు 2027 మార్చితో ముగుస్తుంది. రాజధాని నగరం, ఐటీ కారిడార్ విస్తరించి ఉన్న ప్రాంతం కావడంతో ఇక్కడ గెలుపు పార్టీల ప్రతిష్టకు ప్రతీకగా మారింది. వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి గతంలో పల్లా రాజేశ్వర్ రెడ్డి విజయం సాధించారు. కానీ ఆయన ఎమ్మెల్యేగా రాజీనామా చేశారు.  ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిదగా తీన్మార్ మల్లన్న విజయం సాధించారు. ఆయన ను కాంగ్రెస్ సస్పెండ్ చేసింది. ఈసారి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పోటీల్లో పాత తరం నేతల కంటే యువత, సోషల్ మీడియా ప్రభావం ఉన్న నాయకులే ప్రముఖంగా వినిపిస్తున్నారు.  టీపీసీసీ మీడియా కమిటీ ఛైర్మన్, అధికార ప్రతినిధిగా కాంగ్రెస్ వైఖరిని గట్టిగా వినిపిస్తున్న సామ రామ్మోహన్ రెడ్డి ఈసారి కాంగ్రెస్ తరఫున గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ రేసులో బలమైన అభ్యర్థిగా ప్రచారంలో ఉన్నారు. విద్యార్థి నాయకుడిగా ప్రస్థానం ప్రారంభించి, గడిచిన కొన్నేళ్లుగా టీవీ డిబేట్లు, క్షేత్రస్థాయి ఉద్యమాల ద్వారా యువతలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారాయన.  హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ లేదా మెదక్ ఉమ్మడి జిల్లాల పరిధి నుంచి ఆయన పోటీ చేసే అవకాశం ఉందనే ప్రచారం సాగుతోంది.  విద్యాధికుడైన రాకేష్ రెడ్డి గత వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపఎన్నికలో బీఆర్ఎస్ తరఫున పోటీ చేసి హోరాహోరీ పోరాటం ఇచ్చారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ఫిరాయింపు ఎమ్మెల్యేల రివర్స్ గేర్. గులాబీ గూటివైపు చూపులు?

**హైదరాబాద్, ఆగస్టు 13  పెన్ పవర్:**

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన ఎమ్మెల్యేల వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. అధికార పార్టీలో చేరితే నియోజకవర్గాలకు భారీగా నిధులు వస్తాయని, పెండింగ్ సమస్యలు పరిష్కారమవుతాయని ఆశించిన పలువురు ఎమ్మెల్యేలకు అనుకున్న స్థాయిలో ఫలితం కనిపించకపోవడంతో అసంతృప్తి పెరుగుతున్నట్లు తెలుస్తోంది. దీంతో కొందరు ఎమ్మెల్యేలు తిరిగి బీఆర్ఎస్ వైపు అడుగులు వేయాలనే ఆలోచనలో ఉన్నారన్న ప్రచారం ఊపందుకుంది.ఈ క్రమంలో బాన్సువాడ ఎమ్మెల్యే, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. వీరి తర్వాత మరికొందరు కూడా ఇదే బాట పట్టే అవకాశం ఉందన్న చర్చ జరుగుతోంది. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో సంప్రదింపులు జరుగుతున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం ఉన్నా.. దీనిపై అధికారికంగా ఎలాంటి స్పష్టత రాలేదు.కామారెడ్డి జిల్లా బీర్కూరులో కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో పోచారం శ్రీనివాసరెడ్డి చేసిన వ్యాఖ్యలు ఈ చర్చకు మరింత ఊతమిచ్చాయి. తాను మంత్రి పదవి కోసం, డబ్బు కోసం కాంగ్రెస్‌లో చేరలేదని, కేవలం నియోజకవర్గ అభివృద్ధి కోసమే పార్టీ మారానని ఆయన స్పష్టం చేశారు. అయితే తాను ఆశించిన స్థాయిలో పనులు జరగడం లేదన్న అసంతృప్తిని బహిరంగంగానే వ్యక్తం చేశారు.బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన సమయంలో బాన్సువాడ నియోజకవర్గంలోని పెండింగ్ సమస్యలను ఆరు నెలల్లో పరిష్కరిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని పోచారం గుర్తు చేశారు. కానీ ఆ హామీలు పూర్తిగా అమలు కాలేదన్న భావన ఆయన వ్యాఖ్యల్లో వ్యక్తమైంది.మంత్రులకు  ఫోన్ చేసినా స్పందించడం లేదని, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కూడా సీఎం మాటలను పట్టించుకోవడం లేదని ఆయన చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌లోని అంతర్గత పరిస్థితులపై చర్చకు దారితీశాయి. సీఎం స్వయంగా చెప్పినా పనులు జరగడం లేదని, ముఖ్యమంత్రి కార్యాలయంలో కీలకంగా వ్యవహరించే వేం నరేందర్‌రెడ్డికి పలుమార్లు ఫోన్ చేసినా స్పందన లేదని పోచారం పేర్కొన్నట్లు సమాచారం.2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులుగా గెలిచి, ఆ తర్వాత అధికార కాంగ్రెస్ కండువా కప్పుకున్న పదిమంది ఎమ్మెల్యేల పరిస్థితి ప్రస్తుతం ముందు నుయ్యి.. వెనుక గొయ్యిలా తయారైంది. ప్రధానంగా బాన్సువాడ ఎమ్మెల్యే, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి ఇటీవల కామారెడ్డి జిల్లా బీర్కూరు ఆత్మీయ సమావేశంలో చేసిన తీవ్ర వ్యాఖ్యలు కాంగ్రెస్ అంతర్గత కలహాలను బహిర్గతం చేశాయి. "నేను మంత్రి పదవి కోసమో, నిధుల కోసమో పార్టీ మారలేదు.. కేవలం బాన్సువాడ అభివృద్ధి కోసమే వచ్చా. కానీ, ఆరు నెలల్లో పెండింగ్ పనులు పూర్తి చేస్తానన్న సీఎం రేవంత్ రెడ్డి హామీలు అమలు కావడం లేదు" అని ఆయన తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. చివరికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీఎం ముఖ్య సలహాదారు వేం నరేందర్ రెడ్డి కూడా ఫోన్లు ఎత్తడం లేదని ఆయన చేసిన ఆరోపణలు ప్రభుత్వంలో ఫిరాయింపుదారులకు దక్కుతున్న ప్రాధాన్యతను స్పష్టం చేస్తున్నాయి. పోచారం శ్రీనివాసరెడ్డి మాత్రమే కాదు, పార్టీ మారిన ఇతర ఎమ్మెల్యేల పరిస్థితి కూడా ఇలాగే ఉందన్న చర్చ జరుగుతోంది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్‌లో చేరినప్పటికీ, ఇటీవల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వాన్ని, గత పాలనను ప్రశంసిస్తూ చేసిన వ్యాఖ్యలు



ఆసక్తికర చర్చకు దారితీశాయి. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కాంగ్రెస్ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నారు. ఇటీవలి మున్సిపల్ ఎన్నికల్లో ఆయన సోదరుడు బీఆర్ఎస్ తరఫున ప్రచారం చేసి మంచి ఫలితాలు సాధించడం, గూడెం 'ఘర్ వాపసీ'కి సంకేతంగా భావిస్తున్నారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డిలు సైతం తమ నియోజకవర్గాల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చలేక తీవ్ర ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారు.ఫిరాయింపు ఎమ్మెల్యేల తిరుగుబాటు సంకేతాలతో కాంగ్రెస్ నాయకత్వం అప్రమత్తమైంది. కాంగ్రెస్ ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్ ఈ వ్యవహారంపై దృష్టి సారించారు. ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకోవాలని పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఎమ్మెల్యేలకు విజ్ఞప్తి చేశారు. అయితే, ఒకవైపు పాత కాంగ్రెస్ నాయకుల నుంచి వస్తున్న తీవ్ర వ్యతిరేకత, మరోవైపు నిధుల లేమితో ఫిరాయింపు ఎమ్మెల్యేలు తీవ్ర మనస్తాపానికి గురవుతున్నారు. ఈ క్రమంలోనే కొందరు కీలక ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లతో సంప్రదింపులు జరుపుతున్నారనే ప్రచారం జోరందుకుంది.అధికార పార్టీ కండువా కప్పుకున్న వేళ కనిపించిన ఉత్సాహం ఇప్పుడు ఆవిరైపోయింది. సొంత నియోజకవర్గాల్లో ప్రజలకు ముఖం చూపించలేక ఈ ఎమ్మెల్యేలు సతమతమవుతున్నారు.

**అడకత్తెరలో రెబల్ ఎమ్మెల్యేలు**

2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున గెలిచిన పలువురు ఎమ్మెల్యేలు తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. అయితే పార్టీ మారిన తర్వాత కూడా కాంగ్రెస్‌లో వారికి పూర్తి స్థాయి రాజకీయ స్థానం దక్కలేదన్న అసంతృప్తి ఉందని వారి అనుచర వర్గాలు చెబుతున్నాయి.నియోజకవర్గ ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని స్థానిక నేతలు, అనుచరుల నుంచి ఒత్తిడి పెరుగుతోంది. అధికార పార్టీలోకి వెళ్లిన తర్వాత నిధులు, అభివృద్ధి పనులు వేగంగా వస్తాయని భావించినా.. చాలా చోట్ల పనులు ముందుకు కదలకపోవడం ఎమ్మెల్యేలకు ఇబ్బందిగా మారిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కొంతకాలంగా కాంగ్రెస్‌కు దూరంగా ఉంటున్నట్లు కనిపిస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల సమయంలో ఆయన సోదరుడు బీఆర్ఎస్‌లో చేరడం, ఆ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా పనిచేయడం రాజకీయంగా చర్చకు దారితీసింది. పటాన్‌చెరు పరిధిలో బీఆర్ఎస్ మెరుగైన ఫలితాలు సాధించడంతో గూడెం రాజకీయ వైఖరిపై మరింత ఆసక్తి ఏర్పడిందిజగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ కూడా నియోజకవర్గ అభివృద్ధి పనులపై ఒత్తిడి ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన కీలక రోడ్డు పనులు పార్టీ మారి రెండేళ్లు గడిచినా ఆశించిన స్థాయిలో ముందుకు సాగకపోవడం ఆయనకు ఇబ్బందిగా మారిందని స్థానిక వర్గాలు చెబుతున్నాయి.గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి పరిస్థితి కూడా ఇలాగే ఉంది. గుర్రం లిఫ్ట్ పథకం పనులు చేపట్టడంతో పాటు పలు రిజర్వాయర్ల సామర్థ్యాన్ని పెంచితే నియోజకవర్గానికి ప్రయోజనం కలుగుతుందని ఆయన భావిస్తున్నారు. అయితే ఈ పనుల్లో జాప్యం జరుగుతుండటం ఆయనను కూడా అసంతృప్తికి గురిచేస్తున్నట్లు సమాచారం.ఫిరాయింపు ఎమ్మెల్యేల నుంచి వరుసగా అసంతృప్తి వ్యక్తమవుతుండటంతో కాంగ్రెస్ నాయకత్వం అప్రమత్తమైనట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ కూడా ఈ అంశంపై ఆరాతీసినట్టు సమాచారం. పోచారం వ్యాఖ్యలపై పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ స్పందిస్తూ.. ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకోవాలని సూచించారు. అందుబాటులో ఉన్న వనరులతో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని తెలిపారు.అయితే ఎమ్మెల్యేల స్థాయిలో పరిస్థితులు అంత సాఫీగా లేవన్న సంకేతాలు మాత్రం కనిపిస్తున్నాయి. పార్టీ మారిన సమయంలో ఉన్న రాజకీయ ఉత్సాహం తగ్గిపోవడం, స్థానిక కాంగ్రెస్ నాయకత్వంతో సమన్వయం కుదరకపోవడం, అభివృద్ధి పనులకు నిధులు అందకపోవడం, తమ రాజకీయ భవిష్యత్తుపై స్పష్టత లేకపోవడం వంటి అంశాలు వారిని ఇబ్బంది పెడుతున్నట్లు తెలుస్తోంది.బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలలో కొందరు ఇప్పుడు తమ నిర్ణయాన్ని పునఃపరిశీలిస్తున్నారన్న ప్రచారం ఆసక్తిని పెంచుతోంది. అధికార పార్టీలో చేరిన సమయంలో నియోజకవర్గ అభివృద్ధి, రాజకీయ భవిష్యత్తు దృష్ట్యా తీసుకున్న నిర్ణయం ఆశించిన ఫలితాలు ఇవ్వలేదన్న భావన కొందరిలో బలపడుతున్నట్లు సమాచారం.పోచారం బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేయడం, గూడెం మహిపాల్‌రెడ్డి కాంగ్రెస్‌కు దూరంగా కనిపించడం, దానం నాగేందర్ ఇటీవల బీఆరెస్ నాయకత్వాన్ని పొగడటం, సంజయ్ కుమార్, కృష్ణమోహన్‌రెడ్డి నియోజకవర్గ సమస్యలపై ఒత్తిడి ఎదుర్కొంటుండటం.. ఇవన్నీ ఫిరాయింపు ఎమ్మెల్యేల భవిష్యత్ అడుగులు ఎటు పడతాయా అన్న ఆసక్తిని పెంచుతున్నాయి. అయితే నిజంగానే వీరిలో కొందరు తిరిగి బీఆర్ఎస్‌లోకి వెళ్తారా? లేక ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నాయకత్వం అసంతృప్తిని చల్లార్చి వారిని పార్టీలోనే కొనసాగేలా చూస్తారా? అన్నది ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో కీలక ప్రశ్నగా మారింది.

# మారనున్న కేబీఆర్ పార్కు రూపు రేఖలు

**హైదరాబాద్, ఆగస్టు 13  పెన్ పవర్:**

హైదరాబాద్ ప్రజలకు మరో సూపర్ న్యూస్. నగరంలో ప్రముఖ పార్క్‌గా ప్రసిద్ధి పొందిన కేబీఆర్ పార్క్ వద్ద రూపురేఖలు పూర్తిగా మారనున్నాయి. ఈ పార్క్ వద్ద విపరీతమైన ట్రాఫిక్ రద్దీ ఉంటుంది. దీనిని తగ్గించేందుకు ప్రభుత్వం సరికొత్త ఆలోచన చేసింది. పార్క్ చుట్టూ ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌ల నిర్మాణానికి ముందడుగు వేసింది. మొత్తం 14 నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. ఏడు ప్రధాన కూడళ్ల వద్ద ఈ నిర్మాణాలు జరగనున్నాయి. మొన్నటివరకు కోర్టు కేసులు, భూసేకరణ ప్రక్రియ వల్ల కొంత జాప్యం జరగగా.. ఇప్పుడు అవన్నీ తొలగిపోయాయి. దీంతో అధికారులు ప్రక్రియను మరింత వేగవంతం చేశారు. రెండేళ్లల్లో పనులన్నీ పూర్తి చేయాలనే లక్ష్యం నిర్దేశించుకున్నారు. వాహనదారులకు ఇబ్బంది కలగకుండా పనులు త్వరతగతిన పూర్తి చేయాలని భావిస్తున్నారు.ఈ ప్రాజెక్టులో భాగంగా జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 36 నుంచి కేబీఆర్ పార్క్ రోడ్డు మధ్య నాలుగు లైన్ల ఫ్లైఓవర్ ఉంటుంది. ఇక పంజాగుట్ట నుంచి జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ వైపుకు 3 లైన్ల ఫ్లైఓవర్ నిర్మిస్తారు. ఇక మహారాజా అగ్రసేన జంక్షన్ నుంచి బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 10 వైపు 2 లైన్ల ఫ్లైఓవర్ నిర్మించనున్నారు. ఇక ఫిల్మ్ నగర్-బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12 మధ్య 2 లైన్లతో కూడిన ఫ్లైఓవర్ ప్రతిపాదించారు. అలాగే జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్-జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 45 మధ్య 2 లైన్ల ఫ్లైఓవర్ ఉంటుంది. ఇక వీటితో పాటు మొత్తం 6 అండర్‌పాస్‌లు నిర్మించనున్నారు. ఫిల్మ్ నగర్ జంక్షన్ నుంచి జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ వైపు 2 లైన్ల అండర్ పాస్, బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి నుంచి ఫిల్మ్ నగర్ వైపు ఒక అండర్ పాస్, ఎల్వీ ప్రసాద్ నుంచి పంజాగుట్ట వైపు 3 లైన్ల అండర్ పాస్, రోడ్డు నెంబర్ 45 నుంచి కేబీఆర్ పార్క్ ఎంట్రన్స్ వరకు ఒక అండర్ పాస్ ఉంటుంది.దాదాపు


ఈ ప్రాజెక్టులు పూర్తి చేయడానికి రూ.1090 కోట్లు అవసరం అవుతాయని అధికారులు అంచనా వేశారు. వీటిల్లో నిర్మాణ పనుల కోసం రూ.699.75 కోట్లు ఖర్చు కానుండగా.. భూసేకరణ ప్రక్రియ కోసం రూ.390 కోట్లు ఖర్చు అవుతాయని అంచనా వేస్తున్నారు. ఉక్కు వంతెనల నిర్మాణం వల్ల భూసేకరణ ఖర్చు తగగ్గుతుందని, తక్కువ స్థలంలోనే పనులు చేపట్టవచ్చని అధికారులు చెబుతున్నారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే కేబీఆర్ పార్క్ వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ తగ్గుతుంది. సిగ్నల్ ఫ్రీ జర్నీ వాహనదారులకు లభించనుంది. హైటెక్ సిటీ, ఫిల్మ్ నగర్ వటైపు వెళ్లేవారు వేగవంతంగా చేసుకోవచ్చు.

# బెజవాడ పాలిటిక్స్: బుద్దాకు సరిజోడీ ఉన్నారా.. ?



**హైదరాబాద్ పెన్ పవర్:** బెజవాడ పాలిటిక్స్ మరోసారి హీటెక్కడం ఖాయంగా కనిపిస్తోంది. టీడీపీ ఫైర్ బ్రాండ్ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్నను పశ్చిమ నియోజకవర్గం ఇంచార్జ్‌గా ఇటీవల సీఎం చంద్రబాబు నామినేట్ చేశారు. ఆయన బాధ్యత స్వీకార ఘట్టం అంగరంగ వైభవంగా సాగింది. దీనిని బట్టి..వచ్చే ఎన్నికలకు ఆయనను రెడీ చేస్తున్నారా? అనే సందేహాలు, చర్చ కూడా తెరమీదికి వచ్చాయి. కానీ, అలాంటిదేమీ లేదని పార్టీ వర్గాలు అంటున్నాయి. నియోజక వర్గంలో బాధ్యత వేరు.. టికెట్ వేరన్నది గత ఎన్నికల్లోనూ స్పష్టమైంది. ఇక, తాజాగా బుద్దాకు ఈ పదవి ఇవ్వడం వెనుక.. కీలక వ్యూహమే ఉందని అంటున్నారు. త్వరలోనే మునిసిపల్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కీలకమైన పశ్చిమ నియోజకవర్గంలో పార్టీ పరంగా కార్యక్రమాలు నిర్వహించేందుకు కార్పొరేషన్‌లో తమ సత్తా చాటుకునేందుకు బలమైన వాయిస్ ఉన్న నాయకుడి అవసరం ఎంతో ఉంది. ఈ నేపథ్యంలోనే బుద్దాకు పదవి ఇచ్చారని చెబుతున్నారు. మరోవైపు.. వైసీపీ తరఫున ఉన్న వెల్లంపల్లి శ్రీనివాస్, పోతిన వెంకట మహేష్ వంటివారు కార్పొరేషన్‌పై వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు.దీనికి చెక్ పెట్టడంతోపాటు బెజవాడలో టీడీపీకి పునర్వైభవం తీసుకువచ్చేందుకు కూడా.. టీడీపీ అడుగులు వేసిం ది. ఈ క్రమంలోనే బుద్దాకు నియోజకవర్గాన్నిఅప్పగించింది. ప్రస్తుతం ఉన్న పరిస్థితిలో ఇటు పశ్చిమలో అయినా.. అటు తూర్పులో అయినా.. బుద్దా కు తిరుగున్న నాయకుడు పెద్దగాలేరనే చెప్పాలి. పక్కా మాస్ ఇమేజ్‌తో పాటు.. స్పాంటేనియస్ పాలిటిక్స్ చేయడంలో బుద్దా తనకు తానే సాటి అనగల స్థాయిలో ఉన్నారు. పైగా ఈ తరహా వాయిస్ ఉన్న నాయకుడు వైసీపీలో కనిపించడం లేదు.అదే సమయంలో జగన్ సహా.. సజ్జల రామకృష్ణారెడ్డి వంటివారిపై బలమైన దూకుడుగా వ్యవహరించే బుద్దాను ప్రోత్సహించే క్రమంలోనే టీడీపీ ఇప్పుడు ఆయన కు పదవిని ఇచ్చింది. తద్వారా రెండు రకాలుగా బుద్దా ఇప్పుడు పార్టీ కి దన్నుగా నిలవనున్నారు. వైసీపీ కి చెక్ పెట్టడం ఒక పార్ట్ అయితే.. అదే సమయంలో టీడీపీని బలోపేతం చేయడం.. బీసీ సామాజిక వర్గాన్ని మరింత చేరువ చేయడం.. తద్వారా కార్పొరేషన్‌లో పాగా వేయడం అనే లక్ష్యాలను నిర్దేశించుకున్నారు. బుద్దాకు సాటిరాగల నాయకులు లేకపోవడం.. వైసీపీకి పెద్ద మైనస్‌గా మారింది.

# విజయసాయపార్టీ లీకుల వ్యూహం ఏమిటీ



**నెల్లూరు, ఆగస్టు 13, పెన్ పవర్:**
వైఎస్సార్‌సీపీలో ఒకప్పుడు నంబర్–2గా చక్రం తిప్పి, ఆ తర్వాత రాజకీయ సన్యాసం ప్రకటించిన మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి మళ్లీ ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారారు. వైఎస్సార్‌సీపీ అధికారం కోల్పోయిన అనంతరం తన పదవికి, పార్టీకి రాజీనామా చేసి వ్యవసాయం చేసుకుంటాను అని చెప్పిన ఆయన, ఇప్పుడు సడన్‌గా కొత్త పొలిటికల్ ఇన్నింగ్స్ ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన తొలినాళ్లలో విజయసాయిరెడ్డి బీజేపీ గూటికి చేరుతారని విస్తృత ప్రచారం జరిగింది. ఢిల్లీ స్థాయిలో ఆయనకున్న పరిచయాలు, కేంద్ర పెద్దలతో ఉన్న సంబంధాల దృష్ట్యా కమలం తీర్థం పుచ్చుకుంటారని భావించారు. అయితే, ఏపీలో టీడీపీ–బీజేపీ–జనసేన కూటమి అధికారంలో ఉంది. విజయసాయిరెడ్డిని పార్టీలోకి తీసుకుంటే టీడీపీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందనే భావనతో పాటు, కూటమి ధర్మాన్ని పాటించేందుకు కేంద్ర బీజేపీ నాయకత్వం ఆయన చేరికపై సుముఖత చూపలేదని సమాచారం. బీజేపీ తలకదనం లేకపోవడంతో, అలాగే ఇతర జాతీయ పార్టీల వైపు వెళ్లే అవకాశం లేకపోవడంతో ఆయనకు సొంత బాట పట్టడం తప్ప మరో ప్రత్యామ్నాయం లేకుండా పోయింది.కొన్ని రోజులుగా ఆయన తిరిగి పాతగూటికి వెళ్తారని ప్రచారం జరుగుతున్నా అది దాదాపు అసాధ్యమని అంటున్నారు. వైఎస్సార్‌సీపీలో అంతర్గతంగా పెరిగిన విభేదాలు, కోటరీతో విభేదించి బయటకు రావడం, ఆ తర్వాత ఆ పార్టీ అధినాయకత్వాన్ని ఉద్దేశించి సోషల్ మీడియా ద్వారా విమర్శనాత్మక పోస్టులు పెట్టడం వల్ల జగన్‌తో ఆయనకు గ్యాప్ పెరిగింది. ఎన్నికల ఓటమి తర్వాత జగన్ కూడా విజయసాయిరెడ్డి వ్యాఖ్యల పట్ల అసంతృప్తిగా ఉన్నారని, ఆయనను తిరిగి చేర్చుకోవడానికి జగన్ సిద్ధంగా లేరనే అభిప్రాయం వినిపించడంతో విజయసాయిరెడ్డి పూర్తిగా వైఎస్సార్‌సీపీ అధ్యాయానికి స్వస్తి చెప్పారని భావించవచ్చుఈ పరిణామాలతో విజయసాయిరెడ్డి భారత్ జన వికాస్ పేరుతో సరికొత్త రాజకీయ పార్టీ ఏర్పాటుకు ముహూర్తం ఖరారు చేసుకుంటున్నట్లు లీకులు బయటకు వచ్చాయి. శ్రావణ మాసం ముగిసేలోపు పార్టీ ప్రకటన ఉండే అవకాశం ఉందనే ప్రచారం సాగుతోంది. మహిళలు, రైతులు, యువత, సమగ్ర రాష్ట్రాభివృద్ధే ఎజెండాగా ప్రాంతాల వారీగా సభలు నిర్వహించాలని ఆయన యోచిస్తున్నారు. అయితే ఈ పార్టీ వెనుక మరికొందరు ముఖ్యుల ఆశీస్సులు ఉన్నాయా? లేదా ఇతర రాజకీయ శక్తులు తెరవెనుక ఉండి నడిపిస్తున్నాయా? అనే సందేహాలు కూడా రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి.ఆంధ్రప్రదేశ్ రాజకీయ క్షేత్రం ప్రస్తుతం టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి , వైఎస్సార్‌సీపీల మధ్య ముఖాముఖి పోరుగా ఉంది. ఈ బైపోలార్ పొలిటికల్ వాతావరణంలో మూడో శక్తిగా నిలబడటం లేదా సొంత పార్టీతో ప్రభావం చూపడం అత్యంత సంక్లిష్టమైన అంశం. విజయసాయిరెడ్డికి మాస్ క్యాడర్ ఆధారిత ప్రజాదరణ లేకపోవడం, కేవలం ఆర్గనైజర్ , స్ట్రాటజిస్ట్‌గా మాత్రమే గుర్తింపు ఉండటం ప్రధాన పరిమితి. ఒకవేళ పార్టీ పెట్టినా, ఆయన సాధించే ఓటింగ్ శాతం కూటమికి లాభం చేకూరుస్తుందా లేక వైఎస్సార్‌సీపీ ఓట్ బ్యాంక్‌కే గండికొడుతుందా
అనేది వేచి చూడాలి. భారీ ఆర్థిక వనరులు, బలమైన క్యాడర్ లేనిదే కొత్త పార్టీ నిలదొక్కుకోవడం కష్టమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# కూటమి సర్కార్‌కు 'కౌన్సిల్' గండం..!




**విజయవాడ, ఆగస్టు 13, పెన్ పవర్:**
తాడేపల్లిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన వైసీపీ శాసనసభాపక్ష సమావేశం ముగిసింది. ఈ సమావేశంలో రాబోయే ఏపీ శాసనసభ, మండలి వర్షాకాల సమావేశాలపై పార్టీ శ్రేణులకు జగన్ దిశా నిర్దేశం చేశారు. ఈ క్రమంలో ఏపీ శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ అభ్యర్థిగా గుంటూరు జిల్లాకు చెందిన పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ తూమాటి మాధవరావును వైఎస్ జగన్ అధికారికంగా ఎంపిక చేశారు.అయితే, గత సమావేశాల మాదిరిగానే తమకు ప్రతిపక్ష హోదా ఇవ్వనందుకు నిరసనగా ఈసారి కూడా అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించాలని వైసీపీ ఎమ్మెల్యేలు నిర్ణయించుకున్నారు. కానీ, తమకు పూర్తి మెజారిటీ ఉన్న శాసనమండలి (కౌన్సిల్) సమావేశాలకు మాత్రం వైసీపీ ఎమ్మెల్సీలు అందరూ విధిగా హాజరుకావాలని పార్టీ అధిష్టానం స్పష్టం చేసింది. అసెంబ్లీకి దూరంగా ఉన్నప్పటికీ, శాసనమండలి వేదికగా అధికార చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు వైసీపీ పక్కా వ్యూహాలు రచిస్తోంది.పోయినసారి తిరుమల శ్రీవారి లడ్డు కల్తీ వ్యవహారంపై పెద్ద ఎత్తున రచ్చ చేసిన వైసీపీ, ఈసారి నిరుద్యోగుల సమస్యలను ప్రధాన అస్త్రంగా మార్చుకోనుంది. ముఖ్యంగా రాష్ట్రంలో తీవ్ర చర్చనీయాంశంగా మారిన మెగా డీఎస్సీ నోటిఫికేషన్, ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియలో జరిగినట్లు చెప్తున్న అవకతవకలు, మరియు అభ్యర్థుల ఆందోళనలను మండలిలో బలంగా వినిపించాలని వైసీపీ భావిస్తోంది. మెగా డీఎస్సీ అభ్యర్థులకు జరిగిన అన్యాయంపై కూటమి ప్రభుత్వాన్ని నిలదీయడం ద్వారా నిరుద్యోగుల పక్షాన నిలబడాలని వైఎస్ జగన్ తన ఎమ్మెల్సీలకు సూచించారు.ఆగస్టు 17 నుంచి ఏపీ శాసనసభ, మండలి సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో రాజకీయ వాతావరణం అప్పుడే వేడెక్కింది. కూటమి ప్రభుత్వం అసెంబ్లీలో సులభంగా బిల్లులను ఆమోదింపజేసుకున్నప్పటికీ, శాసనమండలిలో మాత్రం వైసీపీకి మెజారిటీ ఉండటంతో ప్రభుత్వం ప్రవేశపెట్టే బిల్లులను అడ్డుకునే అవకాశం ఉంది. ఒకవైపు గత ప్రభుత్వ హయాంలో జరిగిన గ్రూప్–1 అక్రమాలపై సిట్ తుది నివేదికతో కూటమి సర్కార్ వైఎస్సార్సీపీని కట్టడి చేయాలని చూస్తుండగా, మరోవైపు కల్తీ లడ్డు, డీఎస్సీ వ్యవహారాలను అడ్డం పెట్టుకుని శాసనమండలి వేదికగా ప్రభుత్వాన్ని ముప్పతిప్పలు పెట్టేందుకు వైసీపీ సిద్ధమవుతోంది. దీంతో ఈ వర్షాకాల సమావేశాలలో మండలి వేదికగా ఇరుపక్షాల మధ్య తీవ్ర స్థాయిలోనే రాజకీయం నడవనుందని స్పష్టమవుతోంది.

# మహాకుంభమేళ తరహాలో గోదావరి పుష్కరాలు

**రాజమండ్రి, ఆగస్టు 13, పెన్ పవర్:** ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళా తరహాలో, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో, అత్యున్నత వసతులతో 2027 గోదావరి పుష్కరాలను నిర్వహించేందుకు ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం సన్నాహాలు ముమ్మరం చేసింది. దక్షిణాది మహా కుంభమేళాగా భావించే ఈ పుష్కరాలకు కోట్ల సంఖ్యలో తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, గ్లోబల్ స్టాండర్డ్స్‌కు తగినట్లు ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మహాక్రతువు కోసం మొత్తం అంచనా వ్యయం రూ. 8,500 కోట్లుగా నిర్ధారించగా.. తొలి విడత మౌలిక వసతులు, ఘాట్ల విస్తరణ పనుల నిమిత్తం ప్రభుత్వం ఇప్పటివరకు రూ. 530 కోట్లను అధికారికంగా మంజూరు చేసింది.పుష్కరాల నిర్వహణలో అత్యంత కీలకమైన శాఖలకు నిధుల కేటాయింపులను ప్రభుత్వం పక్కాగా వర్గీకరించింది. గోదావరి తీరంలో భక్తుల రద్దీని తట్టుకునేలా 238 పాత , కొత్త పుష్కర ఘాట్ల ఆధునీకరణ, మరమ్మతులు, నిర్మాణాలు చేపడుతున్న నీటిపారుదల శాఖకు అత్యధికంగా రూ. 210.06 కోట్లు కేటాయించారు. పట్టణ మౌలిక వసతులు, పారిశుధ్య నిర్వహణ పనుల నిమిత్తం పురపాలక, పట్టణాభివృద్ధి శాఖకు రూ. 150 కోట్లు విడుదల కాగా, గోదావరి తీరమంతటా నిరంతర విద్యుత్ సరఫరా, తాత్కాలిక సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ఇంధన శాఖకు రూ. 100 కోట్లు కేటాయించారు. దీంతో పాటు ఆలయాల సుందరీకరణ, ధార్మిక కార్యక్రమాల నిర్వహణకు దేవాదాయ శాఖకు రూ. 60 కోట్లు, టూరిజం సేవలు, సాంస్కృతిక ప్రదర్శనల విస్తరణకు పర్యాటక, సాంస్కృతిక శాఖకు రూ. 10 కోట్లు నిధులు విడుదలయ్యాయి.ఈసారి పుష్కరాలలో డిజిటల్ టెక్నాలజీ వినియోగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. లక్షలాది మంది భక్తులు ఒకేసారి వచ్చే అవకాశం ఉన్నందున క్రౌడ్ మేనేజ్‌మెంట్ కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత సీసీటీవీ నెట్‌వర్క్, డ్రోన్ సర్వైలెన్స్, రియల్ టైమ్ కంట్రోల్ రూమ్‌లను అందుబాటులోకి తేవాలని నిర్ణయించారు. భక్తులు తాము స్నానం చేయాలనుకునే ఘాట్లు, స్లాట్ బుకింగ్, ట్రాఫిక్ రూట్ మ్యాప్స్, అందుబాటులో ఉన్న పార్కింగ్ స్థలాలు, అత్యవసర వైద్య సేవల సమాచారాన్ని సులువుగా తెలుసుకునేలా ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ యాప్‌ను, క్యూఆర్ కోడ్ నేవిగేషన్ సిస్టమ్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు.నది తీరం పొడవునా పారిశుధ్యం, భద్రత , పర్యావరణ పరిరక్షణ విషయాలలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. నది నీరు కలుషితం కాకుండా ప్రత్యేక ఫిల్ట్రేషన్ గ్రిడ్లను ఏర్పాటు చేయడమే కాక, ప్లాస్టిక్ రహిత పుష్కరాలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నారు. ప్రతి ఘాట్ వద్ద 24 గంటలు అందుబాటులో ఉండేలా మొబైల్ మెడికల్ టీమ్‌లు, అంబులెన్సులు, పారిశుధ్య సిబ్బంది , స్విమ్మింగ్ నిపుణులను అందుబాటులో ఉంచనున్నారు. భక్తుల రద్దీని నియంత్రించేందుకు కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్లు వేగంగా పనిచేస్తాయి. రాజమండ్రి, కోవూరు, నరసాపురం, భద్రాచలం పరిసర ప్రాంతాల గోదావరి తీరాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్ది, పుష్కరాలకు వచ్చే కోట్లాది మంది భక్తులకు భక్తిపారవశ్యంతో పాటు అధునాతనమైన, సురక్షితమైన ఆధ్యాత్మిక అనుభూతిని అందించడమే లక్ష్యంగా వైభవంగా ఏర్పాట్లు వేగవంతమవుతున్నాయి.

# ఏపీలో వడివడిగా మెట్రో అడుగులు



**విజయవాడ, ఆగస్టు 13, పెన్ పవర్:** దేశంలోని చాలా నగరాలల్లో మెట్రో రైలు సేవలు అందుబాటులోకి వచ్చాయి. మెట్రో సేవలు కలిగిన రాష్ట్రాల జాబితాలోకి త్వరలో ఏపీ కూడా చేరబోతోంది. ఇతర రాష్ట్రాల్లో కేవలం ఒక ఒకటి, అరా నగరాల్లోనే మెట్రో సేవలు కొనసాగుతుంటే.. ఏపీలో ఏకంగా రెండు నగరాల్లో మెట్రో సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ మేరకు ఏపీలోని విజయవాడ, విశాఖపట్నంలలో మెట్రో రైలు ప్రాజెక్టులకు సంబంధించిన డీపీఆర్ లకు కేంద్రం ఆమోద ముద్ర పడే దిశగా వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఈ రెండు ప్రాజెక్టులకు సంబంధించిన ఆర్థిక మదింపును కేంద్రం ప్రారంభించింది. అంటే...ఈ ప్రాజెక్టులకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టేనని చెప్పవచ్చు. తెలుగు నేల విభజన తర్వాత విభజిత ఏపీలో తొలి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన టీడీపీ... 2015లోనే విజయవాడతో పాటుగా విశాఖలో మెట్రో సేవల కోసం కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. ఈ ప్రతిపాదనలపై నాడు ఓ మోస్తరు అడుగులు పడినా... 2019లో టీడీపీ ఓడిపోవడం, వైసీపీ అధికారంలోకి రావడంతో ఆ ప్రాజెక్టులు కాస్తా అటకెక్కేశాయి. అయితే 2024 ఎన్నికల్లో జనసేన, బీజేపీలతో కలిసిన టీడీపీ... తిరిగి అధికారం చేజిక్కించుకుంది. అంతేకాకుండా అటు కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ సర్కారు, ఇటు ఏపీలో టీడీపీ నేతృత్వంలోని కూటమి సర్కారు కొలువు దీరడంతో... సీఎం నారా చంద్రబాబునాయుడు మరోమారు మెట్రో ప్రాజుక్టుల బూజు దులిపారు.విజయవాడ, విశాఖల మెట్రో రైలు ప్రాజెక్టులకు సంబంధించి డీపీఆర్ లను రూపొందించిన కూటమి సర్కారు.. వాటిని కేంద్రం పరిశీలనకు పంపింది. ఈ ప్రతిపాదనలపై దృష్టి సారించిన కేంద్రం... ఇటీవలే ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ఆర్థిక మదింపును ప్రారంభించింది. ఈ ప్రక్రియ పూర్తి కాగానే... ఈ రెండు ప్రాజెక్టులకు కేంద్రం ఆమోద ముద్ర పడనుంది. ఆ వెంటనే విజయవాడ, విశాఖల్లో మెట్రో రైలు ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ కూడా ప్రారంభం కానుంది. వెరసి అతి త్వరలోనే ఈ రెండు నగరాల్లో మెట్రో రైలు సేవలు అందుబాటులోకి రానున్నాయన్న మాట. రెండు నగరాల్లో మొత్తంగా 84.63 కిలో మీటర్ల మేర మెట్రో రైలు సేవలు అందుబాటులోకి వస్తాయి.ఇక విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టు విషయానికి వస్తే..పండిట్ నెహ్రూ బస్టాండ్ నుంచి గన్నవరం, పెనమలూరు దారా తొలి దశ మెట్రో రైలు సేవలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు బందరు రోడ్డు, ఏలూ రోడ్డు, గన్నవరం, పెనమలూరుల్లో భూసేకరణకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. నగరంలో 38.40 కిలో మీటర్ల మేర ఏర్పాటు కానున్న మెట్రో ప్రాజెక్టుకు రూ. 10,118 కోట్ల నిధులు అవసరం కానున్నాయి. బస్టాండ్ నుంచి గన్నవరం, పెనమలూరుల వరకు రెండు మార్గాల్లో మెట్రో ఏర్పాటు కానుంది. విశాఖ మెట్రో విషయానికి వస్తే... నగరంలో మూడు మార్గాల్లో 46.22 కిలో మీటర్ల మేర మెట్రో రైలు ప్రాజెక్టు ఏర్పాటు కానుంది. డబుల్ డెక్కర్ మోడ్ లో ఈ వ్యవస్థ ఏర్పాటు కానుంది. మూడు మార్గాల్లో కలిపి 43 మెట్రో స్టేషన్లు ఉంటాయి. ఇందుకోసం రూ. 11,498 కోట్ల నిధులు అవసరం కానున్నట్లుగా డీపీఆర్ లో పేర్కొన్నారు. ఇక ఈ మెట్రో స్టీల్ ప్లాంట్, గాజువాక, ఎన్ఏడీ, తాటిచెట్లపాలెం, గురుద్వారా, మద్దిలపాలెం, హనుమంతువాకల్లో ఇంటిగ్రేటెడ్ మెట్రో స్టేషన్లు ఏర్పాటు కానుండగా... కొమ్మాది వరకూ మెట్రో ఏర్పాటు కానుంది. రెండు ప్రాజెక్టులకు కలిపి మొత్తంగా రూ. 21,616 కోట్ల మేర నిధులు అవసరం కానున్నాయి. ఈ నిధుల్లో రాష్ట్రం వాటా 20 శాతం కాగా...కేంద్రం కూడా తన వంతుగా మరో 20 శాతం నిధులను అందించనుంది. ఇక మిగిలిన 60 శాతం నిధులను ఆయా ఆర్థిక సంస్థల నుంచి రుణం రూపేణా సేకరించే దిశగా డీపీఆర్ రెడీ అయ్యింది. ఏపీలో కొనసాగుతున్న పారిశ్రామిక ప్రగతి, అమరావతి అభివృద్ధిలను పరిశీలిస్తున్న పలు ప్రైవేట్ అంతర్జాతీయ సంస్థలు మెట్రో ప్రాజెక్టులో నిధులు వెచ్చించేందుకు సిద్ధంగా ఉన్నాయి. వెరసి త్వరలోనే ఏపీలో రెండు ప్రాజెక్టులు ఒకేసారి పట్టాలెక్కనున్నాయని చెప్పవచ్చు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## పెద్దిరెడ్డి యాక్టివ్.. సీమ వైసీపీ దూకుడేనా.. ?



మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి యాక్టివ్ అయ్యారు. తాజాగా ఆయన అనంతపురం జిల్లాలో నిర్వహించిన డీఎస్సీ-2025 వ్యతిరేక నిరసనల్లో పాల్గొనేందుకు వెళ్లారు. అయితే.. పోలీసులు ఆయనను మధ్యలోనే అడ్డుకున్నారు. ఈ పరిణామం సీమ వైసీపీలో కొంత జోష్ నింపిందన్న వాదన వినిపిస్తోంది. గత రెండు సంవత్సరాలుగా.. పార్టీ పరంగా ఉద్యమాలు చేపట్టినా.. పెద్దిరెడ్డి పెద్దగా యాక్టివ్ కాలేదు. కుటుంబంపై నమోదైన కేసులు ఆయనను ఇబ్బందికి గురి చేశాయన్న వాదన ఉంది. ముఖ్యంగా భూములు, మద్యం, అటవీ భూమిని ఆక్రమించి ఇల్లు కట్టుకున్నారన్న కేసులు కూడా నమోదయ్యాయి. అయితే.. వాటిపై పార్టీ పరంగా ఆయనకు మద్దతు లభించలేదు. దీంతో పెద్దిరెడ్డి కినుక వహించారని.. పార్టీలో కూడా అన్యమనస్కంగా ఆయన ఉంటున్నారన్నది కొన్నాళ్ల కిందటే చర్చకు వచ్చింది. అయితే.. తాజాగా .. పెద్ది రెడ్డి మనసు మార్చుకున్నట్టు కనిపిస్తోంది. ఇప్పటికే రెండున్నరేళ్లు గడిచిపోవడం.. నియోజకవర్గంలో కూడా కేడర్ బల హీన పడుతుండడం, నాయకుల మధ్య సమన్వయం సమస్యగా మారుతున్న నేపథ్యంలో ఉద్యమాలకు హాజర య్యారన్న టాక్ వినిపిస్తోంది.

**సీమకు కలిసి వస్తుందా..?**

పెద్దిరెడ్డి ఇప్పటి వరకు కేవలం ఉమ్మడి చిత్తూరు జిల్లా రాజకీయాలకు మాత్రమే పరిమితం అయ్యారు. గతంలో చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పంపైనే ఎక్కువగా దృష్టి పెట్టారు. గత 2024 ఎన్నికల్లో చంద్రబాబును ఓడించాలని నిర్ణయించారు. కానీ, ఈ తరహా రాజకీయాలు పనిచేయలేదు. దీంతో గత ఎన్నికల తర్వాత నుంచి పెద్దిరెడ్డి మౌనంగా ఉండిపోయారు. ఒకవైపు మదనపల్లి ఫైల్స్ తగలబడడం, మద్యం కేసు వెంటాడడం, భూముల వ్యవహారంతో తీరికలేకుండా పోయింది. మరోవైపు మరిన్ని కేసులు నమోదవుతాయన్న బెంగ కూడా ఆయనను వెంటాడింది. ఈ పరిణామాల క్రమంలో మౌనంగా ఉన్న పెద్దిరెడ్డి.. తాజాగా యాక్టివ్ కావడం కొంత మేరకు సీమలో వైసీపీకి కలిసి వస్తుందని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. అయితే.. పూర్తిస్థాయిలో ఇది కొనసాగుతుందా? లేదా? అనేది చూడాలి. కేవలం తాడిపత్రి వరకే పెద్దిరెడ్డి రాజకీయంగా పరిమితం అవుతారా? అనేది కూడా సందేహంగా మారింది. అయితే.. ఇది కొంత మేరకు సానుకూల పరిణామాలను అందిస్తున్నదన్న సంకేతాలు కూడా ఉన్నాయి. సీమలో పెద్ది రెడ్డి వంటి సీనియర్ యాక్టివ్ కావాలని కోరుకునే వారికి మాత్రం తాజా పరిణామం కొంత మేరకు సంతృప్తిని ఇచ్చిందని అంటున్నారు.

## తమిళనాడు అసెంబ్లీని కుదిపేసిన 'కుప్పం ఎయిర్ పోర్టు' - ఏం జరిగిందంటే...?




ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పంలో నిర్మించనున్న విమానాశ్రయం ప్రాజెక్టు ఇప్పుడు పొరుగు రాష్ట్రం తమిళనాడు రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఆ రాష్ట్రంలోని హోసూరు విమానాశ్రయ నిర్మాణానికి ఆటంకం కలుగుతోందని, దీని వెనుక పొరుగు రాష్ట్రాల ప్రమేయం ఉందనే ఆరోపణలతో తమిళనాడు అసెంబ్లీలో ప్రకంపనలు రేగాయి. తమిళనాడు అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా డిఎంకె ఎమ్మెల్యే శ్రీనివాసన్ లేవనెత్తిన అంశం రాష్ట్రంలో రాజకీయ దుమారాన్ని రేపింది. హోసూరు విమానాశ్రయ ప్రాజెక్టును దెబ్బతీయడానికి ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలు కావాలనే అడ్డుపుల్లలు వేస్తున్నాయని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. హోసూరు వంటి కీలక ప్రాంతంలో విమానాశ్రయం రావడం వల్ల పారిశ్రామికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందని, అయితే పొరుగు రాష్ట్రాలు వ్యూహాత్మకంగా ఆ ప్రాజెక్టును ఆపేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఈ ఆరోపణలపై తమిళనాడు పరిశ్రమల శాఖ మంత్రి కీర్తన స్పందిస్తూ, రాజకీయ ప్రేరేపిత ఆరోపణలను ఖండించారు. పొరుగు రాష్ట్రాలు హోసూరు ప్రాజెక్టును అడ్డుకుంటున్నాయనడానికి ఎటువంటి ఆధారాలు లేవని ఆమె స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వస్తున్న అసంబద్ధమైన వార్తలను నమ్మి అసెంబ్లీ వేదికపై నిరాధారమైన ఆరోపణలు చేయడం సరికాదని ఆమె ఎమ్మెల్యేకు హితవు పలికారు. పరిపాలనాపరమైన సమస్యలను రాజకీయ రంగు పులుమడం వల్ల అభివృద్ధి ప్రాజెక్టులకు నష్టం జరుగుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. హోసూరు విమానాశ్రయ ప్రాజెక్టుకు ఎదురవుతున్న సమస్యలను పరిశీలిస్తే, అందులో ప్రధానంగా సాంకేతికపరమైన అడ్డంకులు కనిపిస్తున్నాయని చెబుతున్నారు. హోసూరు ప్రాంతం బెంగళూరుకు భౌగోళికంగా చాలా దగ్గరగా ఉండటం ఒక ప్రధాన సవాలు అంటున్నారు. ఇప్పటికే బెంగళూరులోని కెంపగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం ఈ ప్రాంతానికి సేవలందిస్తోందని, నిబంధనల ప్రకారం, ఒక ప్రధాన విమానాశ్రయం ఉన్న నిర్దిష్ట పరిధిలో మరొక విమానాశ్రయాన్ని నిర్మించాలంటే అనేక విమానయాన నియమాలను పాటించాల్సి ఉంటుందని చెబుతున్నారు. దీనితో పాటు, హోసూరులో ఉన్న హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ రక్షణ సౌకర్యాలు, అడ్డంకులు విమానాల రాకపోకలకు అనుమతులు లభించడంలో ప్రధాన ఆటంకాలుగా మారాయంటున్నారు. మరోవైపు, కుప్పం విమానాశ్రయం ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చొరవతో వేగంగా ముందుకు సాగుతోందని చెబుతున్నారు. భౌగోళికంగా కుప్పం కూడా బెంగళూరుకు దగ్గరగానే ఉన్నప్పటికీ, ఏపీ ప్రభుత్వం వ్యూహాత్మక ఒప్పందాలతో ముందడుగు వేసిందని అంటున్నారు. బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయంతో సమన్వయం చేసుకుని, షరతులతో కూడిన నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ పొందడంలో ప్రభుత్వం సఫలీకృతమైందని చెబుతున్నారు. ఈ ప్రాజెక్టు కోసం 1,788 ఎకరాల భూమి అవసరమని గుర్తించగా, ఇప్పటికే దాదాపు 1,300 ఎకరాల భూసేకరణ పూర్తికావడం ప్రాజెక్టు పురోగతికి నిదర్శనంగా చెబుతున్నారు. కుప్పంను లాజిస్టిక్స్ హబ్‌గా మార్చడం ద్వారా చిత్తూరు జిల్లా పారిశ్రామిక ముఖచిత్రాన్ని మార్చాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

# 109 ఏళ్ల నాటి అప్పు.. బ్రిటన్ ప్రభుత్వం నుంచి రూ. 10 కోట్లు క్లెయిమ్ చేస్తున్న భారతీయ కుటుంబం

1917లో బ్రిటిష్ పాలన కాలంలో జరిగిన ఒక అపూర్వమైన ఆర్థిక లావాదేవీ సుమారు 109 సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ వెలుగులోకి వచ్చి అంతర్జాతీయ స్థాయిలో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. మొదటి ప్రపంచ యుద్ధం తీవ్రంగా జరుగుతున్న ఆ క్లిష్ట సమయంలో అప్పటి భోపాల్ సంస్థానానికి చెందిన ప్రముఖ ధనవంతుడు, వ్యాపారి అయిన సేథ్ జుమ్మా లాల్ రుథియా బ్రిటిష్ ప్రభుత్వానికి రూ. 35,000 అప్పుగా ఇచ్చారు. అప్పట్లో ఇది చాలా భారీ మొత్తం. 1917 జూన్ 4న జరిగిన ఈ లావాదేవీకి సంబంధించి నాటి బ్రిటిష్ పొలిటికల్ ఏజెంట్ డబ్ల్యూ ఎస్ డేవిస్ అధికారికంగా సంతకం చేసిన అసలు బాండ్ పత్రాలు ఇప్పటికీ పదిలంగా ఉన్నాయి. జుమ్మా లాల్ రుథియా 1937లో కన్నుమూశారు, ఆ తర్వాత 1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించింది. అయితే నాటి బ్రిటిష్ ప్రభుత్వం ఈ రుణాన్ని తిరిగి చెల్లించినట్లు ఎటువంటి రికార్డులు లేదా ఆధారాలు కుటుంబ సభ్యులకు లభించలేదు.

ఈ చారిత్రక అంశం ఇటీవల మధ్యప్రదేశ్‌లోని సెహోర్‌కు చెందిన జుమ్మా లాల్ రుథియా మనవడు 63 ఏళ్ల వివేక్ రుథియా ద్వారా పునరావృతమైంది. తమ పూర్వీకుల నాటి పాత పత్రాలను పరిశీలిస్తున్న సమయంలో ఈ రుణ బాండ్ బయటపడటంతో ఆయన తక్షణమే బ్రిటన్ ప్రభుత్వాన్ని సంప్రదించారు. తమ పూర్వీకుడు అందించిన సాయానికి తగినట్లుగా అప్పటి ఒప్పంద నిబంధనల ప్రకారం అసలు మొత్తాన్ని వడ్డీతో సహా తిరిగి చెల్లించాలని కోరారు. ఆశ్చర్యకరంగా ఈ విజ్ఞప్తిపై లండన్‌లోని బ్రిటన్ ప్రభుత్వ రుణాలు మరియు ఆర్థిక వ్యవహారాలను పర్యవేక్షించే 'యూకే డెబిట్ మేనేజ్ మెంట్ ఆఫీస్ ' స్పందించింది. ఆ బాండ్ యొక్క




ఒరిజినల్ పత్రాలు, ఇతర చట్టపరమైన ఆధారాల కాపీలను సమర్పించాలని రుథియా కుటుంబ న్యాయవాదిని కోరడం ద్వారా ఈ అంశం అధికారిక మలుపు తిరిగింది.

1917 నాటి రూ. 35,000 విలువ నేటి కాలానికి పోల్చి చూస్తే ఊహకందని స్థాయికి చేరుకుంటుంది. గత శతాబ్ద కాలంలో పెరిగిన ద్రవ్యోల్బణం, చక్రవడ్డీ, బంగారం నాటి, నేటి ధరల వ్యత్యాసాలను గణనలోకి తీసుకుంటే ఈ రుణం యొక్క ప్రస్తుత మార్కెట్ విలువ రూ. 10 కోట్లకు పైగా ఉంటుందని ఆర్థిక నిపుణులు, కుటుంబ సభ్యులు అంచనా వేస్తున్నారు. అయితే బ్రిటన్ అధికారులు ఈ మొత్తాన్ని నేరుగా చెల్లిస్తారా లేదా అనేది ఆ బాండ్‌లోని అసలు షరతులు, మెచ్యూరిటీ కాలపరిమితి, లండన్‌లోని నాటి రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే తేలనుంది. వందల ఏళ్ల నాటి బాండ్ ఆధారంగా ఒక భారతీయ కుటుంబం లండన్ ప్రభుత్వంపై ఇంత పెద్ద మొత్తంలో క్లెయిమ్ చేయడం ప్రపంచవ్యాప్తంగా విశేషంగా మారింది.

# తోలు తీసిన పోలీస్.. శ్రీకాళహస్తి ఘటనపై వెనువెంటనే రియాక్షన్



తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పట్టణంలో హెడ్ కానిస్టేబుల్ పై రెచ్చిబోయిన ఇద్దరు యువకులకు పోలీసులు ఇచ్చిన ట్రీట్మెంట్ వైరల్ అవుతోంది. రెండు రోజుల క్రితం శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన హెడ్ కానిస్టేబుల్ పై నడిరోడ్డుపై ఇద్దరు యవకులు దాడి చేసిన వీడియో సోషల్ మీడియాలో హల్ చల్ చేసింది. పోలీసులకే రక్షణ లేదంటూ విపక్షాలు పెద్ద ఎత్తున విమర్శలు గుప్పించాయి. అయితే ఇప్పుడు హెడ్ కానిస్టేబుల్ పై దాడికి ప్రయత్నించిన యువకుల చేతికి సంకెళ్లు వేసి రోడ్డుపై నడిపించుకుంటూ తీసుకువెళ్లిన వీడియో బయటకు వచ్చింది. దీంతో యాక్షన్ కు రియాక్షన్ అదిరిపోయిందంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. రెండు రోజుల క్రితం శ్రీకాళహస్తి పట్టణంలో ఇద్దరు యువకులు గొడవ చేస్తుండగా, హెడ్ కానిస్టేబుల్ రమణయ్య వారించడానికి ప్రయత్నించారని చెబుతున్నారు. అయితే మద్యం మత్తులో ఉన్న యువకులు హెడ్ కానిస్టేబుల్ పై తిరగబడ్డారు. చుట్టుపక్కల ఉన్నవారు వారిస్తున్నప్పటికీ హెడ్ కానిస్టుబుల్ కాలర్ పట్టుకుని దాడికి ప్రయత్నించారని అంటున్నారు. అంతేకాకుండా ఓ యువకుడు కత్తితో బెదిరించడంతో హెడ్ కానిస్టేబుల్ తోపాటు అక్కడ ఉన్నవారు బెదిరిపోయారు. కాసేపు హెడ్ కానిస్టేబుల్ తో గొడవ పడిన యువకులు ఆ తర్వాత అక్కడి నుంచి వెళ్లిపోగా, ఈ వీడియో సోషల్ మీడియాలో విస్తృత చర్చకు దారితీసింది. హెడ్ కానిస్టేబుల్ పై కత్తితో దాడికి యత్నించడం, నడిరోడ్డుపై కాలర్ పట్టుకుని యువకుల హంగామా చేసిన తర్వాత సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారని చెబుతున్నారు. ఆ తర్వాత దాడికి యత్నించిన యువకుల ఆచూకీ కోసం పోలీసులు విస్తృతంగా గాలించారు. కొద్దిసేపట్లోనే నిందితులను పట్టుకున్న పోలీసులు తమ స్టైల్ లో బుద్ధి చెప్పారని అంటున్నారు. ఇద్దరు యవకులను రోడ్డుపై నడిపించుకుంటూ పోలీసు స్టేషన్ కు తీసుకువెళ్లడమే కాకుండా, వారి చేతిని గొలుసులతో కట్టేశారు. ఈ వీడియో కూడా ఇప్పుడు వైరల్ అవుతోంది. పోలీసులపై తిరగబడిన యువకులకు ఆ మాత్రం ట్రీట్మెంట్ ఇవ్వాల్సిందేనని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. ఇక ఈ ఘటన రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ వినియోగంపై చర్చకు దారితీసినట్లు చెబుతున్నారు. నిందితులు డగ్స్ లేదా గంజాయి సేవించడం వల్లే పోలీసులపై ఆ స్థాయిలో తిరగబడి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గంజాయి కట్టడికి గట్టి చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నా, రాష్ట్రంలో ఎక్కడో ఒక చోట ఇలాంటి ఘటనలు వెలుగు చూడటం చర్చనీయాంశం అవుతోంది. ఈ ఘటన తర్వాత పోలీసులు గంజాయి రవాణాపై మరింత కట్టుదిట్టంగా వ్యవహరించాలని కోరుతున్నారు.

# 1000 మందికి ఎంతమంది డాక్టర్లు? దేశంలోనే ఆ రాష్ట్రంలోనే అత్యధికం!



భారత్‌లో ప్రతి సంవత్సరం వైద్యుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. నూతన మెడికల్ కాలేజీల ఏర్పాటు.. ఎంబీబీఎస్ , పీజీ సీట్ల పెంపుతో వైద్య రంగానికి కొత్త కళ వచ్చింది. అయితే పెరుగుతున్న డాక్టర్ల సంఖ్యకు అనుగుణంగా దేశంలో ప్రతి ఒక్కరికీ సమానంగా వైద్య సేవలు అందుతున్నాయా? అనే ప్రశ్న మాత్రం ఇప్పటికీ కీలకంగానే ఉండిపోయింది.

కేంద్ర ఆరోగ్య - కుటుంబ సంక్షేమ శాఖ 2026 ఫిబ్రవరిలో వెల్లడించిన తాజా గణాంకాల ప్రకారం.. దేశంలో ప్రస్తుతం 13,88,185 మంది రిజిస్టర్డ్ అలోపతి వైద్యులు ఉన్నారు. వీరితో పాటు 7,51,768 మంది ఆయుష్ వైద్యులు కూడా నమోదై ఉన్నారు.

**డాక్టర్-జనాభా నిష్పత్తి ఎంత?**

మొత్తం నమోదైన అలోపతి , ఆయుష్ వైద్యులలో సుమారు 80 శాతం మంది ప్రస్తుతం క్రియాశీలకంగా సేవలందిస్తున్నారని ప్రభుత్వం అంచనా వేసింది. ఈ లెక్కన దేశంలో డాక్టర్-పాపులేషన్ నిష్పత్తి 1:811గా ఉంది. అనగా సగటున ప్రతి 811 మందికి ఒక డాక్టర్ అందుబాటులో ఉన్నారు.

ప్రతి 1,000 మంది జనాభాకు దాదాపు 1.23 మంది డాక్టర్లు అందుబాటులో ఉన్నట్లు ఈ గణాంకాలు చెబుతున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన ప్రమాణం (1:1000) కంటే ఇది మెరుగ్గానే ఉందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. అయితే ఈ గణాంకాల్లో ఆయుష్ వైద్యులను కలపడం.. అలాగే 80% మంది మాత్రమే అందుబాటులో ఉన్నారనే అంచనాను పరిగణనలోకి తీసుకోవడం గమనించాల్సిన విషయం.

**ఏ రాష్ట్రంలో వైద్యుల లభ్యత ఎక్కువ?**

రాజ్యసభలో కేంద్ర ప్రభుత్వం వెల్లడించిన వివరాల ప్రకారం..2022 జూన్ నాటికి దేశంలోనే అత్యధికంగా రిజిస్టర్డ్ అలోపతి వైద్యులు ఉన్న పెద్ద రాష్ట్రాల్లో మహారాష్ట్ర అగ్రస్థానంలో ఉంది. మహారాష్ట్రలో 1,88,545, తమిళనాడులో 1,48,217, కర్ణాటకలో 1,34,426, ఆంధ్రప్రదేశ్ లో 1,05,799, కేరళలో 72,999 మంది ఉన్నారు. అయితే కేవలం మొత్తం వైద్యుల సంఖ్య ఆధారంగానే లభ్యతను చెప్పలేం. జనాభాను పరిగణనలోకి తీసుకుని పోల్చితే కేరళ రాష్ట్రంలో జనాభాతో పోలిస్తే డాక్టర్ల లభ్యత దేశంలోనే అత్యధికంగా ఉంది. ఆ తర్వాతి స్థానాల్లో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ నిలిచాయి. మహారాష్ట్ర, తమిళనాడులలో వైద్యుల సంఖ్య భారీగా ఉన్నప్పటికీ జనాభా ఎక్కువ కావడం వల్ల తలసరి లభ్యత నిష్పత్తి కొంత తక్కువగా కనిపిస్తుంది.

**గ్రామీణ సవాళ్లు..నర్సింగ్ సిబ్బంది**

దేశంలో నర్సింగ్ సిబ్బంది సంఖ్య 39.40 లక్షలుగా ఉంది. వీరిలో 80% మంది విధుల్లో ఉన్నారని భావిస్తే ప్రతి వెయ్యి మందికి 2.23 మంది

నర్సులు లభిస్తున్నారు. ప్రతి ఏటా దాదాపు 3.82 లక్షల మంది నర్సింగ్ విద్యార్థులు బయటకు వస్తున్నారు. అయితే పట్టణ ప్రాంతాల్లో వైద్యుల సాంద్రత ఎక్కువగా ఉండి గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం ఖాళీ పోస్టులు, స్పెషలిస్టుల కొరత తీవ్రంగా వేధిస్తున్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్.సీ), కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో పోస్టులను భర్తీ చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపైనే ఉందని.. నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా తాము ఆర్థిక, సాంకేతిక సహకారం అందిస్తున్నామని కేంద్రం తెలిపింది. డాక్టర్లు ప్రతి మారుమూల ప్రాంతానికి అందుబాటులో ఉన్నప్పుడే ఈ గణాంకాలకు నిజమైన ప్రతిఫలం లభిస్తుంది.

జార్ఖండ్‌లో నియామక పరీక్షల్లో అక్రమాలపై యువత ఆగ్రహం కట్టలు తెంచుకుంది. సోమవారం వేలాది విద్యార్థులు, ఉద్యోగార్థులు రాంచీలోని రాష్ట్ర శాసనసభ వైపు కదిలినప్పుడు పోలీసులు వాటర్ కెనాన్లు, బాష్పవాయు గోళాలు, లాఠీచార్జితో నిలువరించారు. జగన్నాథ్‌పూర్ ఆలయం సమీపంలోని చివరి బారికేడ్‌ను చేరుకున్న వేలాది యువకులు, తిరంగా జెండాలు, "జేఎస్ఎస్‌సీ-సీజీఎల్ పరీక్షలను రద్దు చేయండి లేదా సీబీఐ దర్యాప్తు జరపండి" వంటి ప్లకార్డులతో బారికేడ్లను ఛేదిస్తూ ముందుకు సాగారు. మొదట్లో పోలీసులు వాటర్ కెనాన్లు ప్రయోగించగా, ఆందోళనకారులు తిరంగా ఊపుతూ నృత్యాలు చేస్తూ ధిక్కారం ప్రదర్శించారు. అయితే పరిస్థితి చేయిదాటిపోయే సూచనలు కనిపించడంతో పోలీసులు లాఠీచార్జికి దిగారు. ఆందోళనకు నేతృత్వం వహిస్తున్న దేవేంద్రనాథ్ మహతో సహా అనేకులు గాయపడ్డారు. ఆగస్టు 2నుంచి నిరాహారదీక్ష చేస్తున్న మహతో, తొమ్మిది రోజులుగా ఆకలితో ఉన్నా అంబులెన్స్‌లోనే ర్యాలీలో పాల్గొన్నారు. "శాంతియుత నిరసనపై లాఠీచార్జి అనాగరికం" అని ఆందోళనకారుల్లో ఒకరైన పీయూష్ కుమార్ వ్యాఖ్యానించారు. కొంతమంది అల్లరిమూకలు బారికేడ్లు బద్దలుకొట్టి పోలీసులపై రాళ్లు రువ్వడంతో ముగ్గురు పోలీసులు గాయపడ్డారని రాంచీ ఎస్పీ పరస్ రానా మీడియాకు వెల్లడించారు. ఈ పరిణామంపై రాహుల్ గాంధీ స్పందిస్తూ, విద్యార్థులపై బలప్రయోగం తప్పని, శాంతియుత నిరసన తెలిపే హక్కు వారికి ఉందని, చర్చల ద్వారానే పరిష్కారం సాధ్యమని అభిప్రాయపడటం విశేషం. జార్ఖండ్‌లో అధికార సంకీర్ణంలో కాంగ్రెస్ కూడా భాగస్వామి. విద్యార్థుల ఆందోళనపై రాహుల్ 'మౌనం'పై బీజేపీ చేస్తున్న విమర్శలకు ఈ వ్యాఖ్యలు కొంత గాలి తీసేసినట్టయ్యింది.

ఈ ఆందోళన వెనుక ఉన్న అసలు సమస్య 14వ జేపీఎస్‌సీ ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలపై లేవనెత్తిన అనుమానాలతో మొదలైంది. అనంతరం జేపీఎస్‌సీ, జేఎస్ఎస్‌సీల పనితీరులో సమగ్ర సంస్కరణలు తీసుకురావాలన్న డిమాండ్‌గా విస్తరించింది. వాస్తవానికి ఇది కొత్త సమస్య కాదు. 2024 సెప్టెంబర్‌లో నిర్వహించిన జేజీజీఎల్‌సీసీఈ పరీక్షలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ విద్యార్థులు అప్పటినుంచీ పోరాడుతున్నారు. 3.04 లక్షలమంది హాజరైన పరీక్షలో అక్రమాలపై లిఖితపూర్వక, పెన్‌డ్రైవ్, సీడీ రూపాల్లో ఆధారాలు సమర్పించినట్టు అభ్యర్థుల నాయకుడు మనోజ్ యాదవ్ ఆరోపించారు. అయితే, తాము సమర్పించిన సీడీలో ఏమీలేదని, అది ఖాళీగా ఉందని జేఎస్ఎస్‌సీ అధికారులు బదులివ్వడం విద్యార్థుల ఆగ్రహాన్ని మరింత రేకెత్తించింది. అదే ఏడాది డిసెంబర్‌లో డాక్యుమెంట్ వెరిఫికేషన్ ప్రక్రియను అడ్డుకునేందుకు యత్నించిన అభ్యర్థులపై పోలీసులు లాఠీచార్జి చేసి, మహతోను అదుపులోకి తీసుకున్నారు కూడా. ఇంతటి సుదీర్ఘ చరిత్ర ఉన్న ఈ సమస్యను రాష్ట్ర ప్రభుత్వం ఇన్నాళ్లూ నిర్లక్ష్యం చేసిందన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రతిసారీ తాత్కాలిక చర్యలు, విచారణ కమిటీలతో సరిపెట్టి, మూలసమస్యను పరిష్కరించకుండా వాయిదా వేయడమే ప్రభుత్వ వైఖరిగా కనిపిస్తోంది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, సోమవారమే జేపీఎస్‌సీ మాజీ చైర్‌పర్సన్ ఎల్. ఖియాంగ్తేను నియామక పరీక్షల్లో అక్రమాలకు సంబంధించిన ఆరోపణలపై జార్ఖండ్ సీఐడీ అరెస్టు చేసింది. ఈ కుంభకోణంలో ఆయన పాత్రపై


## ఇక.. సాకులు సాగవు!

అధికారులకు గత కొద్ది రోజుల్లోనే అనుమానం వచ్చిందా? అది కూడా ఆందోళన జాతీయ వార్తల్లోకి వచ్చిన తర్వాతేనా అన్నది ప్రశ్నార్థకమే. ఇది కేవలం యాదృచ్ఛికమా, లేక ఆందోళన తీవ్రతను తగ్గించేందుకు హడావిడిగా తీసుకున్న చర్యనా అన్నది స్పష్టం కావాల్సి ఉంది. యువత కెరీర్లు, జీవితాలపై ఇంతటి నిర్లక్ష్య వైఖరి ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. నియామక పరీక్షలు కేవలం పరిపాలనాపరమైన తంతు కాదు. వేలాది యువకులకు అవి ఏళ్ల తరబడి చేసిన సన్నద్ధత, ఆర్థిక త్యాగం, స్థిరమైన భవిష్యత్తు కోసం పెంచుకున్న ఆశలకు ప్రతీక. మధ్యతరగతి, గ్రామీణ కుటుంబాల్లో ఒక్కో అభ్యర్థి వెనుక తల్లిదండ్రుల కష్టార్జితం, అప్పులు చేసి కోచింగ్ ఫీజులు కట్టిన త్యాగాలు దాగి ఉంటాయని మర్చిపోకూడదు.

ఏదైనా అక్రమం, జాప్యం, పేపర్ లీక్ లేదా తారుమారు జరిగితే, దాని పరిణామాలు ఒక్క పరీక్షకే పరిమితం కావు. అభ్యర్థులను మరో అనిశ్చిత చక్రంలోకి నెట్టివేస్తాయి, ప్రజా వ్యవస్థలపై నమ్మకాన్ని దెబ్బతీస్తాయి, కుటుంబాలపై మానసిక, ఆర్థిక భారాన్ని మోపుతాయి. ఒక్కసారి పరీక్ష రద్దయితే, మళ్లీ కొత్తగా సన్నద్ధం కావడం, మరో ఏడాది వేచి చూడటం, అప్పటికే వయోపరిమితి దాటిపోయే ప్రమాదం ఎదుర్కోవడం వంటి పరిణామాలు అభ్యర్థుల జీవితాలను తలకిందులు చేస్తాయి. కాబట్టి జార్ఖండ్ ప్రభుత్వం కేవలం నష్టనివారణ చర్యలకే పరిమితం కాకుండా, ప్రతి ఆరోపణపైనా పారదర్శకంగా, కాలపరిమితితో కూడిన దర్యాప్తు చేపట్టాలి. తప్పు చేసినవారు ఎంతటి పలుకుబడి కలిగినవారైనా, రాజకీయంగా ఎంత సన్నిహితులైనా, తమ నేరపూరిత ప్రమేయానికి బాధ్యత వహించాల్సిందే. అదే సమయంలో, నష్టపోయిన అభ్యర్థులకు అస్పష్టమైన హామీలు కాకుండా, స్పష్టమైన సమాచారం, విశ్వసనీయమైన కాలవ్యవధి, న్యాయమైన పరిష్కారాలు అందించాలి. ఇవి కూడా జెన్-జీని పూర్తిగా సంతృప్తిపరచకపోవచ్చు, కానీ ప్రభుత్వ చిత్తశుద్ధిని నిరూపించడానికి ఇది కనీస అవసరం.

సమస్య పరిష్కారం కావాలంటే, పార్టీలకు అతీతంగా, రాజకీయ ప్రయోజనాలను పక్కనబెట్టి, యువత న్యాయమైన డిమాండ్లను నెరవేర్చేందుకు నిజాయితీతో కూడిన కృషి జరగాలి. కేవలం రాంచీలోనే కాదు, దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ఇలాంటి నియామక పరీక్షల అక్రమాలు యువతలో తీవ్ర అసంతృప్తికి కారణమవుతున్నాయి. బిహార్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లోనూ ఇటీవలి సంవత్సరాల్లో ఇలాంటి ఆందోళనలు తలెత్తడం, పరీక్షల విశ్వసనీయతపై యువతలో పెరుగుతున్న అపనమ్మకానికి నిదర్శనం. జార్ఖండ్‌తోపాటు ఇతర రాష్ట్రాల్లోని అధికారులు కూడా ఇలాంటి వివాదాలు పునరావృతం కాకుండా నివారణ చర్యలను వ్యవస్థాగతంగా రూపొందించుకోవాలి. సాంకేతికత సాయంతో పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెంచడం, స్వతంత్ర పర్యవేక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేయడం, ఫలితాల ప్రకటనలో జాప్యాన్ని నివారించడం వంటి దీర్ఘకాలిక సంస్కరణలు అవసరం. యువత కోరుతున్నది కేవలం ప్రతిభ ఆధారిత, పారదర్శకమైన నియామక వ్యవస్థ మాత్రమే. ఈ న్యాయమైన డిమాండ్‌ను నిర్లక్ష్యం చేసే ఏ ప్రభుత్వమైనా, రాబోయే రోజుల్లో మరింత తీవ్రమైన యువ ఆగ్రహాన్ని ఎదుర్కోక తప్పదు!

## పనికొచ్చే పలుకు



## జీర్ణ వ్యవస్థను పట్టించుకోవాలి..

శరీరాన్ని ఒక ఇంటితో పోల్చుకుంటే, జీర్ణవ్యవస్థ దాని పునాది లాంటిది. పునాది గట్టిగా లేకుండా ఇంటికి రంగులు వేయడం, తలుపులు అలంకరించడం ఎంత అర్థరహితమో, జీర్ణవ్యవస్థను నిర్లక్ష్యం చేస్తూ మెటబాలిజాన్ని మెరుగుపరచుకోవాలని ప్రయత్నించడం కూడా అంతే వ్యర్థం. చాలామంది బరువు తగ్గాలని, శక్తివంతంగా ఉండాలని కొత్త డైట్లు, సప్లిమెంట్లు, ఫ్యాడ్ వర్కౌట్లు వెతుక్కుంటూ పరుగులు తీస్తారు. కానీ వీటన్నింటి ప్రభావం ఆధారపడేది ఒక్క -మీ జీర్ణవ్యవస్థ ఎంత ఆరోగ్యంగా పనిచేస్తోంది అన్నదానిపైనే. తినే ఆహారం సరిగ్గా జీర్ణం కాకపోతే, ఎంత పోషకాహారం తీసుకున్నా శరీరం దాన్ని సరిగ్గా ఉపయోగించుకోలేదు.

జీర్ణవ్యవస్థ కేవలం ఆహారాన్ని జీర్ణం చేసే యంత్రం మాత్రమే కాదు. ఇది శరీరంలోని రక్తంలో చక్కెర స్థాయిలను, హార్మోన్ల సమతుల్యతను, రోగనిరోధక శక్తిని నియంత్రించే కీలక కేంద్రం. శరీరంలోని రోగనిరోధక వ్యవస్థలో అత్యధిక భాగం జీర్ణాశయంలోనే ఉంటుందని పరిశోధనలు చెబుతున్నాయి. అంతేకాదు, మెదడుకు, జీర్ణవ్యవస్థకు మధ్య నిరంతర సంభాషణ జరుగుతూనే ఉంటుంది. -దీన్నే 'గట్-బ్రెయిన్ యాక్సిస్' అంటారు. ఒత్తిడి, ఆందోళన వంటి మానసిక సమస్యలు తరచూ జీర్ణవ్యవస్థ అసమతుల్యత నుంచే మొదలవుతాయని ఆధునిక వైద్యశాస్త్రం నిర్ధారిస్తోంది. అందుకే, జీర్ణవ్యవస్థను నిర్లక్ష్యం చేసి కేవలం బాహ్య లక్షణాలను -బరువు, అలసట, చర్మ సమస్యలు మాత్రమే సరిచేయాలని ప్రయత్నించడం, మూలాలు వదిలేసి పైపైన మందు వేయడం లాంటిదే.

పురాతన గ్రీకు వైద్యుడు హిప్పోక్రటీస్‌కు అంటగట్టబడిన ఒక ప్రసిద్ధ వాక్యం ఇక్కడ గుర్తుచేసుకోవాలి: *All disease begins in the gut.* (అన్ని రోగాలూ మొదలయ్యేది జీర్ణాశయం నుంచే). ఈ ఖచ్చితమైన వాక్యం హిప్పోక్రటీస్ రచనల్లో ప్రత్యక్షంగా కనిపించకపోయినా, రెండువేల ఏళ్లుగా ఆయనకు ఆపాదిస్తూ వస్తున్న ఈ భావన వెనుక ఉన్న సారాంశాన్ని ఆధునిక శాస్త్రం మరింత బలపరుస్తోంది. జీర్ణాశయంలోని మంచి బ్యాక్టీరియా సమతుల్యత దెబ్బతింటే, అది కేవలం అజీర్ణానికే పరిమితం కాకుండా, స్థూలకాయం, మధుమేహం, హృద్రోగాలు, మానసిక సమస్యల వరకూ దారితీయవచ్చని పరిశోధనలు చూపిస్తున్నాయి.

కాబట్టి, తదుపరిసారి మీరు కొత్త డైట్ ప్లాన్ లేదా సప్లిమెంట్ కోసం వెతుకుతున్నప్పుడు, ముందు ఒక్క క్షణం ఆగి ఆలోచించాల్సింది -నా జీర్ణవ్యవస్థ సరిగ్గా పనిచేస్తోందా? ఆహారం తిన్న తర్వాత ఉబ్బరం, అసౌకర్యం అనిపిస్తుందా? నిద్ర, చర్మం, శక్తిస్థాయిలు ఎలా ఉన్నాయి? ఈ ప్రశ్నలకు సమాధానాలు వెతకడమే మీ ఆరోగ్య ప్రయాణానికి నిజమైన మొదటి అడుగు. పీచు పదార్థాలు ఎక్కువగా తీసుకోవడం, పులియబెట్టిన ఆహారాలను ఆహారంలో చేర్చుకోవడం, తగినంత నీరు తాగడం, నిదానంగా, నమిలి తినడంవంటి చిన్న చిన్న అలవాట్లు జీర్ణవ్యవస్థను బలోపేతం చేస్తాయి. పునాది గట్టిగా ఉంటేనే ఇల్లు నిలబడుతుంది. అలాగే జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉంటేనే, మిగతా ఆరోగ్య లక్ష్యాలన్నీ సాధ్యమవుతాయి.

జీర్ణవ్యవస్థను జాగ్రత్తగా చూసుకోవడమంటే, మీ శరీరానికి మీరిచ్చే అతిపెద్ద గౌరవం. బయటి మార్పుల కోసం ఆరాటపడేముందు, లోపలి పునాదిని పదిలం చేసుకోండి. మీ క్రమశిక్షణకు మురిసిపోయి.. ఆరోగ్యం దానంతటదే మీ వెంటపడుతుంది.


# పల్లె బడులవైపు.. బొద్దింకలు!



జంతర్‌మంతర్‌లో వీధుల్లోకి దిగి కేంద్ర ప్రభుత్వాన్నే మెడలు వంచిన 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) ఇప్పుడు కొత్త ఉద్యమానికి తెరతీసింది. ఈ ఏడాది మే 15న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, నిరుద్యోగ యువతను 'బొద్దింకలు', 'సమాజ పరాన్నజీవులు'గా అభివర్ణించడం (ఆ తర్వాత తప్పుగా కోట్ చేశారని ఆయన వివరణ ఇచ్చినా) దేశవ్యాప్తంగా యువతలో ఆగ్రహావేశాలకు దారితీసింది. ఈ నేపథ్యంలోనే మే 16న అభిజీత్ దీప్కే అనే మాజీ ఆమ్ ఆద్మీ పార్టీ వ్యూహకర్త, వ్యంగ్యాత్మకంగా 'కాక్రోచ్ జనతా పార్టీ'ని స్థాపించారు. జూన్ 6నుంచి జులై 25 వరకూ ఢిల్లీ జంతర్‌మంతర్ కేంద్రంగా సాగిన ఈ ఉద్యమం, నీట్ పేపర్ లీక్ సహా అనేక జాతీయ పరీక్షల్లో అక్రమాలపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. ఈ ఆందోళనలో వేలాదిమంది జెన్-జీ యువత పాల్గొన్నారు. పోలీసు బలప్రయోగంలో దాదాపు 180 మంది గాయపడ్డారు. సోనమ్ వాంగ్‌చుక్ 26 రోజుల నిరాహారదీక్ష చేయడం, పలువురు ప్రముఖులు మద్దతు పలకడంతో ఉద్యమం మరింత ఊపందుకుంది. చివరికి జూలై 26న ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంతో, మోదీ ప్రభుత్వం 12 ఏళ్ల పాలనలో అరుదైన వెనుకడుగు వేయాల్సి వచ్చింది. ఈ విజయం సాధించిన సీజేపీ.. ఇప్పుడు మరో ఉదాత్తమైన లక్ష్యంతో ముందుకొచ్చింది. అదే -గ్రామీణ ప్రభుత్వ పాఠశాలలను బాగుచేసుకోవడం!

ఆగస్టు 15న దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సీజేపీ 'సర్పంచ్ ఛాలెంజ్' పేరుతో దేశవ్యాప్త ప్రచారోద్యమాన్ని ప్రారంభిస్తోంది. మహారాష్ట్రలోని హింగోలి జిల్లా, సంతూక్ పింప్రి తన సొంత గ్రామం నుంచి ఈ ఉద్యమాన్ని దీప్కే స్వయంగా మొదలుపెట్టనున్నారు. "గత 80 ఏళ్లలో అత్యంత నిర్లక్ష్యానికి గురైంది మన గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలే. కొత్త పార్లమెంటు భవనం కట్టుకున్నాం. కొత్త ప్రధాని నివాసం నిర్మించుకున్నాం. కానీ మన పిల్లలు చదువుకునే బడులను మర్చిపోయాం" అని దీప్కే తన వీడియో సందేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఉద్యమంలో మూడు ప్రధాన అంశాలున్నాయి. మొదటిది -ఊళ్లో ఉన్నవారు లేదా వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారు తమ సొంతూరికి వెళ్లి స్థానిక సర్పంచ్‌కు పాఠశాలల మెరుగుదల కోరుతూ విజ్ఞాపన పత్రం సమర్పించడం. రెండోది -పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తున్న తల్లిదండ్రులే స్వయంగా ఆ పాఠశాలలను సందర్శించి, విద్యుత్, స్వచ్ఛమైన తాగునీరు, పనిచేసే మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజన సదుపాయాలున్నాయో లేదో పరిశీలించి సామాజిక తనిఖీ చేపట్టడం. మూడోది -పాఠశాలలను మెరుగుపరిచిన సర్పంచ్‌లను ముందు-తర్వాత ఫొటోలతో సోషల్ మీడియాలో ప్రచారం చేసి, వారికి బహిరంగ గుర్తింపు ఇవ్వడం ద్వారా మరిన్ని గ్రామాలు ఈ దిశగా ప్రేరణ పొందేలా చేయడం. "మీరు మెరుగుపరిచిన బడులను చూసి, మిమ్మల్ని చూసి, ఇంకా చాలామంది సర్పంచ్‌లు తమ గ్రామాల్లో బడులను బాగుచేయడం మొదలుపెడతారు" అని దీప్కే వివరించారు. ప్రయివేటు మాఫియా చేతుల్లో విద్య వ్యాపార వస్తువుగా మారిన నేటి పరిస్థితుల్లో, కోట్లాది రూపాయల బడ్జెట్ కేటాయించినా క్షేత్రస్థాయిలో సద్వినియోగం కాకుండా మిగిలిపోతున్న ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుకోగలిగితే, సామాన్యుల పిల్లలకూ నాణ్యమైన విద్య అందుతుందన్నది ఉద్యమం వెనుక ఉన్న సూత్రం. ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూసుకోవడం కూడా ఇందులో అంతర్భాగమే. ప్రముఖ రచయిత్రి అరుంధతీ రాయ్ ఇటీవల సీజేపీ ఉద్యమాన్ని ప్రశంసిస్తూ.. "ఆశ పూర్తిగా సన్నగిల్లిన తరుణంలో వర్షంలో స్వారీ చేస్తూ వచ్చిన యువ 'బొద్దింకల' తరం.. ఒక న్యాయమూర్తి, ఒక వ్యంగ్యం కలయిక నుంచి పుట్టిన సంతానం"గా అభివర్ణించడం విశేషం. ఈ మద్దతు, జెన్-జీ చైతన్య శక్తిపై సమాజంలోని మేధావి వర్గం ఎంత విశ్వాసం పెంచుకుందో స్పష్టం చేస్తోంది.

పాఠశాలలను ప్రజలే స్వచ్ఛందంగా బాగుచేసుకోవాలన్న ఆలోచన కొత్తది కాకపోవచ్చు. దీనిని ఇంత భారీస్థాయిలో, దేశవ్యాప్త ఉద్యమంగా, ఒక రాజకీయ పార్టీ నేతృత్వంలో నిర్వహించడం మాత్రం అరుదైన ప్రయోగమే. సాధారణంగా గ్రామాల్లో సామాజిక బాధ్యతగా పాఠశాలల అభివృద్ధికి స్థానికులు, స్వచ్ఛంద సంస్థలు పాటుపడిన సందర్భాలు దేశంలో ఇప్పటికే ఉన్నా, వాటిని జాతీయస్థాయి ఉద్యమంగా, సామాజిక మాధ్యమాల శక్తిని ఉపయోగించుకుంటూ, పోటీతత్వాన్ని ప్రేరేపిస్తూ నిర్వహించడం సీజేపీ నమూనాలోని ప్రత్యేకత. ఇది ఎంతవరకు సఫలమవుతుందన్నది కాలమే నిర్ణయిస్తుంది.. కానీ కొన్ని అంశాలు దీని విజయావకాశాలను బలపరుస్తున్నాయి. మొదటిది -ఇది ప్రభుత్వాన్ని ప్రత్యక్షంగా ఢీకొట్టే ఆందోళన కాదు. గ్రామస్థాయి పాలనా వ్యవస్థతో సానుకూలంగా సంభాషించే నిర్మాణాత్మక ప్రయత్నం. కాబట్టి రాజకీయ ఘర్షణలకు తావు తక్కువ. రెండోది -జంతర్‌మంతర్ ఉద్యమం ద్వారా సీజేపీ ఇప్పటికే భారీ యువజన నెట్‌వర్క్‌ను నిర్మించుకుంది. ఆ ఊపును ఇప్పుడు నిర్మాణాత్మక దిశగా మళ్లించడం సాధ్యమే. మూడోది -సర్పంచ్‌లకు ప్రజాభిమానం, ప్రచారం లభిస్తే, గ్రామీణ రాజకీయాల్లో అది వారికి రాజకీయంగా కూడా ప్రయోజనం చేకూరుస్తుంది కాబట్టి, స్వచ్ఛందంగా ముందుకొచ్చే అవకాశం ఎక్కువ. అయితే, సవాళ్లు కూడా తక్కువేమీ కాదు. నిధుల కొరత ఉన్న గ్రామ పంచాయతీలు మౌలిక సదుపాయాలు సమకూర్చడం అంత తేలిక కాదు. కేవలం సామాజిక ఒత్తిడితో మాత్రమే శాశ్వత పరిష్కారం లభించదు. ఇది ప్రభుత్వ బాధ్యతను ప్రజలపైకి నెట్టివేసే ప్రయత్నంగా మారకుండా చూసుకోవాల్సిన బాధ్యత కూడా సీజేపీపై ఉంది. మొత్తంమీద, ఎన్నికల్లో పోటీ చేయని, వ్యంగ్యంతో పుట్టిన ఈ పార్టీ, కేవలం నిరసనలకే పరిమితం కాకుండా నిర్మాణాత్మక కార్యాచరణవైపు అడుగేయడం సానుకూల పరిణామం. ఇది ప్రభుత్వాలకు సున్నితమైన హెచ్చరిక కూడా. =ప్రజలు ఇక ఖాళీ వాగ్దానాలతో సంతృప్తిపడరని, తమ పనులు తామే చేసుకునేంత చైతన్యం, సంకల్పం వారికుందని ఉద్యమం చాటిచెబుతోంది. జంతర్‌మంతర్‌లో పోరాడి ఒక మంత్రిని దించగలిగిన శక్తి, ఇప్పుడు గ్రామాల్లో బడులను బాగుచేసే దిశగా మళ్లడం, జెన్-జీ ఉద్యమం కేవలం ఆగ్రహావేశాలకే పరిమితం కాకుండా, నిర్మాణాత్మక సామాజిక మార్పుకూ నాయకత్వం వహించగలదని నిరూపిస్తోంది. ఈ ఉద్యమం ఎంతవరకు విజయవంతమవుతుందన్నది ప్రజాభాగస్వామ్యం, సర్పంచ్‌ల చిత్తశుద్ధిపైనే ఆధారపడి ఉంటుంది. అయితే, ఒక్క విషయం మాత్రం స్పష్టం. జెన్-జీ ఇకపై కేవలం సామాజిక మాధ్యమాల్లో వ్యాఖ్యానాలకే పరిమితం కాకుండా, వీధుల్లోకి దిగి, గ్రామాలవైపు కదిలి, తమ భవిష్యత్తును తామే తీర్చిదిద్దుకునే దిశగా అడుగులేస్తోంది. ఇది ప్రభుత్వాలకు, రాజకీయ వ్యవస్థకు ఒక స్పష్టమైన సందేశం -ఇకపై నిర్లక్ష్యానికి తావు లేదు, జవాబుదారీతనమే శరణ్యం. ■




స్పష్టత ఉంటేనే పురోగతి. లక్ష్యాల పట్ల నాయకుడికి స్పష్టత లేకపోతే.. బృందంలో కూడా అయోమయం నెలకొంటుంది. మీ సంస్థ లేదా బృందం ఏ దిశగా పయనిస్తోందో అక్కడ పనిచేసే ప్రతి ఒక్కరూ ఒక వాక్యంలో చెప్పలేకపోతే.. మీరు స్పష్టమైన మార్గాన్ని నిర్దేశించనట్లే. స్పష్టమైన దిశా నిర్దేశం చేయడం అనేది నాయకుడి బాధ్యత మాత్రమే కాదు, తప్పనిసరి అర్హత కూడా. స్పష్టత లేని నాయకత్వం, గమ్యం తెలియని ప్రయాణంలా వృథా శక్తినే మిగుల్చుతుంది. దిశ స్పష్టంగా ఉంటేనే, బృందంలో ప్రతి అడుగూ ఒకే గమ్యం వైపు కదులుతుంది.

-మహాదేవ

## వింతల్లో వింతలు

## ఉలితో మలచిన ఊరి దారి!



చైనాలోని చాంగ్‌కింగ్ ప్రావిన్స్‌లో సముద్రమట్టానికి 3,000 అడుగుల ఎత్తులో ఉన్న లాన్యింగ్ గ్రామం, బయటి ప్రపంచంతో దాదాపు సంబంధమే లేకుండా ఒంటరిగా మిగిలిపోయింది. 2001లో ఆ గ్రామంలోని 23 కుటుంబాలు కలిసి, కొండను తొలుచుకుంటూ ఒక రహదారి నిర్మించాలని సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారు. ఇరుకైన కొండ మార్గంలో యంత్రాలు వాడే వీలు లేకపోవడంతో, సుమారు 80 మంది గ్రామస్తులు ఉలి, సుత్తి పట్టుకుని రాతిని చేతులతోనే తొలిచారు. ఒక్కో కుటుంబం రహదారిలో ఒక భాగాన్ని చెక్కే బాధ్యత తీసుకుంది. ఇలా దాదాపు నాలుగేళ్లపాటు శ్రమించి, 1.2 కిలోమీటర్ల పొడవైన రహదారికి ప్రాథమిక రూపాన్ని ఇచ్చారు. 2016లో చాంగ్‌కింగ్ ప్రభుత్వం ఈ రహదారిని బలోపేతం చేసి, వెడల్పు పెంచేందుకు అనుమతించింది. కొన్నిచోట్ల 22.9 శాతం ఏటవాలుతో అత్యంత ప్రమాదకరమైన మార్గంగా పేరొందిన ఈ రహదారి, చాంగ్‌కింగ్‌లోనే అత్యంత లోతైన లాన్యింగ్ కనుమ అందాలను చూసేందుకు సాహసికులను ఆకర్షిస్తోంది.

# ఈ ఆహారాలు తింటే రోగనిరోధక శక్తి డబుల్

మన శరీరంలో రెండో మెదడు ఎక్కడ ఉంటుందో తెలుసా? అది మన పొట్ట. పొట్ట ఆరోగ్యంగా ఉంటేనే మన మూడ్ బాగుంటుంది. అన్ని పనులు సజావుగా చేయడానికి శరీరం కూడా సహకరిస్తుంది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. చివరికి చర్మం కూడా కాంతివంతంగా మెరుస్తుంది. కానీ ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో గ్యాస్, ఎసిడిటీ, మలబద్ధకం వంటి సమస్యలు ప్రతి ఒక్కరినీ వేధిస్తున్నాయి. వీటన్నింటికీ ప్రధాన కారణం మనం తీసుకునే ఆహారంలో ఒక ముఖ్యమైన అంశం తగ్గిపోవడమే. అదే 'ఫైబర్' (పీచు పదార్థం). ప్రముఖ గ్యాస్ట్రో స్పెషలిస్ట్ డాక్టర్ పాల్, మన వంటింట్లో దొరికే సాధారణ పదార్థాలతోనే పొట్టను ఎలా క్లీన్ చేసుకోవచ్చో వివరించారు. ఆయన సూచించిన ఆ ఐదు సూపర్ ఫుడ్స్ ఏంటి? ఫైబర్ అనేది జీర్ణవ్యవస్థకు ఒక క్లీనర్ లాగా పనిచేస్తుంది. ఇది మనం తిన్న ఆహారం సాఫీగా కదలడానికి సహాయపడటమే కాకుండా, మన పొట్టలో ఉండే మంచి బ్యాక్టీరియాకు ఆహారాన్ని అందిస్తుంది. ఫైబర్ అందించడంలో వేయించిన శనగలు అగ్రస్థానంలో నిలుస్తాయి. ప్రతి 100 గ్రాముల శనగలలో సుమారు 17 గ్రాముల ఫైబర్ ఉంటుంది. ఇందులో ఉండే ఇన్‌సోల్యూబుల్ ఫైబర్, ప్రోటీన్ మిమ్మల్ని ఎక్కువ సేపు ఆకలి వేయకుండా ఉంచుతాయి. వీటిని చిరుతిండిగా నేరుగా తీసుకోవచ్చు లేదా సలాడ్లలో కలుపుకోవచ్చు. మన ఇళ్లలో సాధారణంగా వాడే నల్ల మినుములలో ఒక కప్పుకు 16 గ్రాముల ఫైబర్ లభిస్తుంది. ఇందులో కరిగే, కరగని ఫైబర్స్ రెండూ ఉంటాయి. ఇవి జీర్ణక్రియను మెరుగుపరచడమే కాకుండా, మన పొట్టలోని మంచి బ్యాక్టీరియాను పోషిస్తాయి. పప్పు మఖానీ లేదా అన్నంలో కలిపి తీసుకోవడం వల్ల గుండెకు కూడా మేలు జరుగుతుంది. చియా విత్తనాలు ఇప్పుడు సూపర్ ఫుడ్‌గా ప్రాచుర్యం పొందాయి. కేవలం రెండు టేబుల్ స్పూన్ల చియా విత్తనాల్లో 10 గ్రాముల ఫైబర్ ఉంటుంది. ఇవి పొట్టలోకి వెళ్ళగానే జెల్ లాగా మారి జీర్ణక్రియను సులభతరం చేస్తాయి. బ్లడ్



షుగర్ లెవల్స్ స్థిరంగా ఉండటానికి కూడా ఇవి తోడ్పడతాయి. డాక్టర్ పాల్ వీటిని పెరుగుతో కలిపి తీసుకోవాలని సూచిస్తున్నారు. చూడటానికి చాలా చిన్నవిగా ఉన్నా, రాస్ప్‌బెర్రీస్ ఫైబర్ పవర్‌హౌస్‌లు. ఒక కప్పు రాస్ప్‌బెర్రీస్‌లో 8 గ్రాముల ఫైబర్ లభిస్తుంది. ఇవి మంచి బ్యాక్టీరియాకు మద్దతు ఇవ్వడమే కాకుండా, శరీరానికి కావాల్సిన యాంటీ ఆక్సిడెంట్లను అందిస్తాయి. వీటిని స్మూతీలలో లేదా ఓట్స్‌లో కలిపి తీసుకోవచ్చు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆరోగ్యాన్ని ఇచ్చే పండు జామ. ఇందులో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. మలబద్ధకంతో బాధపడేవారికి ఇది ఒక దివ్యౌషధంలా పనిచేస్తుంది. రోజూ
ఒక జామ పండు తినడం వల్ల జీర్ణవ్యవస్థ మొత్తం శుభ్రపడుతుంది. ఆరోగ్యకరమైన పొట్టే సంతోషకరమైన జీవితానికి ఆధారం. డాక్టర్ పాల్ సూచించిన ఈ ఐదు పదార్థాలను మీ రోజువారీ ఆహారంలో భాగంగా చేసుకోవడం వల్ల జీర్ణ సమస్యల నుండి శాశ్వత ఉపశమనం పొందవచ్చు. ఇవి కేవలం మీ పొట్టనే కాకుండా, మీ పూర్తి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి.

## ప్యాకేజీ ఫుడ్‌తో క్యాన్సర్ ముప్పు!



ఆధునిక జీవనశైలిలో మనకు సమయం దొరకడమే కష్టమవుతోంది. అందుకే త్వరగా తయారయ్యే ఇన్స్టంట్ ఫుడ్స్, ప్యాక్ చేసిన పానీయాలు, ఎక్కువ కాలం నిల్వ ఉండే ఆహార పదార్థాల వైపు అందరం మొగ్గు చూపుతున్నాం. కానీ మనం సౌకర్యవంతంగా భావిస్తున్న ఈ ఆహారమే మన ప్రాణాల మీదకు తెచ్చే ప్రమాదం ఉందని మీకు తెలుసా?ఆహారం పాడవకుండా, ఎక్కువ కాలం తాజాగా ఉంచేందుకు కంపెనీలు వాడే కొన్ని కెమికల్స్.. నిశ్శబ్దంగా మన శరీరంలో క్యాన్సర్ కణాలను పెంచుతున్నాయని తాజా అంతర్జాతీయ పరిశోధనలో తేలింది. ముఖ్యంగా మహిళల్లో వచ్చే రొమ్ము క్యాన్సర్, పురుషుల్లో వచ్చే ప్రోస్టేట్ క్యాన్సర్‌లకు ఈ నిల్వ కారకాలే ప్రధాన శత్రువులని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అసలు ఆ ప్రమాదకరమైన ప్రిజర్వేటివ్స్ ఏంటి? ఫ్రాన్స్‌లోని 'యూనివర్సిటీ పారిస్ సిటీ' పరిశోధకులు సుమారు 1,05,260 మందిపై సుదీర్ఘ కాలం పాటు జరిపిన అధ్యయన ఫలితాలను 'ది బిఎమ్?జె (ఃఓఏ)' జర్నల్‌లో ప్రచురించారు. ప్యాక్ చేసిన ఆహారాల్లో వాడే 17 రకాల ప్రిజర్వేటివ్స్ గురించి వారు పరిశీలించగా, అందులో కొన్ని సాధారణ కెమికల్స్ క్యాన్సర్ రిస్క్‌ను విపరీతంగా పెంచుతున్నట్లు గుర్తించారు. పొటాషియం సోర్బేట్: ఇది మొత్తం క్యాన్సర్ ముప్పును 14 శాతం, రొమ్ము క్యాన్సర్ ముప్పును 26 శాతం పెంచుతున్నట్లు తేలింది.సోడియం నైట్రైట్: మాంసం నిల్వ ఉంచేందుకు వాడే ఈ కెమికల్ వల్ల ప్రోస్టేట్ క్యాన్సర్ వచ్చే అవకాశం 32 శాతం ఎక్కువగా ఉంది.పొటాషియం నైట్రేట్: దీని వల్ల రొమ్ము క్యాన్సర్ ముప్పు 22 శాతం పెరుగుతోంది.సల్ఫైట్లు: ఆహారంలో వీటి పరిమాణం ఎక్కువైతే సాధారణ క్యాన్సర్ రిస్క్ 12 శాతం పెరుగుతుంది.అసిటేట్లు: ఇవి రొమ్ము క్యాన్సర్ ముప్పును 25 శాతం పెంచుతాయని పరిశోధనలో వెల్లడైంది. ఆహారం నిల్వ ఉండటానికి వాడే ఈ రసాయనాలు మన శరీరంలోని రోగనిరోధక శక్తిని దెబ్బతీస్తాయి. ఇవి శరీరంలో ఇన్ఫ్లమేషన్ (వాపు)ను పెంచి, క్యాన్సర్ కణాలు వృద్ధి చెందడానికి అనువైన వాతావరణాన్ని కల్పిస్తాయి. సహజమైన యాంటీ ఆక్సిడెంట్ ప్రిజర్వేటివ్స్ పెద్దగా నష్టం చేయకపోయినా.. సోడియం ఎరిథోర్బేట్ వంటి కొన్ని రసాయనాలు మాత్రం అనారోగ్యానికి కారణమవుతున్నాయి.

## రాత్రి భోజనానికి ఏది ప్రయోజనకరం



రాత్రి పూట అన్నం తింటే బాగుంటుందా? లేదా రోటీ తింటే బాగుంటుందా? అనే ప్రశ్న తలెత్తుతుంటుంది. రాత్రి పూట ఈ రెండింటిలో ఏదీ తీసుకుంటే మంచిది? వీటి శరీరానికి ఎలాంటి ప్రయోజనాలు ఉంటాయి? దీనిపై నిపుణులు కీలక విషయాలు వెల్లడించారు. రాత్రి భోజనంలో అన్నం తినాలా లేక రోటీ తినాలా అనేది తరచుగా ప్రజలను కలవరపెట్టే ప్రశ్న. నిపుణులు సమాధానం మీ జీవనశైలి, జీర్ణ సామర్థ్యం, ఆరోగ్యంపై ఆధారపడి ఉంటుందని అంటున్నారు. రెండూ పోషకమైనవి. కానీ కొన్ని తేడాలు ఏ విందు ఎంపిక ఉత్తమమో నిర్ణయిస్తాయి. పోషకాహార నిపుణుల అభిప్రాయం ప్రకారం.. రోటీ కంటే బియ్యం వేగంగా జీర్ణమవుతాయి. రాత్రిపూట జీర్ణశక్తి బలహీనంగా ఉంటుంది. అందుకే బియ్యం శరీరంపై ఎక్కువ ఒత్తిడిని కలిగించదు. తెల్ల బియ్యం తేలికగా ఉంటుంది. అలాగే కడుపు, ప్రేగులపై ఒత్తిడిని కలిగించదు. ఇది నిద్రకు కూడా సహాయపడుతుంది. కానీ జాగ్రత్తగా ఉండండి. వడ్డించే పరిమాణాలను అదుపులో ఉంచండి. ఎల్లప్పుడూ పప్పుధాన్యాలు, కూరగాయలను పక్కన పెట్టుకోండి. బ్రెడ్‌లో ఫైబర్ అధికంగా ఉంటుంది. ముఖ్యంగా గోధుమ, జొన్న లేదా మల్టీగ్రెయిన్ పిండి అయితే. రాత్రిపూట రోటీ తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. మధుమేహ వ్యాధిగ్రస్తులకు, బరువును నియంత్రించుకోవాలనుకునే వారికి రోటీ మంచిదని నిపుణులు భావిస్తున్నారు. ఇక రోటీలో ఫైబర్ పుష్కలంగా ఉండటం వల్ల మిమ్మల్ని ఎక్కువసేపు కడుపు నిండి ఉండేలా చేస్తుంది. అన్నం త్వరగా జీర్ణమవుతుంది. అందుకే రాత్రిపూట ఆకలిగా ఉన్నవారికి 1-2 రోటీలు మంచి ఎంపిక. బియ్యంలో ఉండే ట్రిప్టోఫాన్ తేలికపాటి విశ్రాంతినిస్తుంది. అందువల్ల రాత్రిపూట తేలికపాటి భోజనాన్ని ఇష్టపడేవారు కొంచెం అన్నం తినవచ్చు. బరువు తగ్గాలనుకుంటున్నారా ? అయితే రాత్రిపూట రోటీ మంచిది. జీర్ణశక్తి బలహీనంగా ఉందా లేదా తేలికైన భోజనం కావాలనుకునేవారికి అన్నంమంచి ఎంపిక.నిపుణుల అభిప్రాయం ప్రకారం.. రోటీ- అన్నం రెండూ రాత్రిపూట మంచివి. అది మీ ఆరోగ్యం, అవసరాన్ని బట్టి ఉంటుంది.

# ఆహారాలు కుక్కర్‌లో ఉడికించి తింటే.. కిడ్నీలు మటాష్! జాగ్రత్త మరీ..




వంట ప్రక్రియ త్వరగా పూర్తవుతుందని కుక్కర్‌లో అన్ని రకాల ఆహారాలను వండటం సరైనది కాదు. అవును.. కుక్కర్‌లో కొన్ని ఆహార పదార్థాలను వండటం వల్ల వాటి పోషకాలు నాశనమవుతాయి. అలాంటి ఆహారాలు తీసుకోవడం వల్ల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు ఉంటాయి. దాదాపు ప్రతి ఇంట్లోనూ ప్రెషర్ కుక్కర్లు వాడుతారు. అన్నం వండటం నుంచి సాంబారు తయారీ వరకు త్వరగా వంట పూర్తి చేయడానికి, సమయం, గ్యాస్ ఆదా చేయడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. కానీ వంట ప్రక్రియ త్వరగా పూర్తవుతుందని కుక్కర్‌లో అన్ని రకాల ఆహారాలను వండటం సరైనది కాదు. అవును.. కుక్కర్‌లో కొన్ని ఆహార పదార్థాలను వండటం వల్ల వాటి పోషకాలు నాశనమవుతాయి. అలాంటి ఆహారాలు తీసుకోవడం వల్ల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు ఉంటాయి. అందువల్ల ఈ రకమైన ఆహారాలను ప్రెషర్ కుక్కర్‌లో వండకూడదు.సాధారణంగా చాలా మంది కుక్కర్‌లో బియ్యం వండుతారు. కానీ బియ్యాన్ని ఎప్పుడూ కుక్కర్‌లో వండకూడదు. ఎందుకంటే ఇలా కుక్కర్‌లో బియ్యం వండడం వల్ల ఆర్సెనిక్ అనే విష పదార్థం విడుదల అవుతుంది. ఇది మన ఆరోగ్యానికి హానికరం. కాబట్టి ఓపెన్ పాత్రలో మాత్రమే బియ్యం వండటం మంచిది. పాలకూర, మెంతులు, కొల్లార్డ్ ఆకుకూరలు వంటి ఆకుకూరలను ప్రెజర్ కుక్కర్‌లో ఉడికించడం వల్ల వాటి పోషకాలు నశించి, మూత్రపిండాల్లో రాళ్లు వచ్చే ప్రమాదం పెరుగుతుంది. కాబట్టి వాటిని సాధారణ పాన్‌లో తక్కువ వేడి మీద ఉడికించడం మంచిది. బీన్స్‌లో లెక్టిన్ అనే సహజంగా లభించే టాక్సిన్ ఉంటుంది. ఇది సరిగ్గా ఉడికించకపోతే జీర్ణ సమస్యలను కలిగిస్తుంది. ఫుడ్ పాయిజనింగ్‌కు కూడా కారణమవుతుంది. అలాగే, ప్రెషర్ కుకింగ్ బీన్స్‌లోని లెక్టిన్‌ను వేగంగా విచ్ఛిన్నం చేస్తుంది. ఇది జీర్ణ సమస్యలకు దారితీస్తుంది. కాబట్టి ఈ కూరగాయలను ప్రెజర్ కుక్కర్‌లో ఉడికించడం మంచిది కాదు. ప్రెషర్ కుక్కర్‌లో పాలు మరిగించడం వల్ల దాని సహజ నిర్మాణం మారి అది పెరుగులా మారుతుంది. తద్వారా దాని పోషక విలువలు తగ్గుతాయి. పాలు మరిగించడానికి స్టీల్ లేదా నాన్-స్టిక్ పాన్ ఉత్తమం. టమోటాలు, చింతపండు లేదా పుల్లని పదార్థాలను ప్రెషర్ కుక్కర్‌లో ఉడికించడం వల్ల అవి ఆమ్లంగా మారతాయి. ఇది శరీరానికి హానికరం. కాబట్టి వాటిని స్టీల్ లేదా మట్టి పాత్రలో ఉడికించడం మంచిది. బీన్స్, కొన్ని ధాన్యాలు సహజ విష పదార్థాలను కలిగి ఉంటాయి. వీటిని ప్రెజర్ కుక్కర్‌లో పూర్తిగా తొలగించలేం. కాబట్టి, వాటిని రాత్రంతా నానబెట్టి ఆపై తక్కువ వేడి మీద ఓపెన్ పాత్రలో ఉడికించడం ఆరోగ్యకరమైనది.

# మటన్‌లోని ఈ పార్ట్ తింటే ఇక తిరుగుండదంతే



మేక మెదడు (మటన్ బ్రెయిన్) కూర బలహీనంగా ఉన్న పిల్లలకు, ఆపరేషన్ల నుండి కోలుకుంటున్న వారికి, కండరాల నిర్మాణానికి అద్భుతమైన పోషకాహారం. ఇందులో తక్కువ కార్బోహైడ్రేట్లు, ఎక్కువ ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్, ఐరన్, ప్రోటీన్ ఉంటాయి. రక్తం గడ్డకట్టకుండా చేసి, జ్ఞాపకశక్తిని పెంచుతుంది. నాన్ వెజ్ ప్రియులు మటన్ (మేక మాంసం) ను ఎంతో ఇష్టంగా తింటారు.. అయితే.. మేకలోని పలు భాగాలు.. ఎన్నో ప్రత్యేకతలను కలిగి ఉంటాయి.. ఒక్కో పార్ట్.. ఒక్కో ప్రయోజనాన్ని కలిగి ఉంటుంది.. మటన్ తిల్లి, తలకాయ, లివర్, పాయా అన్ని స్పెషలే.. అయితే.. మేక మెదడు కూడా ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలను చేకూరుస్తుంది.. మేక మెదడులో ప్రోటీన్, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్, విటమిన్ ః12, ఐరన్, భాస్వరం వంటి పోషకాలు అధికంగా ఉంటాయి.. ఇవి మెదడు ఆరోగ్యం, జ్ఞాపకశక్తి, రక్త ఉత్పత్తి, కండరాల బలానికి మేలు చేస్తాయి. కణాల మరమ్మత్తుకు సహాయపడటమే కాకుండా.. రోగనిరోధక శక్తిని పెంచుతుంది. నాన్-వెజ్ ఆహారాన్ని ఇష్టపడేవారికి, ప్రత్యేకించి ఆరోగ్య ప్రయోజనాలను కోరుకునేవారికి మేక మెదడు కూర ఒక అద్భుతమైన ఎంపిక అని డైటీషియన్లు చెబుతున్నారు. ఈ వంటకం కేవలం రుచిని మాత్రమే కాకుండా, అనేక పోషక విలువలను కూడా అందిస్తుంది. ముఖ్యంగా, ఎదుగుతున్న పిల్లలకు, శారీరకంగా బలహీనంగా ఉన్నవారికి, ఇటీవల ఆపరేషన్ల నుండి లేదా గాయాల నుండి కోలుకుంటున్న వారికి, అలాగే కండరాల నిర్మాణాన్ని లక్ష్యంగా చేసుకుని వ్యాయామం చేసేవారికి ఈ కూర చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. మేక మెదడులో కార్బోహైడ్రేట్లు తక్కువగా ఉంటాయి. అయితే ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్, ఐరన్, ప్రోటీన్ వంటి ముఖ్యమైన పోషకాలు అధికంగా ఉంటాయి. ఈ పదార్థాలు శరీరానికి శక్తిని అందించి, రోగనిరోధక శక్తిని పెంచుతాయి. ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ మెదడు ఆరోగ్యానికి, హృదయ ఆరోగ్యానికి ఎంతో అవసరం. ఐరన్ శరీరంలో హిమోగ్లోబిన్ ఉత్పత్తికి తోడ్పడుతుంది. తద్వారా రక్తహీనతను నివారిస్తుంది. ప్రోటీన్ కండరాల మరమ్మత్తుకు, పెరుగుదలకు కీలకం. అంతేకాకుండా, మేక మెదడు రక్తం గడ్డకట్టకుండా చేసి, శరీరంలో రక్త ప్రవాహాన్ని సక్రమంగా నిర్వహించడానికి సహాయపడుతుంది. ఇది ఎర్ర రక్త కణాల ఉత్పత్తిని కూడా పెంచుతుంది. తద్వారా ఆక్సిజన్ రవాణాను మెరుగుపరుస్తుంది. జ్ఞాపకశక్తిని పెంచే గుణాలు కూడా దీనిలో ఉన్నాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. అయితే కొలెస్ట్రాల్, కొవ్వు ఎక్కువగా ఉండటం వల్ల గుండె జబ్బులు ఉన్నవారు మితంగా తీసుకోవాలి. ఈ రుచికరమైన కూరను తయారుచేయడానికి, ముందుగా తాజా మేక మెదళ్లను పసుపు, ఉప్పు వేసిన నీటిలో 2-3 నిమిషాలు ఉడికించి, శుభ్రం చేసుకోవాలి. ఆ తర్వాత, నూనెలో ఉల్లిపాయలు, పచ్చిమిర్చి, కరివేపాకు, అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి వేయించాలి. శుభ్రం చేసిన మెదళ్లను వేసి, పసుపు, ఉప్పు, కారం కలిపి నిదానంగా వేయించుకోవాలి. లవంగాలు, దాల్చినచెక్క, యాలకులు, మరాఠీ మొగ్గ, అనాస పువ్వు, జీలకర్ర, ధనియాలు, గసగసాలతో తయారుచేసిన మసాలా పేస్ట్‌ను వేసి, తగినంత నీళ్లు పోసి ఉడికించాలి. మెదళ్లు మెత్తబడిన తర్వాత ముక్కలుగా కట్ చేసి, మూతపెట్టి పది నిమిషాలు ఉడికించి, చివరగా కొత్తిమీరతో గార్నిష్ చేస్తే సరిపోతుంది..

## డ్రాగన్ కంట్రీలో జనాభా సంక్షోభం గణనీయంగా తగ్గిన సంతానోత్పత్తి



డ్రాగన్ కంట్రీ చైనాలో వరుసగా నాలుగో సంవత్సరం జననాల రేటు గణనీయంగా తగ్గింది. ఫలితంగా ఇది అక్కడ జనాభా సంక్షోభానికి దారితీస్తుందన్న ఆందోళన మొదలైంది. ఒకప్పుడు జనాభాలో ప్రపంచంలో అన్ని దేశాలకంటే చైనా టాప్ లో ఉండేది. కానీ గతేడాది జులై1 జనాభా లెక్కల ప్రకారం.. ప్రపంచంలో అత్యధిక జనాభా ఉన్న దేశాల లిస్టులో భారత్ ఫస్ట్ ప్లేస్ లో నిలిచింది. చైనా రెండోస్థానానికి పడిపోయింది. 2022లో చైనా మొదటి స్థానంలో ఉండగా.. మూడేళ్లుగా రెండోస్థానంలోనే కొనసాగుతోంది. 2024లో నమోదైన జనాభా సంఖ్యతో పోలిస్తే 2025లో జననాల సంఖ్య 17 శాతం తక్కువగా నమోదైందని అక్కడి గణాంకాలు చెబుతున్నాయి. గతేడాది అక్కడ జననాల సంఖ్య 79.2 లక్షలుగా నమోదయింది. ఆసియా ఖండంలో ఉన్న ఇతర దేశాలతో పోలిస్తే.. చైనాలో సంతానోత్పత్తి రేటు రోజురోజుకూ తగ్గుతోందని, ఇది దేశంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని చైనా ఆర్థిక రంగ నిపుణులు చెప్తున్నారు. చైనాలో పిల్లల్ని కనేందుకు జంటలు వెనుకాడుతున్నాయి. ఇందుకు ప్రధాన కారణం.. అక్కడి ప్రజల జీవన ఖర్చులు పెరగడమే. పిల్లల పెంపకం చాలా ఎక్స్పెన్సివ్ కావడంతో కనకపోవడమే మంచిదని భావిస్తున్నారు. పిల్లలు పుట్టినప్పటి నుంచి 18 ఏళ్ల వరకూ చదువుకి, ఇతర సౌకర్యాలు కల్పించేందుకు సరాసరి 76 వేల డాలర్లు అంటే మన కరెన్సీలో రూ.69 లక్షలు ఖర్చవుతున్నట్లు ఒక అంచనా ఉంది. అందుకే పెళ్లిళ్లు చేసుకునేందుకు వెనుకాడుతున్నారు. పెళ్లయిన వాళ్లు పిల్లల్ని కనాలంటే ఖర్చు గురించి ఆలోచిస్తున్నారు. ఈ ఆలోచన ధోరణిని తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఇప్పటికే కండ్రోమ్స్, గర్భనిరోధక మాత్రలపై 13 శాతం పన్ను విధించింది. నర్సరీ నుంచి కిండర్ గార్టెన్స్ వరకూ, వృద్ధుల సంరక్షణ, వికలాంగుల సేవలు, వివాహ సంబంధిత సేవలు.. వంటివాటిపై ఈ ఏడాది జనవరి 1 నుంచి పన్నును మినహాయించింది.

## ప్రజల్లో పెరుగుతున్న పొట్టతో దేశానికి తీవ్ర నష్టం తప్పదట?

మీరు ఆఫీసులో గంటల తరబడి కూర్చుంటున్నారా..? మీ బరువు పెరుగుతోందా..? చిన్న వయసులోనే షుగర్ వచ్చిందా..? అయితే అలర్ట్..! ఇది కేవలం మీ ఇంట్లో సమస్య కాదు.. దేశ ఆర్థిక వ్యవస్థకే ఒక పెద్ద ముప్పు! అదేంటని ఆశ్చర్యపోతున్నారా..? అసలు లావు వల్ల దేశానికి ఇంత నష్టమా? మనం తినే తిండికి, దేశం డెవలప్‌మెంట్‌కి లింక్ ఏంటి? ప్రపంచాన్ని ఇప్పుడు రెండు దెయ్యాలు పట్టి పీడిస్తున్నాయి. ఒకటి ఊబకాయం.. రెండు డయాబెటిస్! ఈ జబ్బుల వల్ల ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏడాదీ ఏకంగా 5 కోట్ల 40 లక్షల మంది పనికి దూరమవుతున్నారు. అంటే ఒక రకంగా ఒక చిన్న దేశ జనాభా మాయమైపోతున్నట్టే! ఇదే స్పీడ్‌లో వెళ్తే.. 2035 నాటికి ప్రపంచంలో సగం మంది జనాభా.. అవును సగం మంది.. ఓవర్ వెయిట్‌తో బాధపడతారట. దీనివల్ల ప్రపంచానికి ఏటా 4 ట్రిలియన్ డాలర్ల నష్టం వస్తుందని హెచ్చరిస్తున్నారు నిపుణులు. ?ఇక మన భారతదేశ పరిస్థితి చూస్తే భయమేస్తుంది. డయాబెటిస్ వల్ల ఎక్కువ నష్టపోతున్న దేశాల్లో మనది రెండో స్థానం. మన దేశం మీద పడుతున్న భారం ఎంతో తెలుసా? 1.6 ట్రిలియన్ డాలర్లు! మన దగ్గర చాలామందికి చిన్న వయసులోనే షుగర్ రావడం, ఆఫీసులకు సెలవులు పెట్టడం, లేదా త్వరగా రిటైర్ అయిపోవడం వల్ల.. కంపెనీలకు, దేశానికి కోట్లలో నష్టం వస్తోంది. ?కానీ.. ఇప్పుడే మేల్కొంటే లాభం కూడా గట్టిగానే ఉంటుంది! ప్రజల ఆరోగ్యం మీద రూపాయి ఖర్చు పెడితే.. భవిష్యత్తులో అది వంద రెట్లు తిరిగి ఇస్తుంది. అందరూ ఫిట్‌గా ఉంటే 2050 నాటికి ప్రపంచ ఎకానమీకి 11 ట్రిలియన్ డాలర్లు అదనంగా వచ్చి చేరతాయట. ఇప్పటికే అమెరికాలో కొత్త రకం మందులు (ఉఒఖ-1) వాడి ఒబేసిటీని 2శాతం తగ్గించారు. మనం కూడా ఆ దిశగా వెళ్లాల్సిన టైం వచ్చింది. ఫైనల్‌గా చెప్పేది ఒక్కటే.. కంపెనీలు, గవర్నమెంట్లు.. జబ్బు వచ్చాక మందులకు డబ్బులు ఇవ్వడం కాదు.. అసలు జబ్బు రాకుండా ముందే జాగ్రత్త పడాలి. పోషకాహారం, రెగ్యులర్ చెకప్స్ ముఖ్యం. ఎందుకంటే.. వర్కర్ ఫిట్‌గా ఉంటేనే.. దేశం హిట్ అవుతుంది! ఇది మన ఆర్థిక నిపుణులు చెబుతున్న అంచనాలు.

## 30 ఏళ్ల తర్వాత అకస్మాత్తుగా బరువు ఎందుకు పెరుగుతారు

30 సంవత్సరాల వయస్సు తర్వాత.. చాలా మందికి అకస్మాత్తుగా బరువు పెరగడం.. అలాగే అలసట, నీరసం లాంటివి పెరుగుతాయి. దీనికి ప్రధాన కారణం అవసరమైన విటమిన్లు లేకపోవడం కావచ్చంటున్నారు ఆరోగ్య నిపుణులు. 30 ఏళ్ల తర్వాత చాలా మంది పురుషులు, మహిళలు అకస్మాత్తుగా బరువు పెరగడం.. నిరంతరం అలసటను అనుభవిస్తారు. గతంలో సులభంగా ఉండే పనులు ఇప్పుడు శ్రమతో కూడుకున్నవిగా.. అలసిపోయేలా చేసేవిగా అనిపిస్తాయి. ప్రజలు తరచుగా వృద్ధాప్యం, పని ఒత్తిడి లేదా మారుతున్న దినచర్యలు దీనికి కారణమని చెబుతారు. అయితే, చాలా సందర్భాలలో, ముఖ్యమైన విటమిన్లు లేకపోవడం ప్రధాన కారణం కావచ్చు.. దీనిని తరచుగా నిర్లక్ష్యం చేస్తారని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. శరీరానికి తగినంత విటమిన్లు అందనప్పుడు.. దాని ప్రభావాలు క్రమంగా కనిపిస్తాయి. బరువు పెరగడం, శక్తి లేకపోవడం, బద్ధకం దీనికి సంకేతాలు కావచ్చు. ఈ లక్షణాలు రోజువారీ జీవితాన్ని ప్రభావితం చేయడం ప్రారంభిస్తాయి. కాబట్టి, ఈ మార్పులను తేలికగా తీసుకోవడం తెలివైనది కాదు. శరీరంలో ఏ విటమిన్ లోపాలు బరువు పెరగడానికి, అలసటకు దారితీస్తాయి..? ఇంతలో, విటమిన్ ః12 శరీరానికి శక్తిని అందించడంలో, ఆరోగ్యకరమైన నాడీ వ్యవస్థను నిర్వహించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ః12 లోపం శక్తి ఉత్పత్తి తగ్గడానికి దారితీస్తుంది.. అలసట, బలహీనత, కార్యాచరణ తగ్గడానికి దారితీస్తుంది. ఈ రెండు విటమిన్లలో దీర్ఘకాలిక లోపాలు బరువు నియంత్రణను కష్టతరం చేస్తాయి.. ఇంకా తీవ్ర అలసటకు దారితీస్తాయి. విటమిన్ డి లోపాన్ని అధిగమించడానికి, ప్రతిరోజూ కొంత సమయం ఎండలో గడపడం ప్రయోజనకరంగా ఉంటుంది. అదనంగా, మీ ఆహారంలో పాలు, పెరుగు, బలవర్థకమైన ఆహారాలను చేర్చుకోండి. విటమిన్ బి 12 కోసం, పాలు, పెరుగు, జున్ను, పప్పుధాన్యాలు, ఆకుపచ్చ కూరగాయలు, చేపలు, చికెన్, గుడ్లు, బలవర్థకమైన ఆహారాలను మీ ఆహారంలో చేర్చుకోండి. అవసరమైతే, వైద్యుడి సలహాతో సప్లిమెంట్లను తీసుకోవచ్చు.

# లంకలో టీమిండియా పేసర్లకు కఠిన పరీక్ష.. రాణించాలంటే ఇవి తప్పవన్న మోర్కెల్

- శ్రీలంకతో టెస్ట్ సిరీస్‌కు ముందు భారత పేసర్లకు బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ సూచనలు
- వేడి, ఉక్కపోతకు త్వరగా అలవాటుపడాలని హితవు
- కూకబుర్రా బంతి త్వరగా మెత్తబడుతుందని, అందుకు సిద్ధంగా ఉండాలని హెచ్చరిక
- గాయంతో బుమ్రా దూరం కావడంతో సిరాజ్‌పై పెరిగిన భారం
- బంతి పాతబడ్డాక స్మార్ట్‌గా బౌలింగ్ చేసి ఒత్తిడి పెంచాలని పిలుపు
- ఆగస్టు 15 నుంచి తొలి టెస్టు



**హైదరాబాద్ పెన్ పవర్:** శ్రీలంక పర్యటనలో భారత ఫాస్ట్ బౌలర్లకు కఠిన సవాళ్లు ఎదురుకానున్నాయని, వాటిని అధిగమించాలంటే త్వరగా పరిస్థితులకు అలవాటుపడాలని టీమిండియా బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ సూచించారు. లంకలోని తీవ్రమైన వేడి, ఉక్కపోతతో పాటు కుకబుర్రా బంతి స్వరూపం మారడాన్ని అర్థం చేసుకుని, ఒత్తిడిని సృష్టించేందుకు సృజనాత్మకంగా ఆలోచించడం చాలా కీలకమని ఆయన స్పష్టం చేశారు. శనివారం నుంచి ప్రారంభం కానున్న రెండు టెస్టుల సిరీస్‌లో భారత పేసర్లు తీవ్రతను కొనసాగించడం అత్యవసరమని మోర్కెల్ పేర్కొన్నారు. కీలక పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా మోకాలి గాయంతో ఈ సిరీస్‌కు దూరం కావడంతో భారత పేస్ దళానికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. దీంతో ప్రస్తుతం జట్టులో మహమ్మద్ సిరాజ్ అత్యంత అనుభవజ్ఞుడైన పేసర్‌గా మారాడు. ప్రసిద్ధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్, కొత్తగా జట్టులోకి వచ్చిన అకిబ్ నబీలతో భారత పేస్ దళం బరిలోకి దిగనుంది. శ్రీలంక పరిస్థితులపై మోర్కెల్ మాట్లాడుతూ, "ఇక్కడికి రావడంలో అతిపెద్ద సవాలు వేడి, ఉక్కపోత. అలాగే, కుకబుర్రా బంతి 25-30 ఓవర్ల తర్వాత మెత్తబడిపోతుంది. ఈ వాస్తవాన్ని మనం అంగీకరించాలి. ఇలాంటి పరిస్థితుల్లో అంతా మన మైండ్‌సెట్‌పై ఆధారపడి ఉంటుంది. ఫాస్ట్ బౌలర్‌గా చిన్న స్పెల్స్ వేసినా, బంతిపై పూర్తి శక్తిని ప్రయోగించి సరైన ప్రాంతాల్లో సంధిస్తే అవకాశాలు వాటంతట అవే వస్తాయి" అని వివరించారు. బంతి కొత్తగా ఉన్నప్పుడు దాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఆ తర్వాత అవకాశాలు సృష్టించుకోవడానికి ప్రత్యామ్నాయ మార్గాలు వెతకాలని మోర్కెల్ సూచించారు. "టెస్ట్ మ్యాచ్ సాగేకొద్దీ పిచ్‌పై బౌన్స్ హెచ్చుతగ్గులుగా మారే అవకాశం ఉంది. మేం గత కొన్ని నెలలుగా రెడ్-బాల్ క్రికెట్ ఎక్కువగా ఆడలేదు. కాబట్టి తిరిగి ఆ ఫార్మాట్‌లోకి రావడం కూడా ఒక సవాలే. నిలకడగా ఓవర్లు వేస్తూ తీవ్రతను కొనసాగిస్తే బ్యాటర్లపై ఒత్తిడి పెంచవచ్చు," అని ఆయన అన్నారు. బంతి పాతబడిన తర్వాత క్రీజును ఉపయోగించుకోవడం, షార్ట్ బంతులను వ్యూహాత్మకంగా ప్రయోగించడం వంటి విషయాల్లో "స్ట్రీట్ స్మార్ట్"గా ఆలోచించాలని మోర్కెల్ తన బౌలర్లకు పిలుపునిచ్చారు. ఆగస్టు 15 నుంచి గాలేలో తొలి టెస్టు, ఆగస్టు 23 నుంచి కొలంబోలో రెండో టెస్టు జరగనున్నాయి.

# ఈసారి ఆసియా క్రీడల్లో భారత్-పాక్ మ్యాచ్ జరగాలంటే.. ఇదే ఏకైక మార్గం!

- జపాన్‌లో జరగనున్న ఆసియా క్రీడలు 2026లో భారత క్రికెట్ జట్లు
- పురుషుల, మహిళల విభాగాల్లో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి టీమిండియా
- ఫైనల్ లేదా కాంస్య పతక పోరులోనే భారత్-పాకిస్థాన్ మ్యాచ్‌కు అవకాశం
- పురుషుల జట్టుకు శ్రేయాస్ అయ్యర్, మహిళల జట్టుకు హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యం



**హైదరాబాద్ పెన్ పవర్:** జపాన్‌లోని ఐచి-నగోయా వేదికగా జరగనున్న ఆసియా క్రీడలు 2026లో భారత పురుషుల, మహిళల క్రికెట్ జట్లు మరోసారి సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నాయి. సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు ఈ మెగా ఈవెంట్ జరగనుంది. గతంలో హాంగ్జౌలో జరిగిన క్రీడల్లో రెండు విభాగాల్లోనూ స్వర్ణ పతకాలు గెలుచుకున్న భారత జట్లు, ఈసారి డిఫెండింగ్ ఛాంపియన్లుగా బరిలోకి దిగుతున్నాయి. ఈ టోర్నీలో అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూసే భారత్-పాకిస్థాన్ మ్యాచ్ జరగాలంటే కేవలం రెండు అవకాశాలు మాత్రమే ఉన్నాయి. ఈ చిరకాల ప్రత్యర్థులు స్వర్ణ పతకం కోసం ఫైనల్లో తలపడాలి లేదా కాంస్య పతకం కోసం జరిగే ప్లే-ఆఫ్ మ్యాచ్‌లో అయినా పోటీపడాలి. అంటే.. ఈ హై-వోల్టేజ్ మ్యాచ్ జరగాలంటే ఇరు జట్లు సెమీఫైనల్స్ గెలిచి ఫైనల్ చేరడమో లేదా సెమీస్‌లో ఓడిపోవడమో జరగాలి. అన్ని మ్యాచ్‌లు పూర్తి అంతర్జాతీయ హోదాతో టీ20 ఫార్మాట్‌లో జరగనున్నాయి. పురుషుల విభాగంలో టాప్ సీడ్ జట్లుగా భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్, శ్రీలంక నేరుగా క్వార్టర్ ఫైనల్స్‌కు అర్హత సాధించాయి. మిగిలిన నాలుగు స్థానాల కోసం ఇతర జట్లు గ్రూప్ దశలో పోటీపడతాయి. భారత పురుషుల జట్టుకు శ్రేయాస్ అయ్యర్ కెప్టెన్‌గా, యువ ఆటగాడు తిలక్ వర్మ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి కూడా 15 మంది సభ్యుల జట్టులో చోటు దక్కింది.

మహిళల విభాగంలో సెప్టెంబర్ 17 నుంచి పోటీలు ప్రారంభం కానున్నాయి. క్వార్టర్ ఫైనల్‌లో భారత జట్టు జపాన్‌తో తలపడుతుంది. ఈ మ్యాచ్‌లో గెలిస్తే బంగ్లాదేశ్ లేదా చైనా జట్టుతో సెమీఫైనల్‌లో ఆడుతుంది. మరో క్వార్టర్‌లో పాకిస్థాన్ జట్టు థాయ్‌లాండ్‌తో తలపడనుంది. మహిళల జట్టుకు హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్‌గా, స్మృతి మంధాన వైస్ కెప్టెన్‌గా కొనసాగనున్నారు. మొత్తం మీద రెండు విభాగాల్లోనూ పటిష్ఠమైన జట్లతో బరిలోకి దిగుతున్న భారత్, మరోసారి పసిడి పతకాలే లక్ష్యంగా ప్రయాణం మొదలుపెట్టనుంది.

## టెస్టుల్లో మిచెల్ స్టార్క్ ప్రపంచ రికార్డు.. అత్యధిక వికెట్లు తీసిన లెఫ్ట్ ఆర్మ్ బౌలర్‌గా చరిత్ర



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆస్ట్రేలియా వెటరన్ ఫాస్ట్ బౌలర్ మిచెల్ స్టార్క్ టెస్ట్ క్రికెట్‌లో సరికొత్త ప్రపంచ రికార్డు సృష్టించాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో అత్యధిక వికెట్లు పడగొట్టిన ఎడమచేతి వాటం బౌలర్‌గా చరిత్రకెక్కాడు. ఈ క్రమంలో శ్రీలంక దిగ్గజ స్పిన్నర్ రంగనా హెరాత్ (433) రికార్డును అధిగమించాడు. బంగ్లాదేశ్‌తో డార్విన్‌లోని మరారా క్రికెట్ గ్రౌండ్‌లో జరుగుతున్న తొలి టెస్టులో ఈ అరుదైన ఘనతను అందుకున్నాడు. ఈ మ్యాచ్‌లో బంగ్లాదేశ్ ఓపెనర్ షాద్మాన్ ఇస్లామ్‌ను ఔట్ చేయడం ద్వారా స్టార్క్ తన టెస్టు వికెట్ల సంఖ్యను 434కి పెంచుకున్నాడు. తన 106వ టెస్టులో ఈ మైలురాయిని చేరుకున్న స్టార్క్, భారత క్రికెట్ దిగ్గజం కపిల్ దేవ్ (434 వికెట్లు) రికార్డును సమం చేశాడు. ప్రస్తుతం టెస్టుల్లో ఆల్-టైమ్ వికెట్ టేకర్ల జాబితాలో 10వ స్థానంలో ఉన్న దక్షిణాఫ్రికా పేస్ దిగ్గజం డేల్ స్టెయిన్ (439) రికార్డును బద్దలు కొట్టడానికి స్టార్క్ కేవలం ఆరు వికెట్ల దూరంలో ఉన్నాడు. ఈ రికార్డుతో ఎడమచేతి వాటం బౌలర్ల జాబితాలో స్టార్క్ అగ్రస్థానాన్ని పదిలం చేసుకున్నాడు. రంగనా హెరాత్ (433), పాకిస్థాన్ గ్రేట్ వసీం అక్రమ్ (414), న్యూజిలాండ్ స్పిన్నర్ డానియల్ వెటోరి (362), శ్రీలంక పేసర్ చమిందా వాస్ (355) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. భారత ఆల్‌రౌం డర్ రవీంద్ర జడేజా 348 వికెట్లతో ఈ జాబితాలో ఆరో స్థానంలో కొనసాగుతున్నాడు. అయితే, వ్యక్తిగత రికార్డులపై తాను పెద్దగా దృష్టి పెట్టనని, జట్టు ప్రయోజనాలే ముఖ్యమని ఈ సిరీస్‌కు ముందు స్టార్క్ పేర్కొన్నాడు. ఐసీసీ కథనం ప్రకారం.. "ఇలాంటి దిగ్గజాల సరసన నా పేరు వినిపించడం గౌరవంగా ఉంది. కానీ, ఆడుతున్నప్పుడు ఈ గణాంకాలకు పెద్దగా ప్రాధాన్యం ఉండదు" అని స్టార్క్ తెలిపాడు. కాగా, స్టార్క్ ఈ చారిత్రక ఘనత సాధించిన రోజే ఆస్ట్రేలియా జట్టు బ్యాటింగ్‌లో ఘోరంగా విఫలమైంది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న ఆసీస్, బంగ్లాదేశ్ బౌలర్ల ధాటికి కేవలం 198 పరుగులకే కుప్పకూలింది. బంగ్లా బౌలర్ హసన్ మహమూద్ 55 పరుగులిచ్చి 6 వికెట్లతో కెరీర్ బెస్ట్ ప్రదర్శన చేశాడు. ఆసీస్ తరపున స్టీవ్ స్మిత్ (71) ఒక్కడే పోరాడాడు.



గ్లామరస్ సంప్రదాయ లుక్‌తో ఆకట్టుకుంటున్న మౌనీ రాయ్

# దుల్కర్ వెనక్కి తగ్గితే అసలు లాభం ఎవరికి?



సౌత్ సినీ ఇండస్ట్రీలో ఇటీవలి కాలంలో ఒక ట్రెండ్ స్పష్టంగా కనిపిస్తోంది. భారీ అంచనాలతో రిలీజ్ డేట్స్ ప్రకటించిన సినిమాలు, చివరి దశ పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ కారణంగా వాయిదా పడుతున్నాయి. ఇప్పుడు దుల్కర్ సల్మాన్ నటించిన యాక్షన్ థ్రిల్లర్ ఐ యామ్ గేమ్ కూడా అదే లిస్ట్ లో చేరే అవకాశంపై మాలీవుడ్‌లో డిస్కషన్ జరుగుతోంది. ఆగస్టు 20, 2026న రిలీజ్ కావాల్సిన ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ పూర్తికాకపోవడంతో రిలీజ్ డేట్ మారే అవకాశం ఉందనే ప్రచారం ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తోంది.

ఇది కేవలం ఒక సినిమా పోస్ట్ పోన్ మాత్రమే కాదు. పెద్ద సినిమాల రిలీజ్ ప్లాన్స్ ఎలా మారుతున్నాయనే ప్రశ్నను కూడా ముందుకు తెస్తోంది. గతంలో రిలీజ్ డేట్ అనౌన్స్ చేసిన తర్వాత దానిని మార్చడం అరుదుగా జరిగేది. కానీ ఇప్పుడు యాక్షన్ థ్రిల్లర్లు, విజువల్ ఎఫెక్ట్స్ ఆధారిత సినిమాలు, బహుభాషా రిలీజులతో పోస్ట్ ప్రొడక్షన్ దశ మరింత క్లిష్టంగా మారింది. డబ్బింగ్, డీఐ, సౌండ్ డిజైన్, వీఎఫ్ఎక్స్, సెన్సార్ ప్రక్రియల సమన్వయం కారణంగా ఆఖరి దశలో ఆలస్యాలు పెరుగుతున్నాయని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఐ యామ్ గేమ్ పోస్ట్ పోన్ అయితే దాని ఎఫెక్ట్ బాక్సాఫీస్ ఈక్వేషన్స్ పై కూడా కనిపించే అవకాశం ఉంది. అదే రోజున రిలీజ్ కు రెడీ అవుతున్న పృథ్వీరాజ్ సుకుమారన్ ఖలీఫాకు సోలో రిలీజ్ అడ్వాంటేజ్ దక్కే అవకాశముంటుంది. స్క్రీన్ కౌంట్ పెరగడం, మంచి ఓపెనింగ్స్ రావడం వంటి అంశాలు దానికి అనుకూలంగా మారవచ్చు. మరోవైపు మమిత బైజు నటించిన బేతేళం కుడుంబ యూనిట్‌కు కూడా మల్టీప్లెక్స్ పోటీ తగ్గి ఫ్యామిలీ ఆడియన్స్‌లో ఎక్కువ షేర్ దక్కే అవకాశాలు పెరుగుతాయి. దీంతో ఆగస్టు 20 మాలీవుడ్ బాక్సాఫీస్ ఈక్వేషన్ పూర్తిగా మారే పరిస్థితి ఏర్పడుతుంది. మూడు సినిమాల మధ్య పోటీ ఉండాల్సిన చోట, రెండు సినిమాల మధ్య ప్రధాన పోటీకి పరిస్థితి చేరుకోవచ్చు. ఈ మార్పు డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు, థియేటర్ చైన్ల స్క్రీన్ కేటాయింపులపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. పాన్ ఇండియా మార్కెట్ టార్గెట్ గా రిలీజవుతున్న సినిమాల సంఖ్య పెరగడం కూడా ఈ ట్రెండ్‌కు మరో కారణంగా కనిపిస్తోంది. ఒకేసారి మలయాళం, తెలుగు, తమిళం, హిందీ మార్కెట్లను టార్గెట్ గా చేసుకోవడం వల్ల ప్రతి వెర్షన్‌ను ఒకే స్థాయిలో రెడీ చేయాల్సి వస్తోంది. ఫలితంగా రిలీజ్ డేట్ కంటే క్వాలిటీకు ప్రాధాన్యం ఇస్తూ నిర్మాతలు చివరి నిమిషంలో కూడా డెసిషన్స్ మార్చేందుకు వెనుకాడటం లేదు. అఫీషియల్ అనౌన్స్‌మెంట్ ఇంకా రానప్పటికీ, ఐ యామ్ గేమ్ చుట్టూ జరుగుతున్న డిస్కషన్ ఒక విషయాన్ని స్పష్టం చేస్తోంది. భారీ సినిమాల యుగంలో పోస్ట్ ప్రొడక్షన్ ఇప్పుడు కేవలం టెక్నికల్ దశను కాదు, రిలీజ్ ప్లాన్ ను డిసైడ్ చేసే కీలక అంశంగా మారుతోంది.



స్టైలిష్ కార్సెట్ మరియు బ్లేజర్ లుక్‌లో ఆకట్టుకుంటున్న జహ్రా ఎస్. ఖాన్

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965